Postel No. MBN/08/2016-2018




పురాతనమైన సమస్తరోగాలకు
ఆయుర్వేద చికిత్స
మూల వ్యాధి, తెల్లమచ్చలు,చర్మవ్యాధులతోపాటు అన్ని రకాల రోగాలకు పసమూలికలతో వైద్యచేయబడును.
శ్రీ దత్తత్రిలింగేశ్వరామాలయము
నారాయణపేట రోడు,ఊట్కూర్‌మండలం
మహబూబ్‌నగర్ జిల్లా సెల్ 9640418895



# వార్తా తరంగాలు

జాతీయ తెలుగు దిన పత్రిక

website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com

Published from mahabub nagar సంపుటి :24 సంచిక :300 సంపాదకులు: కోటకొండ ఎడ్ల విజయరాజు బుధవారం 25 ఫిబ్రవరి 2026 పేజీలు :12 వెల రూ5 /-


## పరిషత్ ఎన్నికలకు
# లాంగ్ బ్రేక్...

హైదరాబాద్, ఫిబ్రవరి 24:తెలంగాణలో ఇటీవల మున్సిపల్ ఎన్నికలు ముగిశాయి. 7 మున్సిపల్ కార్పోరేషన్లతో పాటు 116 మున్సిపాలిటీల్లో ఎన్నికలు పూర్తయ్యాయి. ఇక పంచాయతీ ఎన్నికలు కూడా డిసెంబర్‌లో ముగిశాయి. ఇక మిగిలింది,గ్రూజ, ఫ్రీజ ఎన్నికల ప్రక్రియే. పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ సత్తా చాటింది. 80 శాతానికి పైగా స్థానాలు కైవసం చేసుకుంది. ఇదే ఊపులో మిగిలిన జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించాలని కాంగ్రెస్ పెద్దలు భావిస్తున్నారు. క్షేత్రస్థాయిలో రాజకీయ నిరుద్యోగులు సైతం త్వరగా ఎన్నికలు నిర్వహించాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా ఎన్నికల నిర్వహణపై అప్డేట్ వచ్చింది.ఇప్పట్లో ఎన్నికలు జరిగేలా కనిపించటం లేదు. ఎందుకంటే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన



సంగతి తెలిసిందే. అందుకు సంబంధించి బిల్లును రూపొందిచగా.. ప్రస్తుతం అది కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఏదో ఒకటి తేల్చిన తర్వాతే - మిగతా3లో

# సర్కార్ చేతికి మెట్రో...

## మెట్రోకు రూ.13 వేల కోట్ల రుణాలను ట్రాన్స్‌ఫర్.....

హైదరాబాద్, ఫిబ్రవరి 24:తాజాగా జరిగిన తెలంగాణ మంత్రివర్గ సమావేశంలో హైదరాబాద్ మెట్రో స్వాధీనంపై కీలక నిర్ణయం తీసుకున్నారు. ఎల్ అండ్ టీ కంపెనీ నుంచి హైదరాబాద్ మెట్రోను పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని నిర్ణయించింది. ఇక ఈ స్వాధీన ప్రక్రియను పర్యవేక్షించేందుకు మంత్రి వర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసింది. రూ.2 వేల కోట్లను ఎల్ అండ్ టీకి చెల్లించడంతోపాటు.. మరో రూ.13 వేల కోట్ల రుణాలను ట్రాన్స్‌ఫర్ చేసుకునేందుకు ఇప్పటికే సూత్రప్రాయంగా అవగాహన చేసుకున్నాయి.ఇప్పటివరకు ఎల్ అండ్ టీ కంపెనీ నిర్వహిస్తున్న హైదరాబాద్ మెట్రోను పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని తెలంగాణ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ మెట్రో స్వాధీనంపై ఇప్పటికే తెలంగాణ సర్కార్ ప్రకటన



విడుదల చేసింది. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్ మెట్రోను ఎలా స్వాధీనం చేసుకోవాలి అనే ప్రక్రియను పర్యవేక్షించేందుకు కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలోని ఈ కమిటీలో మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావులు సభ్యులుగా ఉండనున్నారు. అయితే మెట్రో స్వాధీనానికి సంబంధించి గత ఏడాదిలోనే ఎల్ అండ్ టీ కంపెనీతో తెలంగాణ ప్రభుత్వానికి సూత్రప్రాయంగా ఒప్పందం జరిగిన సంగతి తెలిసిందే.గత ఒప్పందంలో భాగంగా హైదరాబాద్ మెట్రోను స్వాధీనం చేసుకునేందుకు మొత్తంగా రూ.15 వేల కోట్లుగా అంచనా వేసింది. ఇందులో భాగంగానే మెట్రోకు ఉన్న రూ.13 వేల కోట్ల రుణాలను ఎల్ అండ్ టీ కంపెనీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం బదలాయించుకోనుంది. అదే సమయంలో మరో రూ.2 వేల కోట్ల ఈక్విటీని ఒకేసారి ఆ సంస్థకు చెల్లించేలా ప్రభుత్వం, ఎల్ అండ్ టీ కంపెనీ అవగాహనకు వచ్చాయి. ఈ అవగాహన ఒప్పందం తర్వాతే మెట్రో స్వాధీన ప్రక్రియ ప్రారంభం అయింది. ఈ నేపథ్యంలోనే - మిగతా3లో

# తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు ముహూర్తం ఖరారు

హైదరాబాద్:మార్చి 16 నుంచి 30 వరకు జరగనున్న సమావేశాలు మార్చి 16న ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం మార్చి 20న బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ భేటీలో నిర్ణయం..తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు ముహూర్తం ఖరారైంది. మార్చి 16 నుంచి 30వ వరకు సమావేశాలు నిర్వహించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన




సచివాలయంలో జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ మేరకు షెడ్యూల్‌ను ఖరారు చేశారు.సమావేశాల తొలిరోజైన మార్చి 16న ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ప్రసంగిస్తారు. అనంతరం మార్చి 17, 18 తేదీల్లో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరుపుతారు. మార్చి 20వ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను సభలో ప్రవేశపెట్టనున్నారు.

## కలకలం రేపుతున్న
# 1000 కోట్ల లెక్కలు

హైదరాబాద్, ఫిబ్రవరి 24:జకీయ నాయకులు అన్నాక విమర్శలు చేయడం సహజం. కొన్ని సంచలన ఆరోపణలు చేయడం కూడా సహజం. కానీ, తెర వెనుక జరిగే విషయాలను బయట పెడితే మాత్రం.. రాజకీయ నాయకుల అసలు రంగు బయటపడుతుంది. ఇప్పుడు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఆయన అసలు రూపాన్ని బయటపెట్టాయి.తెలంగాణ రాష్ట్రంలో ఈ యాసంగి సీజన్ దాదాపు సగం దశకు వచ్చినప్పటికీ ఇంతవరకు రైతు భరోసా ఇవ్వలేదు. సన్న వడ్లకు బోనస్ మొన్న అంటే మొన్న వేశారు. రైతులు రైతు భరోసా డబ్బుల కోసం కళ్ళు కాయలు కాసే విధంగా ఎదురుచూస్తున్నారు. ఇలాంటి క్రమంలో రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్రం నుంచి 1000 కోట్లను కాంగ్రెస్ ఢిల్లీ పెద్దలకు పంపిద్దామని చెప్పడం రాజకీయంగా దుమారాన్ని రేపుతోంది. ఇప్పటికే గులాబీ పార్టీ నేతలు అనేక సందర్భాలలో తెలంగాణ రాష్ట్రాన్ని కాంగ్రెస్ పార్టీకి ఏటీఎం గా మార్చారని ఆరోపిస్తున్నారు.పదేపదే రేవంత్ రెడ్డి పై విమర్శలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి ఢిల్లీకి వెళ్లడాన్ని తీవ్రంగా తప్పుపడుతున్నారు. ఇటీవల కాంగ్రెస్ హై కమాండ్ వద్దకు తెలంగాణ నాయకులు వెళ్లారు. ఆ సమయంలో 1000 కోట్ల గురించి ప్రస్తావన వచ్చిందని.. కేరళ రాష్ట్రంలో జరిగే ఎన్నికల్లో ఖర్చుల కోసం తెలంగాణ నుంచి డబ్బులు పంపించాలని కాంగ్రెస్ పెద్దలు సూచించారని.. కేరళ రాష్ట్రంలో జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున ముఖ్యమంత్రి అభ్యర్థిగా కేసీ వేణుగోపాల్ ను నియమించామని.. తెలంగాణ రాష్ట్ర నాయకత్వానికి కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వం చెప్పినట్టు గులాబీ పార్టీ తన మీడియా, సోషల్ మీడియాలో ప్రచారం చేసింది.వాస్తవానికి దీనికి సరైన కౌంటర్ కాంగ్రెస్ పార్టీ నుంచి రాలేదు. దీంతో అందరూ అదే నిజమనే భావనతో ఉన్నారు. అయితే కొంతమంది మాత్రం ఇది రాజకీయంగా కాంగ్రెస్ పార్టీని ఇబ్బంది పెట్టడానికి గులాబీ పార్టీ చేస్తున్న ప్రయత్నం అని అనుకున్నారు. రేవంత్ రెడ్డి మాటలతో ఆ వెయ్యి కోట్ల వ్యవహారం అబద్ధం కాదని.. కావాలని చేస్తున్న ప్రచారం అంతకంటే కాదని.. అది నిజమని తేలిపోయింది. " గాంధీ కుటుంబానికి ఆర్థిక అవసరాలు ఉన్నాయని.. అందరం కలిసి తెలంగాణ నుంచి 1000కోట్ల రూపాయలు సమకూర్చి ఇవ్వగలిగే శక్తి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఉందని" రేవంత్ రెడ్డి అనడం సంచలనాన్ని కలిగిస్తోంది.సాధారణంగా చూస్తే రేవంత్ రెడ్డి మాట్లాడిన మాటల్లో పెద్దగా తప్పు కనిపించడం లేదు. రేవంత్ రెడ్డి ఇస్తామని చెప్పిన డబ్బులు ప్రభుత్వం నుంచి కాదు.. కేవలం కార్యకర్తలం అందరం కలిసి డబ్బులు ఇస్తామని అన్నారు. విరాళాల రూపంలో - మిగతా3లో




# గులాబీ మౌనం...

హైదరాబాద్, ఫిబ్రవరి 24:తెలంగాణ రాజకీయ ముఖచిత్రం ప్రస్తుతం ఆసక్తికరమైన మలుపు తిరుగుతోంది. కాంగ్రెస్, బీజేపీ మధ్య సాగుతున్న ప్రత్యక్ష పోరాటాలు ప్రజాక్షేత్రంలో హోరెత్తుతుంటే, ప్రధాన ప్రతిపక్షంగా ఉండాల్సిన బీఆర్ఎస్ వ్యూహాత్మక మౌనం పాటిస్తోందనే చర్చ జరుగుతోంది. రాష్ట్రంలో ప్రధాన పోటీ తమ మధ్యే అన్నట్లుగా కాంగ్రెస్, బీజేపీ శ్రేణులు వీధి పోరాటాలకు ప్రాధాన్యత ఇస్తున్నాయి. కామారెడ్డిలో మొదలైన నిరసన జ్వాలలు క్రమంగా రాష్ట్రమంతటా విస్తరించడం చూస్తుంటే.. ప్రజల్లో ఇతర ప్రత్యామ్నాయం లేదనే భావన కలిగించడం ఈ రెండు పార్టీల ఉమ్మడి ఎత్తుగడగా కనిపిస్తోంది. క్షేత్రస్థాయి సమస్యలపై ఈ రెండు పార్టీలు పరస్పరం విమర్శలు చేసుకుంటూ వార్తల్లో నిలుస్తుండటంతో రాజకీయం అంతా వారి చుట్టూనే తిరుగుతోంది.మరోవైపు - మిగతా3లో

## గ్రేటర్ కోసం
# భారీ వ్యూహం...

హైదరాబాద్ ఫిబ్రవరి 24:తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లలో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఏకంగా 1500కు పైగా వార్డులను కైవసం చేసుకుంది. 90 శాతానికి పైగా మున్సిపాలిటీలలో అధికార పార్టీ జెండా ఎగురవేయగా, ప్రతిపక్ష బీఆర్ఎస్ కేవలం 772 వార్డులకే పరిమితమైంది. పట్టణ ప్రాంతాల్లో కూడా ప్రభుత్వ పథకాలు, రేవంత్ రెడ్డి పాలనపై ప్రజలు నమ్మకం ఉంచారని ఈ ఫలితాలు నిరూపిస్తున్నాయని ఆ పార్టీ నేతలు అంటున్నారు. అందుకే హైదరాబాద్ లో కొత్తగా ఏర్పాటు చేసిన మూడు కార్పొరేషన్లలో గెలవడానికి ప్లాన్ చేసుకుంటున్నారు. దశాబ్ద కాలంగా పట్టణ ఓటర్లపై తిరుగులేని పట్టున్న బీఆర్ఎస్ ఈసారి భారీగా నష్టపోయింది. 90 శాతం మున్సిపల్ కౌన్సిళ్లపై నియంత్రణ కోల్పోవడం ఆ పార్టీకి పెద్ద దెబ్బ. అధికారంలో ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి పనుల కంటే, ప్రస్తుత ప్రభుత్వ గ్యారంటీ లకే ప్రజలు ఆకర్షితులయ్యారని స్పష్టమవుతోంది. ముఖ్యంగా మధ్యతరగతి, అల్ప ఆదాయ వర్గాలు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపడం బీఆర్ఎస్ ఉనికికే



ప్రమాదకరంగా మారింది. పార్టీ అంతర్గత విభేదాలు, బలమైన క్షేత్రస్థాయి సమన్వయం లోపించడం కూడా ఈ ఓటమికి కారణాలుగా కనిపిస్తున్నాయి.మున్సిపల్ ఫలితాల ఊపుతో రేవంత్ రెడ్డి సర్కార్ ఇప్పుడు జీహెచ్‌ఎంసీపై దృష్టి సారించింది. 2026 చివరలో లేదా 2027 ప్రారంభంలో జరగనున్న గ్రేటర్ ఎన్నికల కోసం ప్రభుత్వం భారీ వ్యూహాన్ని - మిగతా3లో

## పాతబస్తీ హిందువులకు రక్ష
# భాగ్యలక్ష్మి అమ్మవారు

### కేంద్ర మంత్రి బండి సంజయ్

హైదరాబాద్:కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని కార్పొరేటర్లు, కౌన్సిలర్లతో కలిసి కేంద్ర మంత్రి బండి సంజయ్ మీడియా సమావేశం నిర్వహించారు.కేంద్రం మంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ ఎన్ని కుట్రలు చేసినా కరీంనగర్ మహాశక్తి అమ్మవారి, భాగ్యలక్ష్మి అమ్మవారి ఆశీస్సులు ఉన్నాయి కాబట్టే తట్టుకుని కరీంనగర్ లో మేయర్ పీఠాన్ని కైవసం చేసుకున్నాం. మొక్కులు తీర్చుకునేందుకే భాగ్యలక్ష్మి ఆలయానికి వచ్చాం. బాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయం చాలా పవర్ ఫుల్..బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పంజాబ్ స్వర్ణ దేవాలయం తరహాలో భాగ్యలక్ష్మి ఆలయాన్ని గోల్డెన్ టెంపుల్ గా మారుస్తామని అన్నారు.పాతబస్తీ హిందువులకు రక్ష భాగ్యలక్ష్మి అమ్మవారు. గతంలో ఎంతో మంది హిందువులు పాతబస్తీ నుండి వెళ్లారు. అమ్మవారి శక్తి తెలుసుకుని మళ్లీ పాతబస్తీకి విచ్చేశారు. భాగ్యలక్ష్మి అమ్మవారి ఆశీస్సులతోనే ప్రజా



సంగ్రామ యాత్రను ప్రారంభించిన. కేసీఆర్ సర్కార్ దాడులను తట్టుకుని ప్రజా సంగ్రామ - మిగతా3లో

# రేవంత్ రెడ్డీ గుర్తుపెట్టుకో..

## నువ్వు మళ్లీ చిప్పకూడు తినే సమయం కచ్చితంగా వస్తుంది

### ఆదిలాబాద్ జిల్లా జైలులో మాజీ ఎంపీ బాల్క సుమన్‌ను పరామర్శించిన కేటీఆర్

ఆదిలాబాద్ ఫిబ్రవరి 24: ఆదిలాబాద్ జిల్లా జైలులో ఉన్న మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎంపీ బాల్క సుమన్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు. జైలులో పెడితే మా నాయకులు భయపడుతారని కాంగ్రెస్ నేతలు అనుకుంటున్నారని, ఇలాంటి ఉడుత ఊపులకు తాము భయపడబోమని కేటీఆర్ చెప్పారు. బాల్క సుమన్ ఇవాళ కొత్తగా జైలుకుపోలేదని, తెలంగాణ ఉద్యమ సమయంలో ఆరు నెలలు జైల్లో ఉన్నాడని తెలిపారు.రేవంత్ రెడ్డి ప్రభుత్వం మున్సిపాలిటీల్లో అక్రమంగా అధికారాన్ని హస్తగతం చేసుకుందని కేటీఆర్ ఆరోపించారు. ఆదేమని ప్రశ్నించిన బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ గూండాలతో దాడులు చేయించిందని విమర్శించారు. క్యాతన్‌పల్లిలో ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికలో జరిగిన అక్రమాన్ని ప్రశ్నించినందుకు బాల్క సుమన్‌ను జైల్లో పెట్టారని మండిపడ్డారు. 'రేవంత్ రెడ్డీ గుర్తుపెట్టుకో.. నువ్వు మళ్లీ చిప్పకూడు తినే సమయం కచ్చితంగా వస్తుంది' అని ముఖ్యమంత్రిని



హెచ్చరించారు.కేటీఆర్ ఇంకా మాట్లాడుతూ.. 'కాంగ్రెస్, బీజేపీ పార్టీలు మున్సిపల్ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా అధికార దుర్వినియోగానికి - మిగతా3లో

## సంపాదకీయం

# ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్రకు నాలుగేళ్లు

ప్రారంభమైన ఉక్రెయిన్‌పై రష్యా దాడులు పూర్తి యుద్ధంగా మారి నాలుగేళ్లు దాటుతున్న వేళ, ఈ యుద్ధ మారణహోమానికి ముగింపే కనిపించడం లేదు. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత ఐరోపాలో అతి పెద్ద సైనిక సంఘర్షణగా నిలుస్తున్నది. తీవ్ర ఆస్తి, ప్రాణ నష్టాలతో పాటు మిలియన్ల మంది స్థానభ్రంశం, మౌళిక సదుపాయాల విధ్వంసాలు నమోదు కావడం విచారకరం. ఉక్రెయిన్ అద్భుత ధైర్యసాహసాలతో, పాశ్చాత్య దేశాల మద్దతుతో రష్యా దాడులను సమర్ధవంతంగా తిప్పికొడుతూ "స్టీల్ పోర్కుపైన్" రక్షణను కొనసాగిస్తున్నది. వేలాది మంది ప్రాణాలు కోల్పోవడం, మిలియన్ల కొద్ది ప్రజలు శరణార్థులుగా మారడంతో ఒక తరం తీవ్ర మానసిక ఆందోళనకు గురిచేసింది. రష్యా బలగాలు ఉక్రెయిన్‌లోకి కీలక మౌళిక వనరులు, పవర్ గ్రిడ్‌లను లక్ష్యంగా చేసుకొని "ఇంధన ఉగ్రవాదం (ఎనర్జీ టెర్రరిజమ్)" మార్గాలను అనుసరిస్తున్నది. ఉక్రెయిన్ ప్రాంతాలను స్వాధీనం చేసుకోవడానికి రష్యా, తన సార్వభౌమాధికారాన్ని కాపడుకోవ డానికి యుద్ధాన్ని కొనసాగిస్తున్నాయి. ఈ యుద్ధం వల్ల ప్రపంచవ్యాప్తంగా ఇంధన సరఫరా, ఆహార భద్రత, దౌత్య సంబంధాలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నది. ఉక్రెయిన్ తన ప్రాదేశిక సమగ్రతను కాపాడకపోవడానికి, అంతర్జాత చట్టాల ప్రకారం శాంతిని కోరుకుంటూ, రష్యా దాడులకు బదులు ఇస్తున్నది. గత 27 మాసాలుగా ఇజ్రాయిల్–పాలస్తీనా యుద్ధం కాల్పుల విరమణ, యుద్ధ ముగింపుకు అంగీకారం కుదిరినట్లే కుదిరి తిరిగి ఆయుధాల మంటలు ఎగిసిపడడం కొనసాగుతోంది. ఉక్రెయిన్‌పై రష్యా దాడిలో అపార ఆస్తి, ప్రాణ నష్టాలు: ఉక్రెయిన్ – రష్యా యుద్ధంలో ఇరు పక్షాలకు చెందిన లక్షల మంది సైనికులు, సాధారణ పౌరులు ప్రాణాలు కోల్పోగా, మిలియన్ల కొద్దీ గాయపడడం, పది మిలియన్లకు పైగా ఉక్రెనియన్లు నిర్వాసితులుగా మారి శరణార్థి శిబిరాల్లో అమానవీయ దుస్థితుల్లో ప్రాణాలను బిగబట్టి ఊపిరి పీల్చుకుంటున్నారు. వివిధ అంచనాల ప్రకారం ఇప్పటి వరకు లక్ష వరకు ఉక్రెనియన్ బలగాలు చనిపోగా, 4 లక్షలకు పైగా గాయపడ్డారు. అదే విధంగా కనీసం 12.25 లక్షల రష్యా బలగాలు ప్రాణాలను కోల్పోవడం లేదా గాయపడడం జరిగినట్లు తెలుస్తున్నది. రష్యా ఆక్రమించిన భూభాగాన్ని వెనక్కి తీసుకోవడానికి ఉక్రెయిన్, ఉక్రెయిన్‌ను ఆక్రమించాలని రష్యా తమ తమ పోరాటాలను ఉధృతంగా చేస్తున్నాయి. నేడు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యుద్ధ విరమణకు చేసిన ప్రయత్నాలు పని చేయలేదు. నేటికి ఉక్రెయిన్ దాదాపు 6 లక్షల వరకు మరణించి లేదా గాయపడి ఉంటారని తెలుస్తున్నది. ఉక్రెయిన్ : రష్యా పక్షాల మరణాలు/గాయపడిన వారి నిష్పత్తి 1 : 2.5 ఉండవచ్చని తెలుస్తున్నది. నాలుగేళ్లుగా కొనసాగుతున్న యుద్ధానికి ముగింపు కనబడడం లేదు. రష్యా ఏకపక్షంగా విలీనం చేసుకున్న నాలుగు ఉక్రెయిన్ భూభాగాలను తిరిగి ఉక్రెయిన్‌కు ఇవ్వడం జరగదని రష్యా పట్టుపడుతోంది. ఇప్పటికే ఉక్రెయిన్‌కు చెందిన 18 శాతం భూభాగం రష్యన్ నియంత్రణలోకి వెళ్లింది. ఏకపక్షంగా ఉక్రెయిన్ బలహీన దేశమంటూ రష్యా చేసిన దండయాత్రతో పుతిన్ భారీ మూల్యం చెల్లిస్తున్నారు. ఉక్రెయిన్ నాటో కూటమిలో చేరకూడదని, రష్యా రసరిహద్దుల వరకు నాటో కూటమి విస్తరణ జరగడం తమ భద్రతకు ప్రతికూలమని పుతిన్ వాదిస్తున్నారు. ఉక్తెయిన్ ఒక స్వతంత్ర దేశమే కాదని రష్యా విచిత్రంగా వాదిస్తోంది. ఉక్రెయిన్ గత చరిత్ర – యుద్ధం ప్రారంభం: 1700ల్లో రష్యా సామ్రాజ్య పాలనలో ఉన్న ఉక్రెయిన్ 1917లో రష్యా ఉద్యమంతో రష్యా సామ్రాజ్య పాలన నుంచి విముక్తమై 1922లో సోవియట్ యూనియన్‌లో భాగమై పోయింది. 1930ల్లో మిలియన్ల ఉక్తెనియన్లు కరువుకాటకాలతో ప్రాణాలను కూడా కోల్పోవడం జరిగింది. 1991లో సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం కావడంతో మరో సారి ఉక్రెయిన్ స్వతంత్ర దేశంగా నిలబడింది. 2014లో క్రిమియాను రష్యా ఆక్రమించడం, ఉక్తెయిన్ వేర్పాటువాదులకు రష్యా మద్దతు ఇవ్వడం కూడా ఉక్రెయిన్ కోపానికి కారణం అయ్యింది. నాటో తన దేశాన్ని ఆక్రమించారని చూస్తున్నదని రష్యా, రష్యా నుంచి తమ దేశ ప్రాంతాలకు ప్రమాదం ఏర్పడుతున్నదని ఉక్రెయిన్ భావించడంతో యుద్ధ విరమణ దిశగా అడుగులు పడడం లేదు. ఈ వ్యాసం రాస్తున్న సమయంలో కూడా రెండు దేశాల మధ్య భీకర సాయుధ పోరు కొనసాగుతూనే ఉన్నది. రష్యాలోని మెజారిటీ ప్రజలే కాకుండా పుతిన్ లాంటి నాయకులు కూడా ఉక్రెయిన్ తమ దేశంలో భాగమే అని భావించడంతో రెండు దేశాల మధ్య విభేదాలు రోజు రోజుకు పెరగడం, చివరకు 24 ఫిబ్రవరి 2022న రష్యా పూర్తి స్థాయి దాడి చేయడంతో యుద్ధం అనివార్యం అయ్యింది. 2019లో ఉక్రెయిన్ అధ్యక్షుడిగా ఎన్నిక కావడంతో పాటు అమెరికా, యూరోప్ దేశాల సహకారంతో యుద్ధం మారణహోమంగా మారింది. రష్యా పక్షాన చైనా, ఇరాన్, ఉత్తర కొరియాలు నిలవడంతో నువ్వా నేనా అనే రీతిలో మారణహోమం కొనసాగుతున్నది. సమీపంలో కానరాని యుద్ధ విరమణ ఆలోచనలు: నేడు ఉక్రెయిన్–రష్యా యుద్ధం కాల్పుల విరమణ లేదా ముగింపుకు రావాలంటే ఇరు పక్షాలను ఒక టేబుల్‌పై చర్చలకు కూర్చోబెట్టాల్సి ఉంది. ఇది చాలా కష్టసాధ్యమని ప్రస్తుత పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయి. ఈ యుద్ధానికి చరమగీతం పాడడానికి నాలుగు మార్గాలు కనిపిస్తున్నట్లు విశ్లేషిస్తున్నారు. వీటిలో యుద్ధం దీర్ఘకాలం కొనసాగడం, యుద్ధ తీవ్రత తగ్గడం, యూఎస్ యూరోప్‌ల సహకారంతో ఉక్రెయిన్ గెలవడం, లేదా రష్యా గెలుపు బాటన నిలవడం లాంటి పరిష్కార మార్గాలు కనిపిస్తున్నాయి. డొనాల్డ్ ట్రంప్ కూడా యుద్ధ ముగింపును కోరుతున్నప్పటికీ రష్యా ఆధిపత్యాన్ని అంగీకరించడం అసాధ్యమే. యూఎస్, యూరోప్‌ల మిలటరీ, ఆర్థిక సహకారంతో మాత్రమే ఉక్రెయిన్ పై చేయి సాధించగలదు. కాల్పుల విరమణ లేదా యుద్ధ విరమణ చర్చలకు ఉక్రెయిన్ అంగీకరిస్తున్నప్పటికీ ఈ ప్రతిపాదనలను రష్యా వ్యతిరేకిస్తున్నది. ఎవరు పట్టు వారిది. యుద్ధ భూమిలో పోతున్న ప్రాణాలు ఇరువురివి. ఇరు దేశాలు పౌర సంక్షోభాలను ఎదుర్కొంటున్నాయి. దౌత్యపరమైన ప్రతిపాదనలు ఆదిలోనే తుంచబడుతున్నాయి. జెలెన్‌స్కీ, పుతిన్‌లు మంకు పట్టు పట్టుకొని మారణహోమం కొనసాగిస్తున్నారు. మరణాల లెక్కలను సవరించుకుంటున్నారు. ఆకలి కేకలను మించి యుద్ధ మోతలు మోగిస్తున్నారు. రష్యా గెలుపు పశ్చిమ దేశాలకు ఓటమితో సమానం. ఉక్రెయిన్ గెలుపు రష్యా–చైనాలకు తల వంపులు అవుతున్నది. యుద్ధం దీర్ఘకాలం కొనసాగితే మారణహోమ మరుభూమి తప్ప అభివృద్ధి ఆనందాలు కనిపించవు. యుద్ధం కొనసాగితే ఇరు దేశాల ప్రజలే కాకుండా ప్రపంచవ్యాప్త 840 కోట్ల ప్రజలు దాని దుష్ప్రభావ వేడికి ప్రభావితం అయ్యారు, అవుతూనే ఉంటారు. రష్యా దండయాత్రకు ఓ పరిష్కారం సత్వరమే దొరకాలని కోరుకుందాం.

# కర్ణాటక కాంగ్రెస్ లో మరో వివాదం

## 38 మంది ఎమ్మెల్యేలు చాన్స్ ఇవ్వాలంటూ లెటర్

**బెంగళూరు, ఫిబ్రవరి 24:** కర్ణాటక కాంగ్రెస్‌లో మరోసారి రాజకీయాలు వేడెక్కాయి. డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ పదేపదే ఢిల్లీకి వెళ్లి వస్తున్నారు. ఇదే సమయంలో మంత్రులు, ఎమ్మెల్యేలు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో భేటీ కావడంతో సీఎం మార్పుపై రెండు మూడు రోజుల్లో ఏదో ఒక నిర్ణయం వెలువడుతుందనే సంకేతాలు వస్తున్నాయి. ఇదే సమయంలో తొలిసారి గెలిచిన 38 మంది ఎమ్మెల్యేలు.. కాంగ్రెస్ పెద్దలకు లేఖ రాయడం మరో కొత్త సమస్య వచ్చి పడింది. కర్ణాటక కాంగ్రెస్‌లో నాయకత్వ మార్పుపై కొనసాగుతున్న సస్పెన్షన్ ఇంకా వీడలేదు. సిద్ధరామయ్య, డీకే శివకుమార్ మధ్య సీఎం కుర్చీ కోసం మరోసారి ఆసక్తికర పోరు నెలకుంది. సీఎం మార్పు తప్పదని కొన్నాళ్లుగా ప్రచారం సాగుతోంది. ఈ సాగదీత పార్టీకి మంచిది కాదని, 2028 ఎన్నికల్లో గెలవాలంటే తప్పకుండా ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని అధిష్ఠానాన్ని కాంగ్రెస్ నేతలు కోరుతున్నారు. కర్ణాటక పంచాయతీ హైకమాండ్‌కు పంటి కింద నలుసులా మారింది. ఈ తరుణంలో మరో కొత్త తలనొప్పి వచ్చి పడింది. క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణ కోరుతూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీలతో పాటు సీఎం సిద్ధరామయ్య, డీకేలకు తొలిసారి గెలిచిన 38 మంది ఎమ్మెల్యేలు లేఖ రాశారు. కొత్తగా ఎన్నికైన తమకు క్యాబినెట్‌లో అవకాశం కల్పించాల్సి కోరుతూ 'యువ నాయకత్వం కోసం ప్రజల నుంచి వచ్చిన స్పష్టమైన తీర్పు' అని వారు ఆ లేఖలో



అభివర్ణించారు. 2023 ఎన్నికల్లో విజయం తర్వాత 34 మందితో ఏర్పడిన మంత్రివర్గంలో తమలో ఎవరికి అవకాశం ఇవ్వలేదని వారు పేర్కొన్నారు. 'మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచినవారికి కూడా క్యాబినెట్‌లో చోటు కల్పించడం న్యాయమైందే' అని డిమాండ్ చేశారు. కొత్తవారికి అవకాశాలు ఇవ్వాలని కోరిన వారు.. కనీసం ఐదుగుర్ని క్యాబినెట్‌లోకి తీసుకుంటే అనుభవానికి యువశక్తి,తోడైతే పాలన మరింత మెరుగుపడటానికి సహాయపడుతుందని వాదించారు. తొలిసారిగా ఎమ్మెల్యేలుగా గెలిచిన తమకు మంత్రులుగా అవకాశం కల్పించడం అవసరమని పేర్కొన్నారు. భారత రాజకీయాల్లో కొత్తగా గెలిచిన ఎమ్మెల్యేలకు క్యాబినెట్‌లోకి తీసుకోవడం అసాధారణమేమీ కాదన్న వారు.. పలు రాష్ట్రాల్లో మొదటిసారి గెలిచిన ఎమ్మెల్యేలకు మంత్రులుగా, సీఎంలుగా కీలక బాధ్యతలు అప్పగించిన సందర్భాలున్నాయని వారు గుర్తుచేశారు. కాంగ్రెస్ సిద్ధాంతం, పారదర్శక పాలన పట్ల తమ నిబద్ధతను నొక్కి చెబుతూ.. యువ ఎమ్మెల్యేలకు ప్రాతినిధ్యం కల్పించడం వల్ల పార్టీ సంస్థాగతంగా బలోపేతమవుతుందని, 2028 అసెంబ్లీ ఎన్నికల్లో అధికారాన్ని నిలుపుకోవడంలో సహాయపడుతుందని ఆ ఎమ్మెల్యేలు విశ్వాసం వ్యక్తం చేశారు. ఇప్పటికే నాయకత్వం మార్పుపై మల్లగుల్లాలు పడుతున్న కాంగ్రెస్ అధిష్ఠానికి ఈ లేఖతో కొత్త చిక్కు వచ్చి పడింది. నాయకత్వ మార్పుపై కర్ణాటక సీఎం సిద్ధరామయ్య సోషల్ మీడియాలో పెట్టిన ఓ పోస్ట్ సంచలనంగా మారింది. తనను దెబ్బతీయడానికి కొందరు కుట్రలు చేస్తున్నారని, సామాజికంగా వెనుకబడిన వర్గానికి చెందిన తనపై రాజకీయ కుట్రలు సహజమేనని సిద్ధరామయ్య అన్నారు. అయితే, తాను పిరికివాడిని కాదని, అలాగే తన రాజకీయ జీవితం పూలబాట కాదన్నారు. ప్రజా మద్దతుతోనే రాళ్లు, ముళ్లున్న రాజకీయ రహదారిని దాటుతూ వచ్చానని ఆయన పేర్కొన్నారు. కాగా, ఇటీవల తనను కలిసిన మంత్రులు సతీష్ జార్ఖిహోళి, మాజీ మంత్రి రాజణ్ణ, ఎమ్మెల్యేలతో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వీలైనంత త్వరగా సమస్యకు పరిష్కారం సూచిస్తామని చెప్పారు.

# ఏటా 54 వేల కోట్ల రూపాయల దానం

దేశంలో దాతృత్వ కథలు సంపన్నులతో మొదలవుతాయి. ఆ తరువాతే సామాన్యుల వంతు. సంపన్నుల్లో కార్పోరేట్ సంస్థల సామాజిక బాధ్యత బడ్జెట్లు, బిలియనీర్లు ఇచ్చే కోట్ల రూపాయల వంటి ఆకర్షణీయ అంశాలు చాలా ఉన్నాయి. కానీ భారత్‌లో సామాన్యులు చేసే దానధర్మాలే ఎక్కువని ఓ నివేదిక చెబుతోంది. సంస్థాగత పెట్టుబడిదారులు, కార్పోరేట్ సంస్థలు దాతృత్వంలో పెద్ద పాత్ర పోషిస్తున్నాయనే సంప్రదాయ వాదనను 'హౌ ఇండియా గివ్స్ 2025 నివేదిక' సవాలు చేస్తోంది. దీన్ని అశోకా యూనివర్సిటీలోని సెంటర్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ అండ్ ఫిలాంత్రఫీ రూపొందించింది. దాతృత్వంలో పెట్టుబడిదారులు, కార్పోరేట్ సంస్థల కంటే ఎక్కువగా సాధారణ, మధ్య తరగతి వర్గం పెద్ద పాత్ర పోషిస్తున్నట్లు ఈ నివేదిక చెబుతోంది. భారత్‌లో గృహస్తులు ఏటా నగదుతో పాటు దుస్తులు, ఇతరత్రా వస్తువుల రూపంలో దాదాపు '54వేల కోట్ల రూపాయలు' స్వచ్ఛందంగా ఇస్తున్నారని ఈ నివేదిక అంచనా వేసింది. వారిలో 68 శాతం మంది ఏదో ఒక రూపంలో దానం చేస్తున్నట్లు నివేదిక తెలిపింది. ఇందులో 48 శాతం మంది ఆహారం, దుస్తులు లేదా ఇంట్లో వాడి పడేసిన వస్తువులు, 44 శాతం మంది నగదుగానూ, 30 శాతంమంది లాభాపేక్షలేని, మతపరమైన సంస్థలతో కలిసి అందించే స్వచ్ఛంద సేవ రూపంలో ఉంది. అన్నదానం కోసం ఇచ్చే విరాళాల్లో ఎక్కువ శాతం మతపరమైన ఉచిత అన్నదాన పథకాలకు వెళుతోంది. అలాగే ఈ సంస్థలు ప్రకృతివిపత్తులవేళ అందించే సాయంతోపాటు ఇతర పనులలోనూ స్వచ్ఛందంగా పాల్గొంటున్నాయి."భారత్ ప్రజల్లో దాతృత్వగుణం ఎక్కువ. సంపన్నుల కంటే సాధారణ ప్రజలు విరాళాలు ఇవ్వడంలో, దాన ధర్మాలు చేయడంలో పెద్ద పాత్ర పోషిస్తున్నారని మా పరిశోధనలో తేలింది. దాతృత్వం దేశ ప్రజల్లో సాంస్కృతికంగా, విస్తృతంగా ఇమిడి పోయింది" అని అశోకా యూనివర్సిటీలో సెంటర్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ అండ్ ఫిలాంత్రఫీ హెడ్ జిన్నీ ఉప్పల్ చెప్పారు. భారతీయుల్లో ఉదారత్వం కేవలం సంపన్నుల్లోనే కాదు, మత విశ్వాసాలను పాటించే సమూహాలు, ప్రత్యక్షంగా అడిగే సాయాలు, ఆదాయంతో సంబంధం లేకుండా సాధారణ ప్రజలు చేసే దానాలతో ఇది ముడి పడి ఉంది. భారత్‌లోని 20 రాష్ట్రాల్లో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో 7 వేల మంది అభిప్రాయాలు సేకరించి ఈ నివేదిక రూపొందించారు. ఈ విశ్లేషణ నేషనల్ శాంపిల్ సర్వే మీద ఆధారపడి ఉంది. రోజువారీ దాతల వివరాలను పొందుపరిచేందుకు ప్రభుత్వం భారీ స్థాయిలో గృహ వినియోగానికి సంబంధించి సర్వే నిర్వహిస్తుంది. దీన్ని నేషనల్ శాంపిల్ సర్వే చేపడుతుంది. ఈ సర్వేలో పాల్గొన్నవారు మూడు నెలల కాలంలో తాము ఎంత తరచుగా, ఎంత మొత్తం విరాళంగా ఇచ్చామో చెప్పారు. వార్షిక అంచనాలను రూపొందించేందుకు సర్వేలో సేకరించిన అంశాల ఆధారంగా నివేదికలో అంశాలను నిర్ధరించారు. ఈ సర్వే 'రోజువారీ దానాల'ను పరిశీలించింది. బిచ్చగాళ్లకు సాయం చేయడం, కుటుంబం లేదా స్నేహితులకు వ్యక్తిగతంగా సాయపడటం, సంస్థాగత, మతేతర సంస్థలకు విరాళాలు ఇవ్వడం లాంటివి ఇందులో ఉన్నాయి. అంతే కాకుండా ఇది "విడిగా ఇవ్వడాన్ని" (రిటైల్ గివింగ్) కూడా పరీక్షించింది. రిటైల్ గివర్స్ అంటే సంపన్నులు కాకుండా, సాధారణ వ్యక్తులు లాభాపేక్ష లేని సంస్థలకు ఇచ్చే విరాళాలు. ఈ సర్వే దానానికి సంబంధించి విస్తృత పరిధిలో డేటాను సేకరించింది. అందులో వ్యక్తులకు నేరుగా సాయమందించడం, మత సంస్థలకు విరాళాలు ఇవ్వడం లాంటివి ఉన్నాయి. సామీప్యత, విశ్వాసం అధారంగానే చాలా మంది దానాలు చేస్తున్నట్లు సర్వే గుర్తించింది. విరాళాలు ఇచ్చే వారిలో దాదాపు 40 నుంచి 45 శాతం మంది ప్రజలు మతపరమైన సంస్థలకు ఇస్తున్నారు. ఇందులో ఎక్కువ వాటా పట్టణ ప్రాంతాల్లోని బిచ్చగాళ్లు, నిరాశ్రయులకు వెళు తోంది. గ్రామీణ ప్రాంతాల్లో మతపరమైన సంస్థలకు ఎక్కువ విరాళాలు అందుతున్నాయి."దానం చేయడానికి మిమ్మల్ని ప్రేరేపిస్తున్నది ఏంటని మేము అడిగినప్పుడు మతపరమైన విశ్వాసమే తమకు ప్రేరణ అని 90శాతం మందికి పైగా చెప్పారు" అని అశోకా యూనివర్సిటీలో సెంటర్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ అండ్ ఫిలాంత్రపీ పరిశోధన అధిపతి క్రిషాను చక్రవర్తి చెప్పారు. వ్యక్తిగతంగా వచ్చి నేరుగా అడగడం, ప్రచారం, ఇళ్ల వద్దకు విరాళాలు సేకరించేవారు, ప్రార్థనా స్థలాలు లేదా బహిరంగ ప్రదేశాలు ఏదైనా కావచ్చు ప్రజలు ఇలాంటి చోటనే విరాళాలు ఇస్తున్నారు. అంతే కానీ డిజిటల్ ప్రచారాలు లేదా విరాళాలు సేకరించే కార్యక్రమాలను పెద్దగా పట్టించుకోవడం లేదు. చదువుకు దాన గుణానికి పరస్పర సంబంధం ఉందని సర్వేలో తేలింది. రోజువారీ దాన ధర్మాలు చేసే వారిలో గ్రాడ్యుయేట్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్లు ఎక్కువ మంది ఉన్నారు. అయితే దాన ధర్మాలు చేయడం కేవలం సంపన్నులు, చదువుకున్న వాళ్లకే పరిమితం కాదు. నెలకు రూ.4వేల నుంచి రూ.5వేలు సంపాదించే వారిలోనూ సగం మంది దానం చేస్తున్నారు. వారి సంపాదన పెరిగే కొద్దీ దానాలు చేసే వారి సంఖ్య కూడా పెరుగుతోంది. ఇందులో లింగపరమైన అంశాలు చిన్నవే అయినా స్పష్టంగా ఉన్నాయి. మగాళ్ల పెత్తనం ఉన్న ఇళ్లలో కాస్త ఎక్కువగా మతపరమైన దానాలు చేస్తుంటే, మహిళల పెత్తనం ఉన్న ఇళ్లలో నిరుపేదలకు దానం చేయడం ఎక్కువగా ఉంది."ఈ సర్వేలో కీలకమైన అంశం ఏంటంటే భారతీయుల్లో రోజువారీ దానాలు చేయడం అనేది



అప్పుడప్పుడు కాకుండా క్రమబద్ధంగా ఉంది" అని ఉప్పల్ చెప్పారు."ఇది ఆదాయం, వయసు, లింగం, గ్రామీణ, పట్టణ ప్రాంతాలనే తేడా లేకుండా అన్ని చోట్లా, అందరిలోనూ ఉంది. దైనందిన సామాజిక జీవితంలో కనిపిస్తూనే ఉంటుంది" అన్నారు. మరో ముఖ్య విషయం ఏంటంటే, భారత్‌లో మొత్తం దానధర్మాల్లో రోజూ దానం చేసే వారి వాటా 15శాతం వరకు ఉంటుందని అంచనాలు సూచిస్తున్నాయి. పదిహేను శాతమే అయినప్పటికీ వ్యవస్థీకృత సామాజిక రంగానికి అందుతున్న ప్రైవేట్ డొనేషన్లలో మూడోవంతుగా ఉంది."రోజూ దానం చేసే వాళ్లు ఇచ్చేది కొద్ది మొత్తమే అయినా, సామాజికంగా ప్రభావం చూపడంలో ప్రజల భాగస్వామ్యాన్ని సూచిస్తోంది" అని ఉప్పల్ చెప్పారు. సర్వేలో ప్రజల నుంచి వచ్చిన సమాధానాలను వారి రోజువారీ ఖర్చులతో కలిపి చూసినప్పుడు, ప్రజలు ఖర్చు చేసే తీరుతెన్నులు దానధర్మాలు చేయడానికి ఎలా దోహద పడుతున్నాయో పరిశీలించారు. ఇంటి ఖర్చులు పెరిగే కొద్దీ, విరాళాలు ఇవ్వడం, దానం చేసే మొత్తం కూడా పెరుగుతున్నట్లు సర్వే గుర్తించింది."ప్రపంచంలో వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థలలో భారత్ కూడా ఒకటి. భారత జీడీపిలో ప్రజల వినిమయశక్తి ప్రధాన భాగం. గృహ వినియోగం విస్తరిస్తున్న కొద్దీ, దాన ధర్మాలు, విరాళాలు పెరిగే అవకాశం ఉంది" అని ఉప్పల్ చెప్పారు. అభివృద్ధి చెందుతున్న మార్కెట్లలో ప్రజల రోజువారీ దాన ధర్మాలు, విరాళాలు ఎన్జీవోలకు వెన్నెముక లాంటివి. ఈ సర్వేను మత పరమైన వేడుకలు, పండుగలు తక్కువగా ఉండే మార్చ్– ఏప్రిల్ మధ్య నిర్వహించినట్లు ఉప్పల్ తెలిపారు."మతపరమైన సంస్థలకు ఇచ్చే వ్యక్తిగత విరాళాలు ఎక్కువగా ఉండటంతో మతపరమైన సందర్భాలు ఉన్న నెలల్లో ప్రజల్లో ఎక్కువ మంది విరాళాలు ఇస్తారని భావించవచ్చు" అని ఆమె అన్నారు.

# అన్నాడీఎంకే ను లైట్ తీసుకున్నారా...

**చెన్నై, ఫిబ్రవరి 24:** తమిళనాడు రాజకీయాల్లో దళపతి విజయ్ తనదైన శైలిలో పావులు కదుపుతున్నారు. వేలూరులో ప్రచార సభలో ఆయన చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో అద్భుతం జరుగుతుందని, టీవీకే క్లీన్ స్వీప్ చేస్తుందని విజయ్ ధీమా వ్యక్తం చేశారు. ప్రధానంగా పోటీ కేవలం తమ పార్టీకి, అధికార డీఎంకేకు మధ్యే ఉంటుందని ప్రకటించడం ద్వారా, అన్నాడీఎంకే ఉనికిని ఆయన పూర్తిగా తోసిపుచ్చారు. క్షేత్రస్థాయిలో డీఎంకేకు ప్రత్యామ్నాయం తామేనని ప్రజలకు సంకేతాలు పంపడమే ఆయన ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. తమిళనాడు అంటే విజయ్.. విజయ్ అంటేనే తమిళనాడు అంటూ గతాన్ని గుర్తు చేస్తూ చేసిన వ్యాఖ్యలు కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపాయి. డీఎంకే పాలనపై విజయ్ తనదైన శైలిలో వ్యంగ్యాస్త్రాలు విసిరారు. ప్రస్తుతం రాష్ట్రంలో నడుస్తున్నది స్టాండప్ కామెడీ ప్రభుత్వమని ఆయన ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి స్టాలిన్ తన ప్రభుత్వం సూపర్ స్టార్ మోడల్ అని చెప్పుకుంటున్నారని, కానీ అది నిజానికి సూపర్ స్టాండప్ కమెడియన్ మోడల్ అని ఎద్దేవా చేశారు. స్టాలిన్ ప్రకటిస్తున్న పథకాలు, చేస్తున్న వాగ్దానాలు కేవలం ప్రజలను మభ్యపెట్టడానికేనని ఆరోపించారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు కూడా కేవలం తన పార్టీ కార్యక్రమాలను అడ్డుకోవడానికేనని, అవి స్టాలిన్ ఆపరేటింగ్ ప్రొసీజర్' లా మారిపోయాయని విమర్శించారు. గత ఏడాది కరూర్



ర్యాలీలో జరిగిన విషాదకర తొక్కిసలాట ఘటనను ప్రస్తావిస్తూ విజయ్ భావోద్వేగానికి లోనయ్యారు. రాజకీయ శత్రువులు ఎవరూ లేరని చెప్పే స్టాలిన్, మరి ఆ ఘటనకు తనను ఎందుకు బాధ్యుడిని చేశారని నిలదీశారు. ప్రభుత్వం కావాలనే తక్కువ స్థలం ఉన్న ప్రాంతాల్లో సభలకు అనుమతి ఇచ్చి, భద్రతా వైఫల్యాలకు కారణమైందని ఆరోపించారు. 2026 ఎన్నికలు దుష్ట శక్తి, స్వచ్ఛమైన శక్తి మధ్య జరిగే పోరాటమని ఆయన అభివర్ణించారు. తమిళనాడు ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, అది తనతోనే సాధ్యమని విజయ్ బలంగా నమ్ముతున్నారు. స్టాలిన్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూనే, మరోవైపు ప్రతిపక్ష కూటమి రేసులో లేదని చెప్పడం ద్వారా ఓటర్లను తనవైపు తిప్పుకోవాలని ప్లాన్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే రాబోయే ఎన్నికలను 'విజయ్ వర్సెస్ స్టాలిన్' మధ్య జరిగే పోరుగా అభివర్ణిస్తున్నారు. అన్నాడీఎంకే పట్టు కోల్పోయిన స్థానాల్లో టీవీకే తన బలాన్ని పెంచుకుంటే, అది రాష్ట్ర రాజకీయ సమీకరణాలను పూర్తిగా మార్చివేస్తుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

వార్తాతరంగాలు
బుధవారం 25 ఫిబ్రవరి 2026

# సర్కార్ చేతికి మెట్రో..

- మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్ మెట్రోకు ఉన్న ఆస్తులు, వాటి విలువను ఐడీబీఐ క్యాపిటల్.. రైళ్లు, ట్రాక్‌లు, సిగ్నలింగ్ సిస్టమ్స్ వంటి టెక్నికల్ అంశాలపై డీఎంఆర్సీ లెక్కలు వేసి ప్రాథమిక నివేదికలు ఇచ్చాయిఇక హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణకు అనుమతి కావాలంటే మొదటి దశ పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో ఉండాలని ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం కండిషన్ పెట్టింది. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్ మెట్రోను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకునేందుకు నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ మెట్రో ప్రభుత్వ ఆధీనంలోకి వచ్చిన తర్వాత.. మెట్రో విస్తరణ మరింత వేగంగా జరగనుంది. మరోవైపు.. ఇక హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణలో మరో 86.1 కిలోమీటర్ల మేర కొత్త లైన్ నిర్మించాలని రేవంత్ రెడ్డి సర్కార్ నిర్ణయించింది. ఇప్పటికే డీపీఆర్ రెడీ చేయగా.. దాదాపు రూ.19,579 కోట్లు అవసరం అవుతాయని ప్రాథమిక అంచనా వేసి.. హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2 విస్తరణ డీపీఆర్‌ను కేంద్ర ప్రభుత్వానికి పంపించింది. అనంతరం రెండో దశ విస్తరణకు కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చింది. ఈ క్రమంలోనే జూన్ నెల వరకు మెట్రోను స్వాధీనం చేసుకునే ప్రక్రియను పూర్తి చేయాలనే నిర్ణయం తీసుకుంది తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశంలో హైదరాబాద్ మెట్రో భవిష్యత్తుకు



సంబంధించి అత్యంత కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం ఎల్ అండ్ సంస్థ ఆధ్వర్యంలో ఉన్న మెట్రో ఫేజ్-1 నిర్వహణను ప్రభుత్వం పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని నిర్ణయించింది. ఈ ప్రక్రియను ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా, అంటే మార్చి 31, 2026 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ మేరకు ఐడీబీఐ అందించిన ఆర్థిక నివేదికలు, ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ ఇచ్చిన సాంకేతిక నివేదికలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మెట్రో ప్రాజెక్టును ప్రభుత్వమే నేరుగా నిర్వహించాలనే నిర్ణయం వెనుక బలమైన కారణాలు ఉన్నాయి. ఎల్ అండ్ టీ సంస్థ ఎదుర్కొంటున్న ఆర్థిక భారంతో పాటు, మెట్రో రెండో దశ విస్తరణకు కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు పొందడంలో ఎదురవుతున్న సాంకేతిక ఇబ్బందులను అధిగమించేందుకు ఈ అడుగు పడింది. మెట్రో ఫేజ్-1 ప్రైవేటు సంస్థ చేతుల్లో ఉండటం వల్ల, ప్రభుత్వ భాగస్వామ్యంతో చేపట్టే రెండో దశ విస్తరణకు కేంద్రం నిధులు కేటాయించడంలో జాప్యం చేస్తోంది. ఈ అడ్డంకిని తొలగించడంతో పాటు, భవిష్యత్తులో మెట్రోను లాభదాయకంగా మార్చాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ స్వాధీన ప్రక్రియలో భాగంగా ఎల్ అండ్ టీ సంస్థకు సంబంధించి సుమారు రూ.13,000 కోట్ల రుణాలను ప్రభుత్వం స్వీకరించనుంది. అలాగే ఆ సంస్థ పెట్టిన పెట్టుబడికి ప్రతిఫలంగా సుమారు రూ.2,000 కోట్లను వన్-టైమ్ సెటిల్‌మెంట్ కింద చెల్లించేందుకు ఒప్పందం కుదిరింది. దీనివల్ల హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ పూర్తి ప్రభుత్వ రంగ సంస్థగా మారి, విదేశీ ఆర్థిక సంస్థల నుంచి తక్కువ వడ్డీకి రుణాలు పొందేందుకు మార్గం సుగమం అవుతుంది. కేవలం రవాణా వ్యవస్థగానే కాకుండా, మెట్రో ఆస్తుల వినియోగం ద్వారా ఆదాయం పెంచుకునేలా కొత్త ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. మెట్రో నిర్ణయంతో పాటు, కేబినెట్ మరికొన్ని కీలక అభివృద్ధి పనులకు పచ్చజెండా ఊపింది. ముఖ్యంగా ముసి నది పునరుజ్జీవన ప్రాజెక్టులో భాగంగా నిర్వాసితులకు అందజేసే నష్టపరిహారం, పునరావాస ప్యాకేజీలపై సుదీర్ఘంగా చర్చించారు.

# గులాబీ మౌనం...

- మొదటి పేజీ తరువాయి

బీఆర్ఎస్ అధినాయకత్వం ప్రస్తుతానికి కొంత వెనక్కి తగ్గినట్లు కనిపిస్తున్నా, అది ముందస్తు వ్యూహంలో భాగమేనని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు బీజేపీ వైపు మళ్లకుండా ఉండేందుకు, అధికార పక్షం వైఫల్యాలను ఎండగట్టే సరైన సమయం కోసం వేచి చూసే ధోరణిని గులాబీ దళం అనుసరిస్తోంది. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, ప్రభుత్వ పథకాల అమలులో లోపాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడం ద్వారా మళ్ళీ రేసులోకి రావాలని ప్లాన్ చేస్తోంది. కేవలం మౌనంగా ఉంటే ఇతర పార్టీల దూకుడు పెరిగి తమ ఉనికికే ప్రమాదం ఏర్పడుతుందని బీఆర్ఎస్ ద్వితీయ శ్రేణి నాయకత్వం ఆందోళన వ్యక్తం చేస్తోంది. దీనిని అధిగమించేందుకు త్వరలోనే పార్టీ అధిష్టానం నియోజకవర్గాల వారీగా భారీ బహిరంగ సభలు, పాదయాత్రలు లేదా ఇతర ఆందోళన కార్యక్రమాలకు




రూపకల్పన చేసే అవకాశం ఉంది. కేవలం హైదరాబాద్‌కే పరిమితం కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో కూడా క్యాడర్‌ను ఉత్తేజితం చేసేలా కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల ఫలితాలు బీఆర్ఎస్‌కు కొంత హెచ్చరికగా మారాయి. కాంగ్రెస్ తన పట్టును నిరూపించుకోగా, బీజేపీ కొన్ని పట్టణ ప్రాంతాల్లో పుంజుకుంది. ఈ ఫలితాల తర్వాత బీఆర్ఎస్ తన శైలిని మార్చుకోవాల్సిన అవసరం ఏర్పడింది. ఓటర్ల నాడిని పట్టుకోవడంలో ఎక్కడ విఫలమయ్యామనే అంశంపై ఇప్పటికే అంతర్గత సమీక్షలు ప్రారంభమయ్యాయి. స్థానిక నేతలను సమన్వయం చేసుకుంటూ ప్రజల్లోకి వెళ్లడమే తదుపరి లక్ష్యంగా కనిపిస్తోంది. బీఆర్ఎస్ మళ్లీ తన ప్రాభవాన్ని చాటుకోవాలంటే కేవలం విమర్శలకే పరిమితం కాకుండా, నిర్మాణాత్మక పోరాటాలు చేయాల్సి ఉంటుంది. ముఖ్యంగా నీళ్లు, నిధులు, నియామకాల అంశంపై మరోసారి గళం విప్పడం ద్వారా తెలంగాణ అస్తిత్వ కార్డును వాడే అవకాశం ఉంది. కాంగ్రెస్ వైఫల్యాలను, బీజేపీ రాజకీయాలను ఒకేసారి టార్గెట్ చేస్తూ తెలంగాణ రక్షించే పార్టీ అనే నినాదంతో ముందుకు వెళ్తేనే తిరిగి ఆ రెండు పార్టీలకు ధీటైన పోటీ ఇచ్చే అవకాశం ఉంటుంది.

# కలకలం రేపుతున్న 1000 కోట్ల లెక్కలు

- మొదటి పేజీ తరువాయి

కార్యకర్తలు ఇవ్వగలరు అనేది రేవంత్ రెడ్డి ఉద్దేశం. కానీ ఈ మాట ఎందుకు దుమారమైందంటే.. ప్రస్తుతం రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని పరిపాలిస్తున్నారు. గతంలో ఎన్నడు కూడా ఈ తరహాలో రేవంత్ రెడ్డి మాట్లాడలేదు. ప్రభుత్వంలో ఉన్నారు కాబట్టి.. ప్రభుత్వ సొమ్ము 1000 కోట్లను కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వానికి ఇస్తున్నారని గులాబీ పార్టీ ప్రచారం చేస్తోంది. ఎప్పటి మాదిరిగానే దీనికి కౌంటర్ ఇవ్వడంలో కాంగ్రెస్ పార్టీ విఫలమైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు "నన్ను కోసినా డబ్బులు లేవు" అని చెబుతూ, అదే సమయంలో తెలంగాణ నుండి ఏఐసీసీకి 1000 కోట్లు పంపగలమని గర్వంగా ప్రకటించడం విరుద్ధంగా కనిపిస్తోంది.

# వివాదానికి తెరలేపిన మంత్రి వాసంశెట్టి

**హైదరాబాద్, ఫిబ్రవరి 24:** రాష్ట్ర విభజన జరిగి దాదాపు పుష్కర కాలం సమీపిస్తోంది. ఎవరి పాలన వారు చేసుకుంటున్నారు. అయితే ప్రత్యేక భావోద్వేగ కోరికలతో ఏర్పడింది తెలంగాణ(. అయితే మూడు ఎన్నికలు జరగగా.. రెండు ఎన్నికల్లో తెలంగాణ సెంటిమెంట్ అస్త్రం పనిచేసింది. తెలంగాణ తెచ్చిన పార్టీగా టిఆర్ఎస్ను అందలం ఎక్కించారు తెలంగాణ ప్రజలు. 2023లో మాత్రం తెలంగాణ ఇచ్చిన పార్టీగా కాంగ్రెస్ ను గుర్తించి అధికారం ఇచ్చారు. ఇలా చూసుకున్న తెలంగాణలో సెంటిమెంట్ అస్త్రం ఉండనే ఉందన్నమాట. అందుకే అక్కడ అన్ని రాజకీయ పార్టీలు ఎంత మాత్రం సెంటిమెంట్ లభిస్తే పొలిటికల్ గా చొచ్చుకుపోయేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. మొన్నటికి మొన్న కోనసీమ పర్యటనలో భాగంగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దిష్టి అనే మాట వ్యాఖ్యానించేసరికి.. రాజకీయ పార్టీలన్నీ ఏకమైపోయాయి. ఆ ఒక్క మాటను పట్టుకొని రాజకీయ విమర్శలు చేశాయి. అయితే ఇప్పుడు మరో ఏపీ మంత్రి వాసంశెట్టి సుభాష్ తమ కులానికి రిజర్వేషన్ల విషయంలో కెసిఆర్ అనుసరించిన వైఖరి పై మండిపడ్డారు. ఈ క్రమంలో ఆయన చేసిన వ్యాఖ్యలు మరోసారి తెలంగాణలో సెంటిమెంట్ కు కారణం కానున్నాయి. రాష్ట్రంలో శెట్టిబలిజలు ఉన్నారు. బీసీలు గానే గుర్తిస్తుండేవారు ఆ వర్గాన్ని. అయితే రాష్ట్ర విభజన తర్వాత.. తెలంగాణలో శెట్టిబలిజలను బీసీలనుంచి ఓసీలుగా మార్చారు. అయితే ఒకసారి బీసీలుగా గుర్తించిన తర్వాత ఓసీలుగా మార్చడం అరుదు. అప్పట్లో శెట్టిబలిజల నుంచి పెద్ద ఎత్తున అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. కానీ కెసిఆర్ ప్రభుత్వం దానిని పట్టించుకోలేదు. శెట్టిబలిజలను ఓసీలుగా నే భావించింది. ఆ జాబితాలో చేర్చేసరికి రిజర్వేషన్ల ఫలాలు శెట్టిబలిజలకు లేకుండా పోయాయి. రాజకీయంగా కూడా మనుగడ సాధించేందుకు ఇబ్బందికరంగా మారింది. అయితే తాజాగా ఇదే విషయంపై మాట్లాడారు మంత్రి వాసంశెట్టి



సుభాష్. శెట్టిబలిజల సామాజిక వర్గ కార్యక్రమానికి గాను ఆయన హాజరయ్యారు. ఆ సామాజిక వర్గ ప్రతినిధిగా మాట్లాడుతూ ఎమోషనల్ అయ్యారు. 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు.. ఏపీలో భారతీయ రాష్ట్ర సమితిగా పిలవబడే గులాబీ పార్టీ విస్తరణకు శరవేగంగా అడుగులు పడిన సంగతి తెలిసిందే. అప్పట్లో ఆ పార్టీ కార్యాలయాన్ని కూడా ప్రారంభించారు. ప్రధానంగా కాపు, బలిజలను టార్గెట్ చేసుకొని ఇక్కడ పార్టీ విస్తరించాలని చూశారు. కానీ 2023 అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ రాష్ట్ర సమితి ఓటమితో ఆ ప్రయత్నాలు అక్కడితో ఆగిపోయాయి. అయితే దానిని ఉదహరిస్తూ కేసీఆర్ పార్టీ ఏపీలోకి రావాలని చూస్తే తన్ని తరిమేస్తామంటూ మంత్రి వాసంశెట్టి సుభాష్ వ్యాఖ్యానించారు. అయితే తన సామాజిక వర్గం విషయంలో అలా జరిగిందని ఆయన మాట్లాడి ఉండవచ్చు కానీ.. తెలంగాణలో మరోసారి సెంటిమెంట్ అస్త్రాన్ని అందించినట్లు అయిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఎందుకంటే పవన్ కేవలం దిష్టి అన్న వ్యాఖ్య చేసినందుకే రచ్చ రచ్చ చేశారు. కచ్చితంగా ఇప్పుడు ఏపీ మంత్రి వ్యాఖ్యలను వారు రాజకీయంగా వాడుకుంటారు. చూడాలి మరి ఏం జరుగుతుందో కసీఆర్ ని తన్ని తరిమేస్తాడు అంట.. ఏపీ మంత్రి.. అవసరమా ఇలాంటి మాటలు ఏపీ- తెలంగాణ మధ్య సున్నిత పరిస్థితులు కొనసాగుతున్న వేళ, నేతల వ్యాఖ్యలు బాధ్యతాయుతంగా ఉండాలన్న ప్రజల ఆశలకు విరుద్ధంగా తాజా రాజకీయ పదజాలం మారుతోంది.

# పరిషత్ ఎన్నికలకు లాంగ్ బ్రేక్...

- మొదటి పేజీ తరువాయి



ఎన్నికలకు వెళ్లాలనే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. సోమవారం సెక్రటేరియట్‌లో జరిగిన కేబినెట్ భేటీలోనూ ఈ అంశం చర్చకు వచ్చినట్లు తెలిసింది. బీసీ రిజర్వేషన్లపై అసెంబ్లీ తీర్మానాన్ని, బిల్లును కేంద్రానికి ఇప్పటికే పంపినందున దానిపై ఎలాంటి నిర్ణయం వస్తుందో వేచిచూద్దామని సీఎం మంత్రులతో అన్నట్లు సమాచారం. అప్పటి వరకు జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు వెళ్లకుండా ఉందామని మంత్రులతో సీఎం రేవంత్ అన్నట్లు సమాచారం. సీఎం నిర్ణయానికి మంత్రులు కూడా సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. దీంతో ఇప్పట్లో ఎన్నికలు జరిగే సూచనలు కనిపించటం లేదని ప్రభుత్వ వర్గాల ద్వారా వెల్లడైంది. ఇక తెలంగాణ ప్రభుత్వం వచ్చే నెల 3 నుంచి జూన్ 2న జరిగే రాష్ట్రావతరణ దినోత్సవ రోజు వరకు ప్రతిరోజు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని కేబినెట్ సమావేశంలో చర్చించినట్లు తెలిసింది. ప్రతి ప్రభుత్వ శాఖలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రత్యేకంగా నివేదిక తయారు చేయటంతో పాటు.. ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలు పరిష్కరించేలా ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించాలని సీఎం రేవంత్ సీఎస్ రామకృష్ణారావుకు సూచించినట్లు పార్టీవర్గాలు వెల్లడించాయి.

# గ్రేటర్ కోసం భారీ వ్యూహం...

- మొదటి పేజీ తరువాయి



అమలు చేస్తోంది. ఇందులో భాగంగానే జీహెచ్ఎంసీ పరిధిని ప్రస్తుతం ఉన్న 650 చదరపు కిలోమీటర్ల నుండి 2000 చదరపు కిలోమీటర్లకు పైగా విస్తరించే ప్రతిపాదన తెచ్చింది. చుట్టుపక్కల ఉన్న మున్సిపాలిటీలను గ్రేటర్ లో విలీనం చేయడం ద్వారా ఓటర్ల సంఖ్యను పెంచి, మేయర్ పీఠాన్ని దక్కించుకోవడమే లక్ష్యంగా పెట్టుకుంది. జీహెచ్ఎంసీని మూడు వేర్వేరు కార్పొరేషన్లుగా హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరి విభజించారు. గతంలో వైఎస్ఆర్ అనుసరించిన ఫార్ములాను రేవంత్ అమలు చేస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. రాబోయే మూడు కార్పొరేషన్ల ఎన్నికల లోపు నగర రూపురేఖలు మార్చాలని ప్రభుత్వం సంకల్పించింది. ముసి నది పునరుజ్జీవనం, మెట్రో ఫేజ్-2 విస్తరణకు రూ.2,787 కోట్ల కేటాయింపు, బంజారాహిల్స్ నుండి శిల్పా లేఅవుట్ వరకు కొత్త రహదారి నిర్మాణం వంటి ప్రాజెక్టులను వేగవంతం చేస్తోంది. ఈ భారీ ప్రాజెక్టుల ద్వారా విశ్వనగరం క్రెడిట్‌ను తన ఖాతాలో వేసుకోవాలని కాంగ్రెస్ యోచిస్తోంది. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం ద్వారా నగర ఓటర్ల మనసు గెలవాలని ప్రభుత్వం పట్టుదలతో ఉంది. ప్రస్తుత ఫలితాల నేపథ్యంలో బీఆర్ఎస్, బీజేపీలు తమ వ్యూహాలను మార్చుకోవాల్సిన అవసరం ఉంది. కేవలం విమర్శలకే పరిమితం కాకుండా, కాంగ్రెస్ దూకుడును అడ్డుకోవడానికి బలమైన నాయకత్వం, స్థానిక అజెండాతో ముందుకు వెళ్లాల్సి ఉంటుంది. ముఖ్యంగా బీఆర్ఎస్ తన పాత కోటను కాపాడుకోవడానికి నగర వాసుల్లో మళ్ళీ నమ్మకం కలిగించాల్సి ఉంది. ఈ త్రిముఖ పోరులో రేవంత్ రెడ్డి సర్కార్ వేస్తున్న ముందడుగులు విపక్షాలకు ముమ్ముందు గడ్డు కాలం మిగిల్చేలా ఉన్నాయి.

# రేవంత్ రెడ్డీ గుర్తుపెట్టుకో..

- మొదటి పేజీ తరువాయి

పాల్పడ్డాయి, బీఆర్ఎస్ అభ్యర్థులను భయభ్రాంతులకు గురిచేశారు. కొన్ని మున్సిపాలిటీల్లో ప్రజాతీర్పును అపహాస్యం చేసేలా వ్యవహరించారు. మంచిర్యాల జిల్లా క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. 22 చోట్లకుగానూ 14 స్థానాల్లో గెలుపుతో స్పష్టమైన మెజారిటీ వచ్చింది. కాంగ్రెస్ పార్టీ ఏడు స్థానాల్లో మాత్రమే గెలిచినా అధికార దాహంతో ప్రజాతీర్పును అపహాస్యం చేసింది. సీఎం, స్థానిక మంత్రి సూచనలకు అనుగుణంగా అధికారులు వారికి తొత్తులుగా మారి ప్రజాతీర్పును ఎగతాళి చేశారు' అని మండిపడ్డారు. 'మరికొన్ని మున్సిపాలిటీలలోనూ ఇదే రీతిన వ్యవహరించారు. మహిళా కౌన్సిలర్లపై అసభ్యంగా ప్రవర్తించినా కనీసం మంత్రి స్పందించలేదు. దేశ చరిత్రలో ఇంత ఘోరమైన రాజకీయం లేదు. బాల్క సుమన్‌ను ఇక్కడ జైలులో ఉంచి వారి డ్యూటీకి ఆటంకం కలిగించారు. మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి పోలీసులను బూతులు తిట్టినా కేసు పెట్టలేదు. బీజేపీ ఎంపీ అరవింద్ పోలీసులను తిట్టినా కేసులు పెట్టలేదు. అధికార పార్టీ ప్రజాతీర్పును అపహాస్యం చేస్తుంటే.. ప్రశ్నించిన మా పార్టీ కార్యకర్తలపై కేసులు పెట్టారు. మూడు కోట్ల ఆఫర్ ఇచ్చినా మా కౌన్సిలర్లు లొంగలేదు. సీపీఐ కౌన్సిలర్లు సైతం నిబద్ధతతో ఉన్నారు. పొత్తుధర్మాన్ని పాటిస్తున్నారు' అని కేటీఆర్ చెప్పారు. 'బాల్క సుమన్‌ను జైలులో పెట్టారు. ఆయనకు జైలు కొత్త కాదు. ఆరు నెలలు వివిధ సందర్భాల్లో జైలులో ఉన్నారు. జైలులో పెడితే భయపడతారనుకుంటే పొరపాటే. రేవంత్ రెడ్డికి మళ్ళీ చిప్పకూడు తినే సమయం వస్తుంది. పోలీసులను బూతులు తిడితే కేసులు పెట్టని డీజీపీ బీఆర్ఎస్ నేతలపై మాత్రం కేసులు పెట్టి జైలుకు పంపుతున్నారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదు. తిరిగి రాష్ట్రంలో గులాబి జెండా ఎగురుతుంది. ఏ కలుగులో దాక్కున్నా అరాచకాలు చేసిన వారిని వదిలే ప్రసక్తే లేదు. రాజ్యాంగాన్ని, చట్టాలను తుంగలో తొక్కుతున్న వారిని వదలం. క్యాతన్ పల్లి, ఇబ్రహీం పట్నం, ఖానాపూర్‌లో వెంటనే ఎన్నికలు పెట్టాలని డిమాండ్ చేస్తున్నాం' అన్నారు. 'నిజాయితీగా ఎన్నిక జరిగే విధంగా చూడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉంది. అధికారుల ముసుగులో అధికార పార్టీకి వత్తాసు పలికే వారిని వదలం. క్యాతన్‌పల్లిలో మహిళా కౌన్సిలర్లపై అసభ్యంగా వ్యవహరించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మిపై సైతం కేసు పెట్టారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యాన్ని అగౌరవపరుస్తున్నది. అధికార పార్టీకి ప్రజలు బుద్ధిచెప్పే రోజు వస్తుంది. బాల్క సుమన్‌ను దగ్గరలో ఉన్న జైలులో పెట్టకుండా దూరంగా ఉన్న జైలులో పెట్టి.. దోమలు ఎక్కువగా ఉన్న గదిలో ఉంచి వేధిస్తున్నారు. వీటన్నింటిని గుర్తుపెట్టుకుంటాం' అని వార్నింగ్ ఇచ్చారు.

# పాతబస్తీ హిందువులకు రక్ష భాగ్యలక్ష్మీ అమ్మవారు

- మొదటి పేజీ తరువాయి

యాత్రను దిగ్విజయం చేశాం. ప్రజాసంగ్రామ యాత్ర ద్వారా 1640 కి.మీలు నడిచిన. పాదయాత్ర ప్రారంభించి 1640 రోజులు పూర్తయ్యింది. మజ్లిస్ కంచుకోటను బద్దలు కొట్టి ఇదే చోట ప్రజా సంగ్రామ యాత్రను ప్రారంభించినా. హైదరాబాద్ లో హిందూ సమాజానికి ఏ ఆపద వచ్చినా అడ్డుకోవడానికి మేం సిద్ధం. కాంగ్రెస్, బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చినా మా బూట్లు నాకాల్సిందేనని మజ్లిస్ నేతలు చెబుతున్నారంటే సిగ్గుండాలి. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నేతలరా మీది ఓ బతుకేనా? మీరు నిజంగా హిందువులైతే మీలో రక్తం ఉంటే ఆ పార్టీలను వదిలి కాషాయ జెండా పట్టండి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 27 నెలలైంది నాటి నుండి నేటి వరకు దేవాలయాలపై దాడులు జరుగుతూనే ఉన్నాయి. సికింద్రాబాద్ ముత్యాలమ్మ గుడి మొదలు సంతోష్ నగర్ భూలక్ష్మీ, బంజారాహిల్స్ పెద్దమ్మ గుడి, శంషాబాద్ ఆలయాలపై దాడులు జరిగాయి. ఇంత పెద్ద ఎత్తున ఆలయాలపై దాడులు జరుగుతున్నా ఎందుకు స్పందించడం లేదని అన్నారు. గోహత్యలు, లవ్ జిహాదీల పేరుతో హిందూ అమ్మాయిలపై డ్రగ్స్ ఇస్తూ అత్యాచారాలు చేస్తున్నా స్పందించరా? హిందూ ధర్మాన్ని కాపాడాలనే సంకల్పంతో కసితో మేం పనిచేస్తున్నాం. హిందూ సమాజం జాగ్రుతం కాకపోతే అందరవి బిచ్చపు బతుకులే అవుతాయి. హనుమాన్, అయప్ప, భవానీ మాల వేసుకుంటే సెలవు ఇవ్వరు. మాల వేసుకున్న పిల్లలను కూడా స్కూలుకు రానీయ్యడం లేదు. అయినా భరిస్తూ ఉందామా, కరీంనగర్ లో ముస్లిం మహిళలంతా ఒక్కటై బీజేపీకి ఓటేశారు.

వార్తాతరంగాలు
బుధవారం 25 ఫిబ్రవరి 2026

# ఇక కేరళం...



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24:**ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర కేబినెట్ సంచలన నిర్ణయం తీసుకుంది. కేరళ పేరును “కేరళం”గా మార్చడానికి ఆమోదం తెలిపింది. భాష ఆధారంగా రాష్ట్రం ఏర్పడినప్పటి నుండి, కేరళకు కేరళం అని పేరు పెట్టాలనే డిమాండ్ ఉంది. ఈ డిమాండ్‌ను కేంద్ర మంత్రి మండలి ఆమోదించిందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర కేబినెట్ సంచలన నిర్ణయం తీసుకుంది. కేరళ పేరును “కేరళం”గా మార్చడానికి ఆమోదం తెలిపింది. భాష ఆధారంగా రాష్ట్రం ఏర్పడినప్పటి నుండి, కేరళకు కేరళం అని పేరు పెట్టాలనే డిమాండ్ ఉంది. ఈ డిమాండ్‌ను కేంద్ర మంత్రి మండలి ఆమోదించిందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఈ సంవత్సరం జరగనున్న కేరళం అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఈ చర్య తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు.మంగళవారం (ఫిబ్రవరి 24, 2026)న ప్రధానమంత్రి కార్యాలయం కొత్త భవనం ‘సేవా తీర్థ’లో కేంద్ర మంత్రివర్గ తొలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు కీలక నిర్ణయాలకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా రాష్ట్ర పేరును అధికారికంగా ‘కేరళం’గా మార్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ కేరళ శాసనసభ జూన్ 24, 2024న ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించింది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ మొదటి ప్రతిపాదనను సమీక్షించి, కొన్ని సాంకేతిక మార్పులను సూచించింది. దీంతో కేరళ శాసనసభ రెండవసారి ఈ తీర్మానాన్ని ఆమోదించింది. ఈ మేరకు ఇవాళ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.రాజ్యాంగంలోని ఎనిమిదవ షెడ్యూల్‌లో జాబితా చేసిన అన్ని భాషలలో దక్షిణాది రాష్ట్రం పేరును కేరళ నుండి “కేరళం”గా మార్చాలని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కేరళ అసెంబ్లీ ఆగస్టు 2023లో ఇదే విధమైన ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపింది. అయితే హోమ్ మంత్రిత్వ శాఖ కొన్ని సాంకేతిక మార్పులను సూచించింది. ఈ సంవత్సరం ప్రారంభంలో, భారతీయ జనతా పార్టీ కేరళ రాష్ట్ర అధ్యక్షుడు రాజీవ్ చంద్రశేఖర్ కూడా ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాస్తూ, రాష్ట్ర అధికారిక పేరును “కేరళ” నుండి “కేరళం” గా మార్చాలని డిమాండ్ చేశారు. “కేరళం” అనే పేరు మలయాళ భాషకు, రాష్ట్ర సాంస్కృతిక గుర్తింపుకు లోతుగా అనుసంధానించబడి ఉందని ఆయన పేర్కొన్నారు.

## డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం

### జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్



**నారాయణపేట:**రోడ్డు ప్రమాదాల నివారణే ప్రధాన లక్ష్యంగా చేపట్టిన ‘ఏరైవ్ అలైవ్ ’ 2వ విడత అవగాహన కార్యక్రమంలో భాగంగా మంగళవారం నాడు జిల్లా ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆటో, టాక్సీ మరియు పోలీస్ వాహన డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ శిబిరాన్ని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణలో డ్రైవర్ల పాత్ర అత్యంత కీలకమని, ముఖ్యంగా డ్రైవర్లకు కలర్ బ్లైండ్, వయస్సు పెరిగే కొద్ది కంటి చూపు మందగించడం జరుగుతుంది అని అలాంటి వారికి చికిత్స ద్వారా కంటి వైద్య పరీక్షలు నిర్వహించుకొని తగిన జాగ ముఖ్యంగా డ్రైవర్లకు సమస్యలు లేకుండా కంటి చూపు సక్రమంగా ఉండటం అత్యవసరమని తెలిపారు. కంటి చూపు స్పష్టంగా ఉంటే ట్రాఫిక్ సిగ్నల్స్, రహదారి సూచనలు సరిగ్గా గుర్తించి సురక్షితంగా వాహనాలు నడపగలరని చెప్పారు.జిల్లా వ్యాప్తంగా ఆటో, టాక్సీ డ్రైవర్కు కంటి వైద్య పరీక్షలు నిర్వహించాలనే ఉద్దేశంతో కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలు అందించడమే కాకుండా, తగిన చికిత్సలు కూడా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా అందించబడతాయని ఎస్పీ వివరించారు.డ్రైవర్లకు రోడ్డు భద్రత నియమాలపై పలు ముఖ్య సూచనలు చేశారు. వాహనాలు నడిపేటప్పుడు వేగ పరిమితులను తప్పనిసరిగా పాటించాలని, ట్రాఫిక్ సిగ్నల్స్ మరియు రహదారి సూచనలను పాటించాలని, మద్యం సేవించి వాహనం నడపకూడదని, కారులో సీట్ బెల్ట్ మరియు ద్విచక్ర వాహనంపై హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని తెలిపారు. డ్రైవింగ్ సమయంలో సెల్ ఫోన్ వినియోగించరాదని, అలసట లేదా నిద్రలేమి ఉన్నప్పుడు వాహనం నడపవద్దని హెచ్చరించారు. వాహనాలకు సంబంధించిన లైసెన్స్, ఇన్సూరెన్స్, ప్యూసీ, రిజిస్ట్రేషన్ వంటి పత్రాలు చెల్లుబాటు అయ్యేలా చూసుకోవాలని, బ్రేకులు, లైట్లు, టైర్లు సరిగా ఉన్నాయో లేదో నిరంతరం పరిశీలించాలని సూచించారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, చిన్న జాగ్రత్త ప్రాణాలను కాపాడగలదని ఎస్పీ పేర్కొన్నారు.ఈ శిబిరం ద్వారా మొత్తం 70 మంది డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించామని, రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి ప్రమాద రహిత సమాజ నిర్మాణానికి సహకరించాలని కోరారు.

## ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నిర్వహణకు జిల్లాలో ఏర్పాట్లు పూర్తి....



**సిద్దిపేట:**ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నిర్వహణకు జిల్లాలో ఏర్పాట్లు పూర్తయ్యాయనిజిల్లా కలెక్టర్ కె.హైమావతి తెలిపారు. నేటి నుండి ఏప్రిల్ 18వ వరకు నిర్వహించనున్న ఇంటర్మీడియట్ పరీక్షల ఏర్పాట్లపై మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సంబంధిత శాఖలో ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు మరియు జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారులతో సమీక్షించి తగు ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో మొదటి సంవత్సరం విద్యార్థులు 9946 మంది మరియు రెండో సంవత్సరం విద్యార్థులు 10089 మంది మొత్తం 20035 మంది పరీక్షలకు హాజరుకానుండగా 42 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లాలో ఎలాంటి ఆవంచనీయ సంఘటన జరగకుండా ఇంటర్మీడియట్ పరీక్షలను పగడ్బందీగా నిర్వహిస్తామని తెలియజేశారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల జిల్లా అధికారులతో మాట్లాడుతూ. నేటి నుంచి వచ్చే నెల మార్చి 18వ వరకు ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, పరీక్షలు ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు నిర్వహిస్తారని వివరించారు. పరీక్షా కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని, ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పరీక్షలు సజావుగా కొనసాగేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అన్నారు. ముఖ్యంగా పరీక్షలు సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా, నిరంతరం విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులకు ఆదేశించారు, అలాగే పరీక్ష కేంద్రాల వద్ద ఉచిత వైద్య శిభిరాలను ఏర్పాటు చేసి, తగినన్ని మందులు నిల్వ పెట్టాలని వైద్య అధికారులకు సూచించారు, అవసరమైన పోలీసు బందోబస్త్ ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖను, పరీక్షా కేంద్రాల వద్ద 163 బి ఎన్ఎస్ సెక్షన్ ఏర్పాటు చేయాలని, అలాగే పరీక్షలు కేంద్రాల సమీపంలో జిరాక్స్ షాపులను మూసి ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు, వేసవి దృష్టిలో పెట్టుకుని నాణ్యమైన త్రాగునీరు సమకూర్చి, కేంద్రాల పరసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు,

# ఆ విభాగాలు నిద్రపోతున్నాయా...

## తప్పు ఒకరిది... శిక్ష మరోకరికా...!

**హైదరాబాద్, ఫిబ్రవరి 24:**మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు పేరుతో హైదర్ షా కోట్‌లోని మధు పార్క్ రిడ్జ్ అపార్ట్‌మెంట్‌కు మార్కింగ్ ఇవ్వడం వివాదానికి దారితీసింది. దశాబ్ద కాలంగా ప్రశాంతంగా నివసిస్తున్న వందలాది కుటుంబాలు ఒక్కసారిగా రోడ్డున పడే పరిస్థితి రావడంతో నివాసితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ అపార్టుమెంట్ నదీగర్భంలో ఉందని మార్కింగ్ ఇచ్చారు. కానీ ఈ అపార్టుమెంట్ కు ఎవీణూ, +ఎవీజ నుండి అన్ని అనుమతులు వచ్చాయి. బ్యాంకు లోన్లు కూడా వచ్చాయి. ఇప్పుడు ప్రభుత్వం చేపడుతున్న ప్రాజెక్టులో భాగంగా మూసీలో ఉందని చెబుతున్నారు.ఈ అపార్ట్‌మెంట్ నది గర్భంలోనే ఉంటే, అసలు రిజిస్ట్రేషన్లు ఎలా జరిగాయి? ప్రభుత్వ యంత్రాంగం అనుమతులు ఎలా మంజూరు చేసింది? సామాన్య మధ్యతరగతి ప్రజలు ఇళ్లు కొనుగోలు చేసేటప్పుడు ప్రభుత్వ పత్రాలనే నమ్ముతారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఆ భూమిని రిజిస్టర్ చేసి, మున్సిపల్ శాఖ ప్లాన్ అప్రూవల్ ఇచ్చినప్పుడు అది చట్టబద్ధమైనదే అని ఎవరైనా భావిస్తారు. ఇప్పుడు ఏళ్ల తర్వాత అది ఆక్రమణ అని తేల్చడం అంటే, అప్పట్లో తప్పుడు అనుమతులు ఇచ్చిన అధికారుల



వైఫల్యాన్ని సామాన్యుల మీద రుద్దడమేనని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.బాధితులను పరామర్శించిన రాజకీయ నేతలు ప్రభుత్వ తీరును తప్పుబడుతున్నారు. తప్పు చేసిన అధికారులపై చర్యలు తీసుకోకుండా, అమాయక కొనుగోలుదారులను ఇబ్బంది పెట్టడం సరికాదని వారు డిమాండ్ చేస్తున్నారు. ఒక పక్క పన్నులు వసూలు చేస్తూ, మరోపక్క ఆ ఇళ్లకు మార్కింగ్ ఇచ్చి కూల్చివేస్తామనడం ప్రభుత్వ ద్వంద్వ నీతికి నిదర్శనమని నివాసితులు ధ్వజమెత్తుతున్నారు. ఇది కేవలం ఒక అపార్ట్‌మెంట్ సమస్య కాదని, ప్రభుత్వ అనుమతులను నమ్మి ఇళ్లు కొనుక్కున్న ప్రతి ఒక్కరి భద్రతకు సంబంధించిన ప్రశ్న అని వారు వాదిస్తున్నారు. అయితే ప్రభుత్వం పరిహారం ఇస్తామని చెబుతోంది.ఈ అపార్టుమెంట్ బిల్డర్.. మొదటి నుంచి తెలివిగా వ్యవహరించారు. ఈ అపార్టుమెంట్ కాంప్లెక్స్ లో చాలా మంది జర్నలిస్టులకు ఫ్లాట్లు అమ్మారు. ఇందులో ఆంధ్రజ్యోతి మాజీ ఎడిటర్ కె.శ్రీనివాస్ తో పాటు చాలా మంది జర్నలిస్టులు ఫ్లాట్లు కొనుక్కున్నారు. ఎప్పుడైనా వివాదం అయితే .. వీరే మీడియాలో హడావుడి చేసి కాపాడుకుంటారన్న ఉద్దేశంతో ఇలా చేశారేమో తెలియదు కానీ.. ఇప్పుడు ఈ కారణంగానే మీడియాలోనే హైలెట్ అవుతోంది. ఆ అపార్టుమెంట్ అక్రమం అయితే ప్రభుత్వం తక్షణమే స్పందించి, అనుమతులు ఇచ్చిన అధికారుల బాధ్యతను కూడా నిర్ణయించాలని, బాధితులకు న్యాయమైన నష్టపరిహారం లేదా ప్రత్యామ్నాయం చూపకుండా ఎటువంటి చర్యలు తీసుకోకూడదని నిపుణులు సూచిస్తున్నారు. మరి ప్రభుత్వం ఏం చేస్తుందో?

# శివారు ప్రాంతాల్లో రియల్ ఢమాల్

**హైదరాబాద్, ఫిబ్రవరి 24:**గత కొన్నేళ్లుగా ఆకాశమే హద్దుగా దూసుకుపోయిన హైదరాబాద్ శివార్ల రియల్ ఎస్టేట్ రంగం ప్రస్తుతం ఊహించని మందగమనాన్ని ఎదుర్కొంటోంది. ముఖ్యంగా నగరం నుండి 50 నుండి 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న రంగారెడ్డి, యాదాద్రి భువనగిరి, మెదక్ , వికారాబాద్ జిల్లాల పరిధిలోని వ్యవసాయ భూముల అమ్మకాలు గణనీయంగా పడిపోయాయి. గతంలో ఎకరాకు కోట్లు పలికిన ప్రాంతాల్లో కూడా ఇప్పుడు కొనుగోలుదారులు కరువవ్వడం, రిజిస్ట్రేషన్ల సంఖ్య తగ్గడం జిల్లా స్థాయి విశ్లేషణల్లో స్పష్టంగా కనిపిస్తోందిపెట్టుబడిదారులు ప్రస్తుతం వేచి చూసే ధోరణి ని అవలంబించడం ఈ పరిస్థితికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. మారుతున్న భూవినియోగ విధానాలు, , మూసీ రివర్ ఫ్రంట్ వంటి భారీ ప్రాజెక్టుల పునర్నిర్మాణ నిర్ణయాల కారణంగా .. ఏ భూమి ఏ జోన్‌లోకి వస్తుందో అన్న ఆందోళన ఇన్వెస్టర్లలో నెలకొంది. దీనికి తోడు పెరిగిన మార్కెట్ విలువల వల్ల రిజిస్ట్రేషన్ ఖర్చులు భారం కావడంతో, సామాన్య , మధ్యతరగతి పెట్టుబడిదారులు వెనకడుగు వేస్తున్నారు.గతంలో వెంచర్ల పేరుతో వ్యవసాయ భూములను భారీ ధరలకు విక్రయించిన రియల్టర్లు ఇప్పుడు గడ్డు కాలాన్ని ఎదుర్కొంటున్నారు. నగరం చుట్టూ ప్రతిపాదించిన రీజినల్ రింగ్ రోడ్ , ఫ్యూచర్ సిటీ వంటి ప్రాజెక్టుల అలైన్‌మెంట్ విషయంలో ఇంకా స్పష్టత రాకపోవడంతో, భారీ పెట్టుబడులు పెట్టిన వారు ఆందోళన చెందుతున్నారు. కేవలం అత్యవసర పరిస్థితుల్లో ఉన్నవారు మాత్రమే తక్కువ ధరకైనా భూములు అమ్ముకోవడానికి సిద్ధపడుతుండగా, కొత్తగా కొనేవారు మాత్రం భద్రత లేనిదే ముందుకు రావడం లేదుఈ స్తబ్ధత మరికొన్ని నెలల పాటు కొనసాగే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రభుత్వం భూసేకరణ , జోనింగ్ నిబంధనలపై పూర్తిస్థాయి స్పష్టత ఇస్తే తప్ప, శివారు ప్రాంతాల్లో మళ్లీ



రియల్ జోరు పెరగడం కష్టమని తెలుస్తోంది. ప్రస్తుతానికి మాత్రం హైదరాబాద్ చుట్టూ ఉన్న వ్యవసాయ భూముల మార్కెట్ పూర్తిగా బ్రేక్ పడినట్లుగా కనిపిస్తోంది.

# భారీగా పెరిగిన ట్రాఫిక్ చలాన్ల ఆదాయం

**హైదరాబాద్, ఫిబ్రవరి 24:**రాష్ట్రంలో ట్రాఫిక్ చలాన్ల ఆదాయం పెరగడం పట్ల కేంద్రమంత్రి బండి సంజయ్ తీవ్రంగా మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీది ప్రజా పాలన కాదని.. పెనాల్టీ పాలన అంటూ విమర్శలు గుప్పించారు. గతేడాది ఏకంగా 154 శాతం ట్రాఫిక్ చలాన్ల ఆదాయం పెరగడాన్ని ప్రశ్నించిన బండి సంజయ్.. దాదాపు 2.5 రెట్లు ట్రాఫిక్ చలాన్ల ఆదాయం పెరిగిందని వెల్లడించారు.తెలంగాణలో ట్రాఫిక్ చలాన్ల ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు ఆదాయం పెరిగినట్లు లెక్కలు వెల్లడి కావడంతో.. రేవంత్ రెడ్డి సర్కార్‌పై.. బీజేపీ నేత, కేంద్రమంత్రి బండి సంజయ్ తీవ్ర ఆరోపణలు గుప్పించారు. ఇది ప్రజా పాలనా.. పెనాల్టీ పాలననా అంటూ తీవ్రంగా ఫైర్ అయ్యారు. కేవలం ఒక సంవత్సర కాలంలోనే ట్రాఫిక్ చలాన్ల వసూళ్లు 154 శాతం పెరగడం పట్ల కేంద్రమంత్రి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. గతేడాది ట్రాఫిక్ చలాన్ల ద్వారా సర్కారుకు రూ.108.33 కోట్ల ఆదాయం సమకూరగా.. అది ఈ ఏడాది ఏకంగా రూ. 275.05 కోట్లకు పెరగడంపై రేవంత్ రెడ్డి సర్కార్‌ను బండి సంజయ్ ప్రశ్నించారు.ఈ లెక్కలు చూస్తుంటే గత ఏడాది కాలంలోనే ట్రాఫిక్ జరిమానాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే ఆదాయం 154 శాతం అంటే దాదాపు 2.5 రెట్లు పెరిగినట్లు ఆయన లెక్కలతో సహా వెల్లడించారు. ఇక ప్రజల నుంచి ఫైన్ల రూపంలో భారీగా డబ్బులు వసూలు చేసుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం.. వారికి సరైన సౌకర్యాలు కల్పిస్తుందా అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. చలాన్ల ద్వారా భారీగా ఆదాయం పెరిగినప్పుడు.. రాష్ట్ర వ్యాప్తంగా రోడ్లు కూడా అదే స్థాయిలో మెరుగుపడ్డాయా అని నిలదీశారు.రోడ్లపై గుంతలు లేకుండా చేశారా.. ట్రాఫిక్ ఏమైనా తగ్గిందా అని



అన్నారు. ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి మౌలిక వసతులు కల్పించకుండానే.. కేవలం ట్రాఫిక్ చలాన్లు వేసి.. వారి నుంచి డబ్బులు మాత్రమే వసూలు చేయడంపై దృష్టి పెట్టడం సరికాదని పేర్కొన్నారు. రాష్ట్రంలోని సామాన్య ప్రజలను రేవంత్ రెడ్డి సర్కార్ ఒక వాకింగ్ ఏటీఎం లాగా వాడుకుంటోందని ఆరోపించారు.మరోవైపు.. ప్రజల వాహనాలపై పడిన ట్రాఫిక్ చలాన్‌లను నేరుగా వారి బ్యాంక్ అకౌంట్ల నుంచే ఆటో డెబిట్ చేయాలన్న సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనను బండి సంజయ్ తీవ్రంగా తప్పు పట్టారు. మొదట జరిమానాలను పెంచారని.. ఆ తర్వాత ట్రాఫిక్ పోలీసులకు టార్గెట్లు పెట్టి మరీ చలాన్లు వేయించారని.. ఇక ఇప్పుడు నేరుగా ప్రజల ఖాతాల నుంచి డబ్బులు కట్ చేయాలని చూడటం ఆటోమేటెడ్ దోపిడీలా ఉందని ఆయన తీవ్ర విమర్శలు గుప్పించారు. ట్రాఫిక్ చలాన్లకు సంబంధించిన ఈ అన్ని నిర్ణయాలను రేవంత్ సర్కార్ పునరాలోచించుకోవాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

## రేవంత్ సవాల్ కు సై అన్న హరీష్ రావు



**హైదరాబాద్:**అసెంబ్లీలో గోదావరి జలాల మీద చర్చిద్దామన్న రేవంత్ రెడ్డి సవాల్ను బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు స్వీకరించారు. అయితే , మైక్ కట్ చేయొద్దు కెమెరా తిప్పొద్దు అదే మా షరతు. నువ్వు చంద్రబాబుకు ఎట్లా దాసోహం అయ్యావో, మేడిగడ్డను, సమ్మక్క బ్యారేజీని, దేవాదులను పండబెట్టి ఆంధ్రాకి నీళ్లు ఎలా వదులుతున్నావో, నల్లమల్ల సాగర్ ప్రాజెక్ట్ మీద నీ చీకటి ఒప్పందాలు అన్ని అసెంబ్లీలో బయట పెట్టడానికి మేము సిద్ధంగా ఉన్నామని అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫ్యూచర్ సిటీ మీద పెట్టిన శ్రద్ధ 10 శాతం హెల్త్ సిటీ మీద పెడితే బాగుండేది. కేసీఆర్ శ్రద్ధ హెల్త్ సిటీ మీద పెడితే.. రేవంత్ రెడ్డి శ్రద్ధ ఫ్యూచర్ సిటీ మీద పెట్టాడు. కేసీఆర్ పేదల కోసం హెల్త్ సిటీ నిర్మిస్తే.. రేవంత్ రెడ్డి రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం, కాంట్రాక్టర్ల కోసం ఫ్యూచర్ సిటీ మీద శ్రద్ధ చూపిస్తున్నాడని అన్నారు.

# రాష్ట్రానికి సీఎం రేవంతా ...రంగనాథా ??

### ఎమ్మెల్యే మాధవరం

**హైదరాబాద్:**సున్నం చెరువులో ఐదు ఎకరాల భూమిపై కాంగ్రెస్ పార్టీ నేతలు కన్నేస్తే ఆ భూమి వదిలేసి పెన్సింగ్ చేస్తున్నారు హైడ్రా అధికారులు. హైడ్రాను అడ్డుపెట్టుకొని కోట్ల రూపాయల భూమి కాంగ్రెస్ నాయకులు కబ్జా చేస్తున్నారు. సున్నం చెరువుకు సంబంధించిన భూములను కాపాడకపోతే కోర్టును డిఓపీటి ఆశ్రయిస్తాం అంటూ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆగ్రహం వ్యక్తం చేసారు.మాజీ మంత్రి కేటీఆర్ సహకారంతో సున్నం చెరువు , నల్ల చెరువు , బోయిన్ చెరువు ,కాముని చెరువు లను అభివృధి చేశాం. హైడ్రా కమిషనర్ ప్రవర్తనలను ఖండిస్తున్నాం. సున్నం చెరువు చెరువు భూమి కబ్జా అవుతుంది అని ఇరిగేషన్ శాఖ 47 లక్షలతో ఫెన్సింగ్ వేశారు. 2017 సంవత్సరంలో సున్నం చెరువు సంబంధించిన భూమి కాపాడటం కోసం పెన్సింగ్ వేశారు. హైడ్రా అధికారులు 2014 గూగుల్ మ్యాప్ ఆధారంగా పెన్సింగ్ వేశామంటున్నారు. ఐదు ఎకరాల పై చిలుకు భూమి వదిలేసి పెన్సింగ్ వేస్తున్నారు. అదే భూమి కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన నాయకుల కబ్జా చేస్తున్నారని స్థానికులు చెప్పారు. సున్నం చెరువు వెళ్లి చూస్తూ కళ్ళకు



కట్టినట్లు కబ్జా అవ్వడానికి హైడ్రా అధికారులు ఐదు ఎకరాల భూమి వదిలేశారు. కేసీఆర్ ప్రభుత్వంలో చేసిన అభివృధి కనపడకుండా దుర్గం చెరువు ,అమరవీరుల స్థూపం దగ్గర లైట్లు ఆపేస్తారు అధికారులు. హైడ్రా అధికారులు అభివృధి చేసిన పార్కుల చెరువుల వద్ద లైట్లు వెలుగటం చూస్తే ఆశ్చర్యం వేస్తుంది. కూకట్ పల్లి నియోజక వర్గంలో అన్ని చెరువులు పార్టులు కాపాడి అభివృద్ది చేసింది కేసీఆర్ ప్రభుత్వమేనని అన్నారు. చెరువుకు మాత్రమే పెన్సింగ్ వేసి ఐదు ఎకరాల భూమి ఎందుకు వదిలేశారు హైడ్రా కమిషనర్. 2017 లో ప్రభుత ప్రభుత్వ అధికారులు వేసిన పెండింగ్ కరెక్ట్ నా...? 2014 గూగుల్ మ్యాప్ ఆధారంగా హైడ్రా అధికారులు పెన్సింగ్ వేసి ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని వదిలేయం కరెక్టేనా...? ప్రజలకు సంబంధించిన సున్నం చెరువు ఐదు ఎకరాల భూమి కాపాడకపోతే కోర్టును , డిఓపీటి ఆశ్రయిస్తాం . రెవిన్యూ,పోలీస్, హైడ్రా జిహెచ్ఎంసి అన్నిట్లో హైడ్రా కమిషనర్ ఎందుకు తలదురుస్తున్నారు ఎందుకు...? అసలు రాష్ట్రానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నా...రంగనాథ్ నా అని ప్రశ్నించారు.

# కాప్రా సర్కిల్ పరిధిలో.. అక్రమ నిర్మాణాలు ఎక్కువ.... సక్రమ నిర్మాణాలు తక్కువ

**కాప్రా టౌన్ ప్లానింగ్ అధికారి తుల్జా సింగ్ అక్రమాలకు కేరాఫ్ అడ్రస్**

**భవన అనుమతులు ఒకలా నిర్మాణాలు మరోలాగా**

**ప్రభుత్వానికి భారీ నష్టం సొంత ఆస్తులు పెంచుకుంటున్న టౌన్ ప్లానింగ్ అధికారి తుల్జా సింగ్**

**కాప్రా టౌన్ ప్లానింగ్ అధికారి తుల్జా సింగ్ కు ప్రైవేటు సిబ్బంది ఎక్కువ జిహెచ్ఎంసి సిబ్బంది తక్కువ**

**దరఖాస్తు చేసుకున్న ప్రతి ఫైల్ కు మామూళ్ల వసూళ్లకు ప్రైవేటు సిబ్బంది**

**కాప్రా టౌన్ ప్లానింగ్ విభాగంలో సమాచార హక్కు చట్టం పనిచేయదా ?**

**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 24 :** కాప్రా సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలతో ప్రభుత్వానికి నష్టం వాటిల్లేల టౌన్ ప్లానింగ్ అధికారి తుల్జాసింగ్ వ్యవహారంపై దరఖాస్తుదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే కాప్రా సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాల వ్యవహారంపై దరఖాస్తుదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని, ప్రతి దరఖాస్తుకు డబ్బులు ఇస్తేనే పనులు జరుగుతున్నాయని లేకుంటే దరఖాస్తు తిరస్కరణ జరుగుతుందని వివిధ రకాల అభ్యంతరాలు పెడుతూ దరఖాస్తును మామూళ్ల కోసం తిరస్కరిస్తున్నాడని దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాప్రా సర్కిల్ పరిధిలో అనుమతులు లేకుండా అక్రమ భవన నిర్మాణాలు చేస్తున్నారని వాటికి టౌన్ ప్లానింగ్ అధికారి మామూలు తీసుకుంటూ సహకరిస్తున్నారని అనడానికి ఈ అక్రమ నిర్మాణాలే నిదర్శనం అనే స్థానికులు వాపోతున్నారు. జిహెచ్ఎంసి గతంలో ప్రజల నుండి లక్షలాది రూపాయలు పన్నుల రూపేనా వసూలు చేసి ప్రభుత్వ అధికారులకు జీతాలు ఇస్తుంటే ప్రభుత్వానికి రావాల్సిన డబ్బులు రాకుండా తమ సొంత ఆస్తులు పెంచుకుంటున్నారని వాటిపై విజిలెన్స్ ఎంక్వయిరీ చేసి ఆస్తుల వివరాలు బట్టబయలు చేసినట్లయితే అక్రమ ఆస్తుల వివరాలు బయటకు వస్తాయని స్థానిక ప్రజలు విజిలెన్స్ అధికారులను కోరారు. ప్రభుత్వానికి నష్టం వచ్చేలా వ్యవహారం చేస్తున్న అధికారులపై కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చర్యలు తీసుకుంటారా లేకుంటే గాలికి వదిలేసారా అన్న విషయానికి ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాప్రా టౌన్ ప్లానింగ్ అధికారి తుల్జా సింగ్ గతంలో ఉప్పల్ సర్కిల్లో పనిచేసే వారని అనంతరం కాప్రా సర్కిల్ ఇన్చార్జిగా ఇచ్చారని కాప్రా సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలపై వస్తున్న మామూలను చూసి శాశ్వతంగా కాప్రా సర్కిల్ కార్యాలయానికి ఉద్యోగాన్ని బదిలీ చేసుకొని పెద్ద ఎత్తున అక్రమ నిర్మాణాలకు సహకరిస్తూ పెద్ద మొత్తంలో ముడుపులు దండుకుంటున్నారని టౌన్ ప్లానింగ్ దరఖాస్తుదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ప్రైవేటు సిబ్బందిని పెట్టుకొని సైట్ విజిట్ చేసి దేనికి ఎంత వసూలు చేయాలో నిర్ధారణ చేసుకుంటూ జిహెచ్ఎంసి కి సంబంధం లేకుండా ఉన్నటువంటి సిబ్బందితో పెద్ద మొత్తంలో ముడుపులు తీసుకుంటూ ప్రభుత్వానికి నష్టం చేస్తూ అధికార దుర్వినియోగం చేస్తున్నాడని టౌన్ ప్లానింగ్ దరఖాస్తు దారులు కాప్రా సర్కిల్ కార్యాలయానికి వచ్చే దరఖాస్తుదారులు, సమాచార హక్కు చట్టం ప్రకారం దరఖాస్తు చేసుకున్న ఎలాంటి ఫలితం లేదంటూ, ఇలాంటి అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని ప్రభుత్వానికి నష్టం వాటిల్లకుండా చూడాలని దరఖాస్తుదారులు ఉన్నతాధికారులను కోరారు.







# దాడులను తీవ్రంగా పరగణిస్తాం

**నాగర్ కర్నూల్ ఫిబ్రవరి 24 (స్కై న్యూస్):**రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల ప్రజలపై దాడులు జరిగితే వాటిని తీవ్రంగా పరిగణిస్తాం, తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ హెచ్చరించారు మండల పరిధిలోని కుమ్మెర గ్రామ శివాలయంలో జరిగిన ఘటనపై రెండు నెలల చిన్నారి బలైపోవడం అత్యంత విషాదకరమని బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ పేర్కొన్నారు.మంగళవారం జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, రాష్ట్ర బీసీ కమిషన్ మెంబర్లు రాపోలు జయప్రకాశ్, టీ.సురేందర్, బాలలక్ష్మి, సభ్యులతో కలిసి రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ గ్రామాన్ని సందర్శించి, ఘటన జరిగిన శ్రీ మల్లికార్జున స్వామి వారి దేవాలయ వద్ద జరిగిన ఘటన ప్రదేశాన్ని సందర్శించి అక్కడ జరిగిన వివరాలను కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారులతో చిన్నారి ఘటన జరిగిన పూర్వాపరాల వివరాలపై ఆరా తీశారు. ఘటన జరుగుతున్న సందర్భంగా హోంగార్డు చిత్రీకరించిన వీడియోను డి.ఎస్.పి బురి శ్రీనివాసులు వీడియోను ఫోన్లో కమిషన్ చైర్మన్ కు చూపించారు. గ్రామంలో రెండు నెలల చిన్నారి సమాధిని సందర్శించి సమాధి వద్ద పూలు ఉంచి నివాళులు అర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. తదనంతరం చిన్నారి తల్లిదండ్రులు గణేష్ మౌనికల ఇంటిని సందర్శించినారు.ఈ సందర్భంగా రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, మాట్లాడుతూ.......... మల్లన్న జాతరకు సుమారుగా





10,000 మంది భక్తులు వచ్చారని అధికారులు తమ దృష్టికి తెచ్చినట్లు ఆయన తెలిపారు. నాగర్ కర్నూల్ జిల్లా మండల పరిధిలోని కొమ్మెర ఘటనను రాష్ట్ర బీసీ కమిషన్ అత్యంత ప్రాధాన్యత తీసుకున్నట్లు, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, దేవాదాయ శాఖను పూర్తిస్థాయిలో నివేదికను సమర్పించాలని కోరినట్లు తెలిపారు. నివేదికలు అందిన తర్వాత ప్రభుత్వానికి తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ తరఫున సమగ్ర నివేదికను పంపనున్నట్లు కమిషన్ చైర్మన్ నిరంజన్ ఈ సందర్భంగా వెల్లడించారు.బడుగు, బలహీన వర్గాల హక్కులను రక్షించడం కమిషన్ బాధ్యత అని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని నిందితులు ఎంతటి వారినైనా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. బాధిత కుటుంబానికి అన్ని విధాల రాష్ట్ర బీసీ కమిషన్ అండగా నిలుస్తుందని ఆయన స్పష్టం చేశారు. దోషులను ఎంతటి వారైనా చట్టపరంగా కఠినంగా శిక్షించాల్సిందేనని, పోలీసులు పారదర్శకంగా దర్యాప్తు చేసి నిజానిజాలను వెలికితీయాలని ఆయన ఆదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కులవివక్షకు వ్యతిరేకంగా కఠిన చర్యలు తీసుకోవాలని, సమాజంలో సమానత్వ భావన పెంపొందించేందుకు అందరూ కృషి చేయాలని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ పిలుపునిచ్చారు ఈ సందర్భంగా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ గత మూడు రోజులుగా జిల్లా యంత్రాంగం చేపట్టిన చర్యలను రాష్ట్ర బీసీ కమిషన్ దృష్టికి తీసుకువచ్చారు

# పల్లె ప్రగతిలో సర్పంచులు పాత్ర కీలకం

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**స్వర్ణ భారత్ ట్రస్టులో నిర్వహిస్తున్న నూతన సర్పంచ్ ల శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే**

**రంగారెడ్డి జిల్లా (స్కై న్యూస్) ఫిబ్రవరి 24 :-** రంగారెడ్డి జిల్లా ముచ్చింతల్ గ్రామ పరిధిలో ఉన్న స్వర్ణ భారత్ ట్రస్టులో నిర్వహిస్తున్న నూతనంగా ఎన్నికైన రంగారెడ్డి జిల్లా సర్పంచ్ ల శిక్షణ కార్యక్రమానికి షాద్ నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి, సహృద్భావ వాతావరం సాధించడం లో సర్పంచుల పాత్ర కీలకం అని అన్నారు ఎల్లవేళల ప్రజలకు అందుబాటులో ఉండి గ్రామస్తులకు సేవ చేస్తే మంచి పేరు వస్తుందని తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్, డివిజనల్ పంచాయతీ అధికారి



సాధన, మండల పంచాయతీ అధికారులు కిష్టయ్య,



తదితరులు పాల్గొన్నారు.

# నిందితులను అరెస్టు చేసి రిమాండ్కు తరలించాలి

**ఎంఆర్పిఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కోళ్ల శివ మాదిగ.**

**నాగర్ కర్నూల్ ఫిబ్రవరి 24( స్కై న్యూస్)** కుమ్మెర గ్రామంలో జరిగిన సంఘటనలో పాల్గొన్న ఎనిమిది మంది నిందితులను అరెస్టు చేసి రిమాండ్కు తరలించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కోళ్ల శివ మాదిగ డిమాండ్ చేశారు మంగళవారం బీసీ కమిషన్ చైర్మన్ తో పాటు పలువురు సభ్యులు కుమ్మెర గ్రామాన్ని సందర్శించారు ఈ సందర్భంగా సంఘటన వివరాలను వారికి వివరిస్తూ మల్లికార్జున స్వామి జాతర సందర్భంగా దైవదర్శనం కోసం వెళ్ళిన చాకలి కులానికి చెందిన



కుటుంబాన్ని విచక్షణారహితంగా దాడి చేసి రెండు నెలల పాప చావుకి కారణమైన ఎనిమిది మందిని అరెస్టు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా చైర్మన్ నిరంజన్ కు వినతి పత్రాన్ని సమర్పించారు ఈ కార్యక్రమంలో కమిషన్ సభ్యురాలు భాగ్యలక్ష్మి జిల్లా అధ్యక్షులు రాజు మాదిగ అధికార ప్రతినిధి పరమేష్ మాదిగ కురుమయ్య మాదిగ నాయకులు వెంకటయ్య భాస్కర్ భగవంతు రాజు జంగయ్య తదితరులు పాల్గొన్నారు

## ఆత్మకూర్ మున్సబ్ కోర్టు ప్రాంగణంలో దీక్ష నిర్వహిస్తున్న న్యాయవాదులు

**బిజెపి నాయకులు పూల మాలలు లేసి మద్దతు తెలిపారు...**

**దేవరకద్ర ఆత్మకూరు ఫిబ్రవరి 24 (స్కై న్యూస్);** ఆత్మకూరు మండల కేంద్రంలో న్యాయవాదుల రక్షణ చట్టం కోసం మంగళవారం రిలే నిరాహార దీక్ష నిర్వహిస్తున్న న్యాయవాదులకు సంఘీభావం తెలిపిన బిజెపి నాయకులు. ఆత్మకూరు మున్సబ్ కోర్టు ప్రాంగణంలో దీక్ష నిర్వహిస్తున్న న్యాయవాదులకు బిజెపి నాయకులు మాజీ ఫ్లోర్ లీడర్ అశ్విన్ కుమార్, జిందే శ్రీనివాసులు, పూలమాలలు వేసి వారికి మద్దతును తెలిపారు.అశ్విన్ కుమార్ మాట్లాడుతూ న్యాయాన్ని పరిరక్షించే న్యాయవాదులపై జరుగుతున్న దాడులను అరికట్టే విధంగా కఠినమైన చట్టాన్ని ప్రభుత్వం రూపొందించాలని తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఆత్మకూర్ బిజెపి మండల అధ్యక్షులు అశోక్ భూపాల్, మండల సురేష్, జిల్లా నాయకులు కే ఆనంద్, మాజీ మండలాధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, జనరల్ సెక్రెటరీ రమేష్, సమ్మర్ కార్యదర్శి సాయికుమార్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.



## దుర్ఘటనపై సిట్టింగ్ న్యాయమూర్తిచే విచారణ జరిపించాలి

**సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్.**

**నాగర్ కర్నూల్ ఫిబ్రవరి 24( స్కై న్యూస్)** మండల పరిధిలోని కుమ్మెర గ్రామంలో జరిగిన దుర్ఘటనపై సిట్టింగ్ న్యాయమూర్తి విచారణ జరిపించి దోషులను శిక్షించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ డిమాండ్ చేశారు మంగళవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో దిష్టిబొమ్మ దగ్ధం చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు ఈ సందర్భంగా రాస్తారోకో నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబానికి సామాజిక న్యాయం అందించేందుకు ప్రభుత్వం మరియు పోలీసు యంత్రాంగం కృషి చేయాలని డిమాండ్ చేశారు. సమాజంలో శాంతియుతంగా దిష్టిబొమ్మ దగ్ధం చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారని కుమ్మెరలో జరిగిన దుర్ఘటనలో రెండు నెలల చిన్నారి మృతిచెందిన దోషులను ఎందుకు శిక్షించడం లేదని ప్రశ్నించారు. రాగిత కుటుంబాన్ని ఆదుకోవాలని నిందితులను శిక్షించాలని డిమాండ్ చేశారు అవినీతి అక్రమాలు కుల వివక్ష అంతం చేసేందుకు ప్రజలంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటయ్య మారేడు శివశంకర్ గోపి చారి మధు గౌడ్ ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు



## కుమ్మెర గ్రామంలో పెత్తందార్ల దాడులు నిరసిస్తూ దిష్టిబొమ్మ దగ్ధం...

**నాగర్ కర్నూల్ ఏప్రిల్ 24 (స్కై న్యూస్):** సర్పంచ్ తుకారం రెడ్డి తో పాటు మిగతా నిందితులను వెంటనే అరెస్టు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు డిమాండ్ చేశారు పెత్తందారుల దాడులను నిరసిస్తూ దిష్టిబొమ్మను శ్రీపురం చౌరస్తాలో దగ్ధం చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం కుమ్మర గ్రామంలో ఫిబ్రవరి 18న దళిత రజక కుటుంబం పై దాడి జరిగి రెండు నెలల చిన్నారి మృతి చెంది ఆరు రోజులు గడుస్తున్న ప్రభుత్వం ఏమాత్రం స్పందించడం లేదని కేవలం ముగ్గురిని అరెస్టు చేసి మిగతా నిందితులను అరెస్టు చేయకుండా ఉండటం వలన ప్రజా పాలనలో పెత్తందారుల దాడులు దౌర్జన్యాలు పెరిగిపోవడానికి నిదర్శనంగా ఉన్నాయని విమర్శించారు. ఎంపీ ఎమ్మెల్యే మరియు జిల్లా ప్రభుత్వ అధికారులు తక్షణమే కుమ్మెర గ్రామాన్ని సందర్శించి గ్రామంలో గ్రామ సభ నిర్వహించి అంటరానితనం వివక్షకు వ్యతిరేకంగా ప్రభుత్వ తరపున చైతన్య కార్యక్రమాలు తీసుకోవాలని, అదేవిధంగా బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ప్రభుత్వ పరంగా ప్రభుత్వ ఉద్యోగం కోటి రూపాయల ఎక్స్గ్రేషియా చెల్లించాలని ఫాస్ట్ ట్రాక్కోర్టు ఏర్పాటు చేసి న్యాయాభిచారన్నారు తొందరగా చేపట్టి నిందితులను శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు పొదిలి రామయ్య తారా సింగ్, నాగపూర్ మధు, అంతటి కాశన్న, సురేష్, కుర్మయ్య, వెంకటేష్ కొౖట మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు



## అట్టహాసంగా స్వయం పరిపాలన దినోత్సవం



**నాగర్ కర్నూల్ ఫిబ్రవరి 24( స్కై న్యూస్)** మండల పరిధిలోని శ్రీపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మంగళవారం అట్టహాసంగా స్వయం పరిపాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాత మాట్లాడుతూ స్వయం పరిపాలన దినోత్సవం వల్ల విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకత బయటకు వస్తుందని వివరించారు. ప్రతిభతో విద్యార్థులు అన్ని రంగాలలో రాణించాలని ఈ సందర్భంగా ఆమె విద్యార్థులకు సూచించడం ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల విద్యాశాఖ అధికారి భాస్కర్ రెడ్డి హాజరుకాగా డీఈవోగా సాయికిరణ్ ఎమ్ఈఓ గా మీనాక్షి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులుగా ఓలీవగ్రేస్ హెచ్ఎం గా లాస్య బాధ్యతలు నెరవేరుస్తూ ప్రతిభ ప్రదర్శించారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాత ఉపాధ్యాయులు చలపతిరావు ప్రసన్నలక్ష్మి ప్రణీత తదితరులు పాల్గొన్నారు

వార్తాతరంగాలు
బుధవారం 25 ఫిబ్రవరి 2026

## సౌత్ జోన్ అల్ ఇండియా యూనివర్సిటీ నేషనల్స్ చెస్ పోటీలకు ఎంపికైన అల్లీపూర్ గ్రామ క్రీడాకారుడు డి.నవీన్.



**చిన్న చింతకుంట ఫిబ్రవరి 24 (స్కై న్యూస్);** ఈ నెల ఫిబ్రవరి 23వ తేదిన మహబూబ్ నగర్ జిల్లా, పాలమూరు యూనివర్సిటీ లో సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ చెస్ ఎంపికలు నిర్వహించిన సందర్భంగా దేవరకద్ర నియోజకవర్గం చిన్నచింతకుంట మండలం అల్లీపురం గ్రామానికి చెందిన డి. నవీన్ తండ్రి బాలస్వామి అను విద్యార్థి నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ లోని హాసిని బి పి ఈ డి కాలేజ్ లొ ఫస్ట్ ఇయర్ చదువుతూ చెస్ పోటీలలో పాల్గొని వరుసగా ( 5/4 ) రౌండ్స్ గెలుపొంది, వచ్చే నెల మార్చి 02 నుండి 06 వ తేదీ వరకు తమిళనాడు రాష్ట్రంలోని, తిరుచిరప్పల్లి, భారతీదాసన్ యూనివర్సిటీ లో జరగబోయే సౌత్ జోన్ అల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ నేషనల్స్ చెస్ పోటీలకు పాలమూరు విశ్వ విద్యాలయం తరుపున పాల్గొననున్నట్లు పాలమూరు యూనివర్సిటీ పి డి శ్రీనివాసులు తెలుపడం జరిగింది. మహబూబ్నగర్ జిల్లా చిన్న చింతకుంట మండలం అల్లిపూర్ గ్రామం పేరు నిలబెట్టినందుకు గ్రామస్తులు నవీన్ కు సంబంధిత అధికారులకు హర్షం వ్యక్తం చేశారు.

## మేయర్ కార్పొరేటర్ లని సన్మానించిన మహిళా సమైక్య





**కొత్తగూడెం ఫిబ్రవరి 24 (స్కై న్యూస్):** శేషగిరి భవన్లో సిపిఐ ఎన్ఎఫ్ఐ డబ్ల్యు మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నుకోబడిన సిపిఐ మేయర్ మూడ్ గణేష్ డివిజన్ కార్పొరేటర్స్ మునిగడప పద్మ, పోలమూరి ధనలక్ష్మి, గడ్డం శాంతి ప్రియ, పడాల ఆకాంక్ష, మద్దాల హరిత, శ్యామల మొదలైన వారికి మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించడం జరిగినది, ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు,సాబీర్ పాషా వీరితోపాటు మహిళల అందరి సహకారంతో నేను గెలవడం జరిగినది నేను ప్రజల మనిషిని మీకు ఏ టైంలో ఎలాంటి సమస్య వచ్చిన మీ అందరికీ అందుబాటులో ఉంటానని అలాగే కూనంనేని సాంబశివరావు, సాబీర్ పాష అడుగుజాడల్లో నడుస్తూ వీరి ఆశయాలతో మన భద్రాద్రి జిల్లా కొత్తగూడెం కార్పొరేషన్ ను మరింత అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తానని మీ అందరికీ తెలియజేస్తున్నాను, ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీ కుమారి, ఆర్గనైజ్ సెక్రటరీ కర్షరత్నకుమారి ,సహాయ కార్యదర్శి మామిడాల ధనలక్ష్మి,టౌన్ ఆర్గనైజ్ సెక్రటరీ కైసర్ , ప్రజానాట్య మండలి జిల్లా నాయకురాలు దార్ల లక్ష్మి, అనసూయ, మాజీ వార్డు నెంబర్ శాంతి, లత, లక్ష్మి వీరందరి ఆధ్వర్యంలో వారిని ఘనంగా సన్మానించడం జరిగినది, ఈ సందర్భంగాభద్రాద్రి కొత్తగూడెం శేషగిరి భవన్లో సిపిఐ ఎన్ఎఫ్ఐ డబ్ల్యు మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నుకోబడిన సిపిఐ మేయర్ మూడ్ గణేష్ కి కార్పొరేటర్స్ కి మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించడం జరిగినది, ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనం నేని సాంబశివరావు, సాబీర్ పాషా వీరితోపాటు మహిళల అందరి సహకారంతో నేను గెలవడం జరిగినది. నేను ప్రజల మనిషిని 60 డివిజన్ల ప్రజలకు ఏ టైంలో ఎలాంటి సమస్య వచ్చిన ఎలాంటి అభివృద్ధి పనులకైనా మీ అందరికీ అందుబాటులో ఉంటానని అలాగే కూనంనేని సాంబశివరావు, సాబీర్ పాష అడుగుజాడల్లో నడుస్తూ వీరి ఆశయాల తో అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తానని మీ అందరికీ తెలియజేస్తున్నాను, ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీ కుమారి, ఆర్గనైజ్ సెక్రటరీ కర్షరత్నకుమారి , సహాయ కార్యదర్శి మామిడాల ధనలక్ష్మి ,మిడ్ డే మీల్స్ జిల్లా నాయకురాలు ఎస్ విజయలక్ష్మి, ప్రజానాట్యమండలి జిల్లా నాయకురాలు దార్ల లక్ష్మి, అనసూయ, మాజీ వార్డు నెంబర్ శాంతి, లత, లక్ష్మి వీరందరి ఆధ్వర్యంలో వారిని ఘనంగా సన్మానించడం జరిగినది, ఈ సందర్భంగా మేయర్ మూడ్ గణేష్ మహిళలను గౌరవించడం మన సంప్రదాయం మీ అందరి సహకారంతో గెలిచిన వాడిని అంటూ ప్రతి ఒక్క మహిళను శాలువాతో సత్కరించడం జరిగినది.

## గళం విప్పుతాం నిలదీస్తాం

హిందూ మతం కులాలకు వేదిక కాదు.

బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ రామ్ చందర్ రావు.



**నాగర్ కర్నూల్ ఫిబ్రవరి 24( స్కై న్యూస్)** కుమ్మెర గ్రామంలో జరిగిన దారుణంపై శాసనసభలో తమ పార్టీ ఎమ్మెల్యేలు గళం విప్పుతారని శాసనసభ వెలుపల కూడా పాలకులను నిలదీస్తామని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ రాంచందర్ రావు అన్నారు మంగళవారం కుమ్మెర గ్రామంలో జరిగిన దురాగతంపై అంబేద్కర్ చౌరస్తాలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవత్వంతో నిర్వహిస్తున్న పోరాటాలకు సంఘీభావం తెలిపేందుకు హాజరు కావడం జరిగిందని దుర్ఘటనలో రెండు నెలల పాప మృతి చెందడం దారుణమని అన్నారు. భాగ్యలను కట్టిన ఇంకా శిక్షించి కేసులు నమోదు చేయాలని పోలీస్ మరియు రెవెన్యూ అధికారులు బాధ్యత విస్మరించడం వల్లే దోషులు తప్పించుక తిరుగుతున్నారని ఆరోపించారు. బాధితుల పైన కేసులు నమోదు చేయడం దారుణమని విమర్శించారు. హిందూ మతం కులాలకు వేదిక కాదని ఎక్కడ కూడా దైవదర్శనాలకు డబ్బులు వసూలు చేయాలని లేదని వివరించారు. వ్యవస్థ కాదు వ్యక్తులు మాత్రమే అహంకారాన్ని ప్రదర్శించి సంఘటనకు బాధ్యులు అయ్యారని వివరించారు. గుడి బడి ప్రాంతాలలో కుల వివక్ష ధనిక పేద వర్గాలు అంతమైనప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు ప్రభుత్వం స్పందించి ఎక్స్గ్రేషియా ప్రకటించి బాధితులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రాజకీయ పార్టీలు నిందితులను కొమ్ము కాయడం దారుణమని బిజెపి ఆధ్వర్యంలో నిందితులను శిక్షించే వరకు ప్రశ్నించి పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు ఈ సందర్భంగా బిజెపి నాయకులు శ్రీనివాస్ తల్లోజు ఆచారి తదితరులు ప్రసంగించగా జిల్లా అధ్యక్షులు నరేందర్ రావు రాష్ట్ర నాయకులు ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్ ప్రసాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రం గౌడ్ రాష్ట్ర అధికార ప్రతినిధి దిలీప్ ఆచారి తో పాటు ముఖ్య నేతలు జిల్లా పదాధికారులు వివిధ మండలాల అధ్యక్షులు ముఖ్య నేతలు పాల్గొన్నారు

# డబ్బులు లేకున్నా వృద్ధప్య పెన్షన్ కార్డు ఇస్తే సారా పోస్తాం...

ఉంద్యాల గ్రామంలో గుప్పు మంటున్న సారా?

చూచి చూడనట్లు వెళ్తున్న ఆప్కారి అధికారులు. బిబిఅబ్కారి అధికారులు దొరికిన వారిని వారి బండి మీద ప్రజలు మహిళలు చూస్తుండగానే తీసుకొని పోయి మధ్యలోనే వదిలేసి వెళుతున్నారు.

సారా విక్రయ దారులతో ఎక్సైజ్ అధికారులకు మూడు పూలు ఆరు కాయలు చేసుకుంటున్న అధికారులు.

**చిన్న చింతకుంట ఫిబ్రవరి 24 (స్కై న్యూస్);** చిన్న చింతకుంట మండల పరిధిలోనే ఉంద్యాల గ్రామం సారా తయారీలో ప్రసిద్ధి. సార సేవించే మనుషులు కాళ్లు చేతులకు బలం లేకుండా నిస్సాయ స్థితిలో ఉంటారు అని మహిళలు తెలుపుతున్నారు.సార తయారుచేయు విధానంలో నల్ల బెల్లం, సార సర్టికలు, మత్తు గోలీలు, పంట చేనులో వాడే యూరియా కలిపి తయారుచేస్తారు.ఇట్టి విషయం జిల్లా మండల ఆప్కారి అధికారులకు తెలుసు అని గ్రామ మహిళలు తెలుపుతున్నారు. ప్రతిరోజు తెల్లవారుజాము 4 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు బస్టాండ్ కూడలి ఇండ్ల వెనికి భాగంలో కంప పొదల మధ్య భాగంలో బస్టాండ్ కూడాలీలో సార విక్రయిస్తుంటారు అని గ్రామ ప్రజలు మహిళలు తెలుపుతున్నారు. ఇట్టి విషయంపై ఆప్కారి అధికారులకు ఎన్నో సార్లు ఫిర్యాదులు చేసిన ఫిర్యాదు చేసిన రోజు లేక రెండు మూడు రోజులలో వచ్చి అనుమానితులను తీసుకువెళ్లి మార్గం మధ్యలో సంప్రదింపులు చేసుకొని వదిలేస్తున్నారు. లేదంటే తాసిల్దార్ ముందు బైండ్ ఓవర్ చేసేస్తారు. అంతే ఇద్దరి అధికారుల కనుసైగలో గ్రామ లోని పెద్ద మనుషుల సమక్షంలో పూచికత్ మీద వదిలేస్తున్నారు అని ప్రజలు మహిళలు తెలుపుతున్నారు. వారము లేఖ రెండు వారల తర్వాత మల్ల తిరిగి వచ్చి యధావిధిగా సారా అమ్ముతున్నారు అని మహిళలు తెలుపుతున్నారు. సారాను అధికంగా యూత్ వారే తాగి కాళ్లు చేతులు ఆడని దుస్థితిలో ఇంటిలో పడి ఉన్నారు అని మహిళలు అంటున్నారు. మా వారు బస్టాండ్ కూడలికి వెళ్ళగా డబ్బులు లేవంటే నీ వృద్ధాప్య పెన్షన్ కార్డు ఇస్తే పెన్షన్ వచ్చిన తర్వాత నేను డబ్బులు పట్టుకొని మిగతావి మీకు ఇస్తామని సారా పోస్తున్నట్లు గ్రామ మహిళలు తెలుపుతున్నారు. సారా ఒప్పందం చేసుకొని కార్డు వాళ్ళ దగ్గరనే పెట్టుకుంటున్నారు అని మహిళలు తెలుపుతున్నారు. సంబంధిత అధికారులు సారా బట్టిలపై, సారా



విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామ మహిళలు కోరుతున్నారు.

# అధిక వేగం అనర్థాలకు మూలం

వేగం కన్న ప్రాణం మిన్న జాగ్రత్తగా వాహనాలు నడపాలి

కంటి చూపు వాహనదారులకు ప్రధానం

డ్రైవర్లకు ఉచితంగా కంటి చూపు పై ప్రత్యేక శిబిరం ఏర్పాటు

హాజరైన ట్రాఫిక్ డీసీపీ శివమ్ ఉపాధ్యాయ ఐపిఎస్, మహేశ్వరం ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్

పాల్గొన్న షాద్ నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ,సీఐ విజయ్ కుమార్, ట్రాఫిక్ సీఐ చంద్రశేఖర్



**రంగారెడ్డి జిల్లా (స్కై న్యూస్) ఫిబ్రవరి 23 :-** వాహనదారులు జాగ్రత్తగా వాహనాలు నడపాలంటే ముందుగా మెరుగైన కంటి చూపు చాలా ముఖ్యమని, అందుకోసం ప్రతి ఒక్క డ్రైవర్లు చెకప్ లు చేయించుకోవాలని సూచించారు ఫ్యూచర్ సిటీ ట్రాఫిక్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ శివమ్ ఉపాధ్యాయ ఐపీఎస్ రోడ్డు భద్రత మరియు డ్రంక్ అండ్ డ్రైవ్,అభయ్ సారధి కార్యక్రమాన్ని షాద్ నగర్ ట్రాఫిక్ పోలీస్,లా అండ్ ఆర్డర్ పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ ట్రాఫిక్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ శివమ్ ఉపాధ్యాయ ఐపీఎస్., మహేశ్వరం ట్రాఫిక్ ఏసిపి చంద్రశేఖర్, షాద్ నగర్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ లక్ష్మీనారాయణ ఐపిఎస్, ట్రాఫిక్ సీఐ చంద్రశేఖర్,పట్టణ సీఐ విజయ్ కుమార్ హాజరయ్యారు ఇందులో భాగంగా ముందుగా 142 మంది డ్రైవర్లకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు అనంతరం వాహనదారులకు డ్రంక్ అండ్ డ్రైవ్ పై ప్రత్యేక అవగాహన కల్పించారు ఈ సందర్భంగా ట్రాఫిక్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ శివమ్ ఉపాధ్యాయ మాట్లాడుతూ రోడ్డు భద్రత అనేది ఒక క్లిష్టమైన సమస్య ఇది రోజు వారి జీవితాలను ప్రభావితం చేస్తుందని, దీనిని పరిష్కరించడానికి అవగాహనను వ్యాప్తి చేయడానికి మరియు సురక్షితమైన పద్ధతులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం జాతీయ రహదారి భద్రత కార్యక్రమాలతో పాటు ప్రతి ఒక్కరు సురక్షితంగా వాహనాలు నడిపి క్షేమంగా గమ్యానికి చేరేలా ప్రతి ఒక్క పోలీసులు అటు వాహనదారులకు ఇటు డ్రైవర్లకు,ప్రజలకు అవగాహనా చేస్తూ కృషి చేస్తున్నారని అన్నారు

**డ్రంక్ అండ్ డ్రైవ్ అతిపెద్ద నేరం..**

డ్రంక్ అండ్ డ్రైవ్ అనేది చాలా అతిపెద్ద నేరమని, మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల మీతో పాటు అటు ప్రయాణికులకు ఇటు కుటుంబాలకు తీరని అన్యాయం చేసినట్లు అవుతుందని కాబట్టి ప్రతి ఒక్కరు వాహనదారులు డ్రైవర్ మద్యం పూర్తిగా మానేసి సురక్షితంగా వాహనాలు నడిపి క్షేమంగా ఇంటికి చేరుకోవాలని సూచించారు నేడు



మద్యం అనేది ఒక మహమ్మారిలా ప్రతి ఒక్కరిని ఆవహించి ఉందని తద్వారా మత్తులో ఎలా నడిపిస్తామో ఏం చేస్తున్నామో తెలుసుకోకపోవడం వల్ల ఎన్నో ప్రమాదాలు, మరణాలు, సంఘటనలు, దుర్ఘటన జరుగుతున్నాయని గుర్తు చేశారు రహదారి భద్రత నిబంధనలను వారికి వివరించారు ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు వాహనాల్లో ప్రయాణించేటప్పుడు సీట్ బెల్ట్ ధరించాలని, సిగ్నల్ జంపింగ్, అతివేగంతో వాహనాలు నడపరాదని సూచించారు మద్యం సేవించి డ్రైవింగ్ చేయవద్దని అన్నారు అనంతరం నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడుపుతామని వాహనదారులతో ప్రతిజ్ఞ చేయించారు ఓవర్ స్పీడ్, డ్రంక్ అండ్ డ్రైవ్, డిస్ట్రాక్టెడ్ డ్రైవ్, పని ఒత్తిడి వల్ల నిద్రపోతూ డ్రైవింగ్ చేయడం, ట్రాఫిక్ రూల్స్ పాటించకపోవడం,ఓవర్ స్పీడ్, సిగ్నల్ జంపింగ్, డేంజరస్ డ్రైవింగ్ వీటి వల్ల జరిగే ప్రమాదాలను ప్రజలకు వివరించారు ఈ కార్యక్రమంలో టోల్గేట్ ఇంచార్జ్ ఎస్ డి. ఇబ్రహీం, ట్రాఫిక్ పోలీసులు, రాయికల్ వాస్తవ్యులు శ్రీనివాస్, రామేశ్వరం వాస్తవ్యులు సురేష్, అన్నారం వాస్తవ్యులు రామకృష్ణ పాల్గొన్నారు.

## డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం

: జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్





**నారాయణపేట ఫిబ్రవరి 24 (స్కై న్యూస్)** రోడ్డు ప్రమాదాల నివారణే ప్రధాన లక్ష్యంగా చేపట్టిన 'ూతీతీఅజవ 'ూశ్రీఅజవ' 2వ విడత అవగాహన కార్యక్రమంలో భాగంగా మంగళవారం నాడు జిల్లా ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆటో, టాక్సీ మరియు పోలీస్ వాహన డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది.ఈ శిబిరాన్ని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... రోడ్డు ప్రమాదాల నివారణలో డ్రైవర్ల పాత్ర అత్యంత కీలకమని, ముఖ్యంగా డ్రైవర్లకు కలర్ బ్లైండ్, వయస్సు పెరిగే కొద్ది కంటి చూపు మందగించడం జరుగుతుంది అని అలాంటి వారికి చికిత్స ద్వారా కంటి వైద్య పరీక్షలు నిర్వహించుకొని తగిన జాగ ముఖ్యంగా డ్రైవర్లకు సమస్యలు లేకుండా కంటి చూపు సక్రమంగా ఉండటం అత్యవసరమని తెలిపారు. కంటి చూపు స్పష్టంగా ఉంటే ట్రాఫిక్ సిగ్నల్స్, రహదారి సూచనలు సరిగ్గా గుర్తించి సురక్షితంగా వాహనాలు నడపగలరని చెప్పారు.జిల్లా వ్యాప్తంగా ఆటో, టాక్సీ డ్రైవర్కు కంటి వైద్య పరీక్షలు నిర్వహించాలనే ఉద్దేశంతో కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలు అందించడమే కాకుండా, తగిన చికిత్సలు కూడా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా అందించబడతాయని ఎస్పీ వివరించారు.డ్రైవర్లకు రోడ్డు భద్రత నియమాలపై పలు ముఖ్య సూచనలు చేశారు. వాహనాలు నడిపేటప్పుడు వేగ పరిమితులను తప్పనిసరిగా పాటించాలని, ట్రాఫిక్ సిగ్నల్స్ మరియు రహదారి సూచనలను పాటించాలని, మద్యం సేవించి వాహనం నడపకూడదని, కారులో సీట్ బెల్ట్ మరియు ద్విచక్ర వాహనంపై హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని తెలిపారు. డ్రైవింగ్ సమయంలో సెల్ ఫోన్ వినియోగించరాదని, అలసట లేదా నిద్రలేమి ఉన్నప్పుడు వాహనం నడపవద్దని హెచ్చరించారు. వాహనాలకు సంబంధించిన లైసెన్స్, ఇన్సూరెన్స్, ప్యూసీ, రిజిస్ట్రేషన్ వంటి పత్రాలు చెల్లుబాటు అయ్యేలా చూసుకోవాలని, బ్రేకులు, లైట్లు, టైర్లు సరిగా ఉన్నాయో లేదో నిరంతరం పరిశీలించాలని సూచించారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, చిన్న జాగ్రత్త ప్రాణాలను కాపాడగలదని ఎస్పీ పేర్కొన్నారు.ఈ శిబిరం ద్వారా మొత్తం 70 మంది డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించామని, రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి ప్రమాద రహిత సమాజ నిర్మాణానికి సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎండి రియాజ్ హూల్ హాక్, డీఎస్పీ నల్లపు లింగయ్య, సీఐ, శివ శంకర్, ఆర్ ఐ లు నరసింహ, విజయ్ భాస్కర్, కంటి వైద్య నిపుణులు డాక్టర్ లు సునీల్,మల్లికా, సాయి ఆదిత్య, కనిగిరి శేఖర్ టౌన్ ఎస్సై వెంకటేశ్వర్లు, ట్రాఫిక్ ఎస్ఐ కృష్ణ చైతన్య, ఆర్ ఎస్ ఐ లు శ్వేత, శిరీష, పోలీస్ అధికారులు, సిబ్బంది డ్రైవర్లు పాల్గొన్నారు.

## బాస్ ను కలిసిన కౌన్సిలర్ దంపతులు...



**జోగులాంబ గద్వాల, ఫిబ్రవరి 24 (స్కై న్యూస్):**ఇటీవల జరిగిన గద్వాల మున్సిపల్ ఎన్నికల్లో 19 వ వార్డు నుండి బిజెపి జిల్లా అధ్యక్షులు టపాల రామాంజనేయులు , 26వ వార్డు నుండి టపాల కృష్ణవేణి ఇద్దరు భార్యాభర్తలు కౌన్సిలర్లు గా గెలుపొందడం తో మంగళవారం డికె. బంగ్లా లో మాజీ శాసన సభ్యులు డికె. భరత సింహ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి వారి ఆశీస్సులు తీసుకొవడం జరిగింది.. మున్సిపల్ ఎన్నికల్లో గెలుపొందిన భార్య భర్తలను డీకే భరత సింహారెడ్డి అభినందించడం జరిగింది ..

## కుర్తి రావులచెరువులో చిరుత పులి సంచారం..?



**జోగులాంబ గద్వాల, ఫిబ్రవరి 24(స్కై న్యూస్):**మల్దకల్ మండలం కుర్తి రావులచెరువు గ్రామంలో చిరుత పులి సంచరిస్తున్నదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. పటేల్ జనార్దన్ రెడ్డి రైతు నిమ్మ జామ తోటలలో చిరుత పులి అడుగుజాడలు కనిపించాయని తాము ఉదయం వెళ్లి చూసినట్లు తెలిపారు. గ్రామం సమీపంలోనే వ్యవసాయ పొలాలు ఉండడంతో గ్రామస్తులు పొలంలోకి వెళ్లాలంటే జంకుతున్నారు. గత మూడు నాలుగు రోజులుగా మండలంలో ఆయా గ్రామాలలో సంచరిస్తున్నదని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి గ్రామంలో పర్యటించి పులిజాడ తెలుసుకొని పులి నుండి ప్రాణాలు కాపాడాలని కోరుతున్నారు.

## ఎస్ఎస్‌సి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలను
# పకడ్బందీగా నిర్వహించాలి

### జిల్లా కలెక్టర్లకు చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు దిశా నిర్దేశం

**నారాయణపేట ఫిబ్రవరి 24 (స్కైన్యూస్)** రాష్ట్రంలో ప్రారంభమవుతున్న ఎస్ఎస్‌సి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు మంగళవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని జిల్లాల అధికారులు సమగ్ర ఏర్పాట్లు చేయాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ కలెక్టర్ కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ మందిరం నుండి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నిర్వహించబోయే పబ్లిక్ పరీక్షల కోసం విద్య, వైద్య, పోలీసు తదితర సంబంధిత శాఖల సమన్వయంతో అవసరమైన అన్ని ముందస్తు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో ఇంటర్మీడియట్ పరీక్షలు ఫిబ్రవరి 25 నుండి మార్చి 18 వరకు, అలాగే పదవ తరగతి (ఎస్ఎస్‌సి) పబ్లిక్ పరీక్షలు మార్చి 14 నుండి ఏప్రిల్ 16 వరకు నిర్వహించనున్న నేపథ్యంలో, పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలని, మాస్ కాపీయింగ్, చీటింగ్, మాల్‌ప్రాక్టీస్, ప్రశ్నాపత్రాల లీకేజీ వంటి అక్రమాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని చీఫ్ సెక్రటరీ ఆదేశించారు.

**విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి శ్రీమతి యోగితా రాణా మాట్లాడుతూ**

ప్రతి పరీక్షా కేంద్రంలో విద్యార్థులు కూర్చోవడానికి



తప్పనిసరిగా డబుల్ డెస్క్ టేబుళ్లు ఏర్పాటు చేయాలని, గాలి, వెలుతురు సదుపాయం కలిగిన తరగతి గదులు ఉండేలా చూడాలని సూచించారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు, తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. ప్రతి పరీక్షా కేంద్రంలో ఆశా వర్కర్ల ద్వారా హెల్త్ డెస్క్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. మాస్ కాపీయింగ్, పేపర్ చిట్స్ లేదా ఇతర మార్గాల ద్వారా చీటింగ్ అక్రమాలకు పాల్పడే వారికి ఉపేక్షించరాదని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో మొబైల్ ఫోన్లను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించరాదని స్పష్టం చేశారు. సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి సిట్టింగ్ స్క్వాడ్లు, ఫ్లయింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేసి చీటింగ్ జరుగకుండా కట్టుదిట్టమైన నిఘా ఉండేలా చూడాలని సూచించారు. అన్ని కేంద్రాల్లో గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి బి.ఎన్.ఎస్ సెక్షన్ 163, సి.ఆర్.పి.సి సెక్షన్ 144 అమలు చేయాలని ఆదేశించారు. ప్రశ్నాపత్రాల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, వాటిని పోలీస్ పహారాలో పరీక్షా కేంద్రాలకు తరలించి, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరచాలని సూచించారు. ప్రశ్నాపత్రాల కవర్లను పరీక్ష ప్రారంభానికి 15 నిమిషాల ముందు మాత్రమే సీసీటీవీ నిఘాలో తెరవాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల సమీపంలోని జిరాక్స్ కేంద్రాలను పరీక్షల సమయంలో మూసివేయాలని ఆదేశించారు. పరీక్ష పూర్తయ్యేంతవరకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు పరీక్షకు గరిష్టంగా 5 నిమిషాల ఆలస్యంతో వచ్చినా అనుమతించాలని తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రంలో క్లాక్ రూమ్ ఏర్పాటు చేసి, విద్యార్థులు తెచ్చే పుస్తకాలు, బ్యాగులు, ఇతర వస్తువులను అక్కడే ఉంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. హాల్ టికెట్ మరియు అవసరమైన స్టేషనరీతో మాత్రమే విద్యార్థులకు పరీక్షా కేంద్రంలో ప్రవేశం కల్పించాలని తెలిపారు. హాల్ టికెట్లను వెబ్‌సైట్ లేదా వాట్సాప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకునే సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ, జిల్లాలో నిర్వహించబోయే ఇంటర్మీడియట్, ఎస్ఎస్‌సి పబ్లిక్ పరీక్షలను నిర్వహించేందుకు కావలసిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను ఎస్.పి.డాక్టర్ వినీత్ ఆర్.డి.ఓ.రామచందర్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జేఈఈ మెయిన్స్‌లో 99.63 శాతం సాధించిన కేశంపేట మండలానికి చెందిన తొమ్మిదిరేకుల విద్యార్థి హనితేజ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా (స్కై న్యూస్) ఫిబ్రవరి 24 :-** రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలానికి చెందిన తొమ్మిదిరేకుల విద్యార్థి హనితేజ రెడ్డి జేఈఈ మెయిన్స్‌లో 99.63 శాతం సాధించారు భారతదేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన, కఠినమైన ప్రవేశ పరీక్షలలో ఒకటైన జేఈఈ మెయిన్స్‌లో తొమ్మిదిరేకుల గ్రామానికి చెందిన విద్యార్థి బీస హనితేజ రెడ్డి అద్భుత ప్రతిభ కనబరిచాడు జనవరి 24న నిర్వహించిన జేఈఈ మెయిన్స్ పరీక్ష ఫలితాల్లో హనితేజ రెడ్డి 99.63 శాతం సాధించి విశిష్ట స్థానాన్ని దక్కించుకున్నాడు మధ్యతరగతి కుటుంబానికి చెందిన హనితేజ రెడ్డి, తొమ్మిదిరేకుల గ్రామ సర్పంచ్ బీస కవిత కరుణాకర్ రెడ్డి దంపతుల కుమారుడు తన కష్టం తో పాటు, పట్టుదలతో ఈ విజయాన్ని సాధించి గ్రామానికి గర్వకారణంగా నిలిచాడు ఈ సందర్భంగా హనితేజ రెడ్డి నీ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు గ్రామస్తులు అభినందించారు భవిష్యత్తులో మరింత ఉన్నతస్థాయికి చేరుకుని గ్రామానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేశారు హనితేజ రెడ్డి సాధించిన ఈ విజయం గ్రామ యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని గ్రామస్థులు తెలిపారు.

## బూర్గుల వైద్యుడిగా రఘురాం

### ఇర్విన్ ఆరోగ్య కేంద్రానికి బూర్గుల డాక్టర్ రాఘవేందర్
### "వార్త తరంగాలు" వార్తా కథనానికి స్పందన







**రంగారెడ్డి జిల్లా (స్కై న్యూస్) ఫిబ్రవరి 24 :-** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం ఫరూక్ నగర్ మండలం బూర్గుల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు డాక్టర్ రాఘవేందర్ ఎట్టకేలకు బదిలీ అయ్యారు మూడు వారాల క్రితమే రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని బదిలీ ఉత్తర్వులు పంపగా మూడు వారాలుగా బదిలీ ఉత్తర్వులు తీసుకోకుండా రిలీవ్ కాకుండా డాక్టర్ రాఘవేందర్ కాలయాపన చేశారు ఈ వ్యవహారంపై "వార్త తరంగాలు" జాతీయ తెలుగు దినపత్రికలో "బదిలీ జరిగి మూడు వారాలు గడుస్తున్న భే ఖాతరు చేస్తూ బూర్గుల ఆరోగ్య కేంద్రాన్ని వదలని డాక్టర్" అంటూ డాక్టర్ రాఘవేందర్ బదిలీ వ్యవహారంపై ఈ కథనం రూపొందించబడింది ఎట్టకేలకు డాక్టర్ రాఘవేందర్ జిల్లాలోని ఇర్విన్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుడిగా రిపోర్ట్ చేశారు ఆయన స్థానంలో ఫరూక్ నగర్ మండలం బూర్గుల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ రఘురాం రిపోర్ట్ చేశారు ఎట్టకేలకు బూర్గుల ఆరోగ్య కేంద్రం వివాదం ముగిసింది మంగళవారం వార్త తరంగాలు దినపత్రికలో బూర్గుల ఆరోగ్య కేంద్రం బదిలీ వ్యవహారంపై కథనం రూపొందించగా జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించారు దీంతో డాక్టర్ రాఘవేందర్ రిలీవ్ అయ్యారు ఆయన స్థానంలో డాక్టర్ రఘురాం వచ్చి చేరారు మొత్తం బూర్గుల వివాదం లో ఒక సూపర్వైజర్ ఒక రెండవ ఏఎన్ఎం బదిలీ అయ్యారు మొత్తానికి బూర్గుల వివాదం కథ సుఖాంతమైంది

# శాసనసభలో దుర్ఘటన పై గళం విప్పాలి

### ఇందిరమ్మ ఇల్లు కాదు దోషులను శిక్షించాలి.
### సిద్ధాంతాలను వీడి సామాజిక పోరాటాలు నిర్వహించాలి.
### బి ఎస్ పి రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రాం శేఖర్

**నాగర్ కర్నూల్ ఫిబ్రవరి 24( స్కై న్యూస్)** మండల పరిధిలోని కుమ్మెర గ్రామంలో రెండు నెలల చిన్నారి మృత్యువాత పడ్డ దుర్ఘటనలో నిందితులందరినీ శిక్షించి రాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా శాసనసభలో ఎమ్మెల్యేలుగా కొనసాగుతున్న ఎస్సీ ఎస్టీ బీసీ వారంతా శాసనసభలో గళం విప్పకపోతే రోజులుగా మారుతారని వారి నియోజకవర్గాలలో నిరసన కార్యక్రమం చేపడతామని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్ హెచ్చరించారు నిందితులను అరెస్టు చేయాలని గత రెండు మూడు రోజులుగా నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యా ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో దళిత బడుగు బలహీన వర్గాలపై దాడులు అత్యాచారాలు పెరుగుతున్నాయని వాటిని కట్టడంలో పాలకులు పూర్తిగా నిర్లక్ష్యం చేయడం వల్ల కుమ్మెరలో రెండు నెలల పసికందు వృత్తి చెందిందని మండిపడ్డారు. 90 శాతం ఉన్న ప్రజలు ఓటు వేసి గెలిపించిన ప్రజాప్రతినిధులు దళితులపై దాడులు జరుగుతున్న స్పందించకపోవడం మండిపడ్డారు. కుమ్మెర



ఘటనలో బాధితులు ఫిర్యాదు చేసిన 8 మందిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు 2028 ఎన్నికలలో అహంకారానికి సమాధి కడతామని హెచ్చరించారు. ఇందిరమ్మ ఇల్లు డబ్బులు ముఖ్యం కాదని దోషులను శిక్షించి పార్టీలు చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. నిందితుల పైన కేసులు పెట్టడం దారుణమని వెంటనే వాటిని న్యాయం



చేయాలని కోరారు. బాధిత కుటుంబం దహన సంస్కారాలకు కూడా ఇబ్బందులు ఎదుర్కోవడం జరిగిందని రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజకీయాలు చేయడం మానుకోకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించాం. బిఆర్ఎస్ బిజెపి ఎమ్మెల్యేలు శాసనసభలో గళం విప్పి రాత్రుల పండగ నిలవాలని ఈ కుటుంబానికి 25 లక్షల ప్రకటించాలని డిమాండ్ చేశారు ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు బోనాసి రాంచందర్ రాష్ట్ర నాయకులు అంతటి నాగన్న బండి పృథ్వీరాజ్ కళ్యాణ్ తో పాటు ముఖ్య నేతలు పాల్గొన్నారు

## ఇంటర్మీడియట్ విద్యార్థులకు శుభాశీస్సులు....

### మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



రేపటి నుంచి ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పరీక్షలు వ్రాసే షాద్ నగర్ నియోజకవర్గ విద్యార్థిని, విద్యార్థులకు మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ ఆల్ ది బెస్ట్ చెప్పారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పరీక్షలు రాసే విద్యార్థిని - విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో రాయాలని మీరు కష్టపడి చదివిన దాన్ని ఇష్టంతో రాసి మంచి ఉత్తీర్ణత సాధించాలని కోరుకుంటున్నాను అని, మీ మంచి భవిష్యత్తుకి ఇది పునాది లాంటిదని పరీక్షలు బాగా రాసి మీ తల్లిదండ్రులకు మంచి పేరు తెచ్చి వారి కలలను నిజం చేయాలని ఆకాంక్షించారు అదే విధంగా మంచి ఉత్తీర్ణత సాధించి తల్లి తండ్రులకు, మీ అధ్యాపకులకు మంచి పేరు తీసుకరావాలని ఆకాంక్షించారు.

## మాజీమంత్రి వనమా ఆశీస్సులు తీసుకున్న బీఆర్ఎస్ కార్పొరేటర్లు



**కొత్తగూడెం ఫిబ్రవరి 24 (స్కై న్యూస్):** మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో విజయం సాధించిన కార్పొరేటర్లు మంగళవారం మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ని వారి స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి, బీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు సాగర్ మల్హోత్రా, గుణ చరిత్, మల్లెల స్వప్న, బత్తుల మధుచంద్, సింధు తపస్వి, గుగులోత్ రాంబాబు, మాజీ ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు మల్లెల రవిచంద్ర, భట్టు మంజుల, శంకర్, వీరన్న తదితర నాయకులు పాల్గొన్నారు.

# బాధితుల పైన కేసులు చట్టవుల్లంఘననే

### చిన్నారి మృతి ముమ్మాటికి హత్య నే
### న్యాయ విచారణకు దోషులను శిక్షించాలి
### బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రాం చందర్ రావు

**నాగర్ కర్నూల్ ఫిబ్రవరి 24 (స్కై న్యూస్)** బాధితులకు అండగా నిలవవలసిన పోలీస్ మరియు రెవెన్యూ శాఖ రాజకీయ నాయకుల ఒత్తిడికి తలోగ్గి బాధితులపై కేసులు నమోదు చేయడం చట్ట ఉల్లంఘననే అని మాజీఎమ్మెల్సీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామ్ చందర్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు మంగళవారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని ఒక హోటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలీసుల నిర్లక్ష్యం వల్ల నేటికీ నిందితులు అరెస్టు కాలేదని అన్నారు. ముఖ్యమంత్రి సొంత జిల్లాలోని ఇలాంటి సంఘటన జరగడం దీనిపై ముఖ్యమంత్రి కానీ ఆ పార్టీ మంత్రులు ఎమ్మెల్యేలు స్పందించకపోవడం దారుణమని వెంటనే న్యాయ విచారణ జరిపించి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. రెండు నెలల చిన్నారి మృతి ముమ్మాటికి హత్య నేనని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపాలనపై




పట్టు కోల్పోయారని రక్షణ శాఖ తన వద్ద ఉన్న ఎందుకు దోషులను శిక్షించాలని ఆదేశించడం లేదని ఆ పార్టీకి చెందిన నాయకులే కారకులు కాబట్టి వెంటనే విచారణ జరిపించి ప్రజలకు రక్షణగా నిలవాలని బాధిత కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాలలోని దేవాలయాలను కూడా ప్రభుత్వం తమ ఆధీనంలోకి తీసుకొని వాటిని పరిరక్షించాలని ఇలాంటి సంఘటనలు రాష్ట్రంలో పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు సమావేశంలో మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి మాట్లాడుతూ రాష్ట్ర నేతలు జిల్లా కేంద్రానికి చేరుకునే పోరాటాలు నిర్వహిస్తున్న బాధితులకు న్యాయం చేయకపోవడం దారుణమని బిజెపి ఆధ్వర్యంలో ఎస్సీ బీసీ జాతీయ కమిషన్లకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. జిల్లా ఎస్పీ మరియు జిల్లా కలెక్టర్పై ఫిర్యాదు చేయడంతో పాటు అన్ని చర్యలు తీసుకో అనే విధంగా పోరాటాలు నిర్వహిస్తామన్నారు పాలకులు సమాజానికి సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో సంఘటన జరిగి నాలుగు రోజులు గడుస్తున్న జిల్లా ఎస్పీ కలెక్టర్ ఎందుకు గ్రామాన్ని సందర్శించలేదని వీటిపై అధికారుల నిర్లక్ష్యంపై నిలదీస్తామన్నారు ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు నరేందర్ రావు తోపాటు దిలీప్ చారి ఆనంద్ గౌడ్ నాగేంద్రం గౌడ్ కట్టా సుధాకర్ రెడ్డి శ్రీనివాస్ పోతుగంటి భరత్ ప్రసాద్ సుజాత చంద్రకళ రమేష్ రఘునాయక్ తో పాటు పలువురు పాల్గొన్నారు

## తెలంగాణ విద్యార్థులను నైపుణ్యత లో ప్రపంచ స్థాయికి తీసుకెళ్తాం

### మంత్రి వివేక్ వెంకట స్వామి
### ఇండియా స్కిల్స్ 2025-26 రిజనల్ కాంపిటిషన్
### గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల ప్రధానం
### ముఖ్య అతిధిగా హాజరైన మంత్రి వివేక్ వెంకట స్వామి

**రంగారెడ్డి జిల్లా స్కై న్యూస్ ఫిబ్రవరి 24 :-** రంగారెడ్డి జిల్లా నందిగామ కన్హా శాంతి వనం లో గత నాలుగు రోజులుగా జరుగుతున్న ఇండియా స్కిల్ రిజనల్ కాంపిటిషన్ 2025-26 నేడు ముగింపు కు చేరుకుంది ఈ ముగింపు ఉత్సవాలకు ముఖ్య అతిధిగా మంత్రి గడ్డం వేవేక్ వెంకట స్వామి హాజరయ్యారు ఈ కాంపిటిషన్ లో సౌత్ ఇండియా లోని 5 రాష్ట్రలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ, రెండు కేంద్రపాలిత ప్రాంతాలు పూదుచేరి,లక్ష ద్వీప్ లకు చెందిన 300 మందికి పైగా పాల్గొన్నారు కాంపిటిషన్ లో గెలుపొందిన విద్యార్థులకు మెడల్స్ తో పాటు నగదు ప్రోత్సాహం అందజేశారు గెలుపొందిన విద్యార్థులను త్వరలో




జరగబోయే అంతర్జాతీయ కాంపిటిషన్లకు పంపనున్నట్లు నిర్వాహకులు తెలిపారు ముగింపు ఉత్సవాల్లో పాల్గొన్న మంత్రి



వివేక్ వెంకట స్వామి మాట్లాడుతూ యువత విద్యతో పాటు ఎదో ఒక కొత్త రంగం లో నైపుణ్యం పెంపోందించుకోవాలన్నారు యూనియన్ మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో ఒక మంచి కాంపిటిషన్ ఏర్పటు చేశారన్నారు రాబోయే తెలంగాణలోని యువతను నైపుణ్యం నేర్పించి అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దుతామన్నారు 120 నూతన అడ్వాన్స్ స్కిల్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు ఈ సెంటర్ల ద్వారా నూతనంగా ఏర్పాటు చేయనున్న పరిశ్రమలకు నైపుణ్యం కలిగిన యువత సిద్ధంగా ఉంటుందన్నారు.

# కొత్వాల విమలాదేవిని సన్మానించిన మెప్మా సిబ్బంది

**మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలి**

**46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి**



**పాల్వంచ ఫిబ్రవరి 24 (స్కై న్యూస్ ):**మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలనీ 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి అన్నారు.కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ లోని పాత పాల్వంచ 46వ డివిజన్ నుండి కార్పొరేటర్ గా ఎన్నికైన రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు సతీమణి కొత్వాల విమలాదేవి ని మంగళవారం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా ఆధ్వర్యంలో శాలువా, బొకే, స్వీట్లతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా కొత్వాల విమలాదేవి మాట్లాడుతూ మహిళలకు ఉపాధి అవకాశాలు, తద్వారా ఆర్థిక స్వలంబన లభించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా ఏడీఎంసి చంద్రశేఖర్ బాబు, కమ్యూనిటీ ఆర్గనైజర్స్ శాంత కుమారి, నాగమణి, సరితా, అమ్మ దీవెన పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు ప్రవళిక, స్వరూప, నాగమణి, సునీతా, సమాఖ్య ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారి పసికందు ఆత్మ శాంతికి కొవ్వొత్తుల నిరసన...



**చిన్న చింతకుంట ఫిబ్రవరి 24 (స్కై న్యూస్);** రెడ్డిలము అనే దురంకారంతో, పొగరెక్కిన క్రూరత్వంతో నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో కుమ్మెర మల్లన్న స్వామి జాతరలో దేవుని గుడిలోకి వెళ్లిన బీసీ రజక సోదరులపై తీవ్రంగా కొట్టడం,2 నెలల చిన్నారి పసికందును 8 మంది రెడ్ల కాళ్లతో తన్నడంతో మరణించారు.ఈ లోకం చూడని,అభం శుభం ఎరగని విషాదకరం,మనసును కలిచివేసే దుర్మార్గం సంఘటన,నేరస్తులైన దుండగులను తక్షణమే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని, అన్ని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చిన్న చింతకుంట బస్టాండ్ కుడలిలోని మహాత్మా గాంధీ విగ్రహం ముందు చిన్నారి పసికందు ఆత్మశాంతి కి కొవ్వొత్తుల నిరసనతో డిమాండ్.ఈ కార్యక్రమంలో పార్టీలకతీతంగా మరియు కుల సంఘాలు, ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# వార్డు అభివృద్దే లక్ష్యం

**వార్డులో పర్యటించి సమస్యలు తెలుసుకున్న 28వ వార్డు కౌన్సిలర్**

**చేగూరి లక్ష్మీ ప్రసన్న వేణుగోపాల్**




**రంగారెడ్డి జిల్లా (స్కై న్యూస్) ఫిబ్రవరి 24 :-** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపల్ 28వ వార్డు అభివృద్దే లక్ష్యమని 28వ వార్డు కౌన్సిలర్ చేగూరి లక్ష్మీ ప్రసన్న వేణుగోపాల్ అన్నారు వార్డులో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు వార్డులో ఎలాంటి సమస్యలు లేకుండా చూస్తానని అన్నారు ఎక్కడైనా ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు వార్డు అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు రమేష్, శ్రీశైలం గౌడ్ ( లడ్డు ), కోటిలింగం గౌడ్, గొంగల రవి కుమార్, అభిలాష్, రాహుల్, శ్రీకాంత్, శ్రీచరణ్, చంద్రకాంత్, తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ చైర్మన్ బసవేశ్వర్ దంపతులకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దంపతుల సన్మానం



**రంగారెడ్డి జిల్లా (స్కై న్యూస్) ఫిబ్రవరి 24 :-** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణ కేంద్రంలో షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ దంపతులకు వివాహ వార్షికోత్సవము సందర్భంగా షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అనురాధ దంపతులను కలిసిన మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బస్వం జగదేవి దంపతులు, అనతీతరం వివాహ వార్షికోత్సవం సందర్భంగా శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అనురాధ దంపతులు అనంతరం ఒకరినొకరు ఆప్యాయంగా సన్మానించుకున్నారు.

# నేడు మిషన్ భగీరథ నీరు బంద్

**జోగులాంబ గద్వాల, ఫిబ్రవరి 24(స్కై న్యూస్):**గద్వాల జిల్లా ప్రజలకు తెలియజేయునది ఏమనగా రేవులపల్లి, ధరూర్ మండలంలో నీటి శుద్ధి కర్మాగారం శుభ్రపరచడం జరుగుతున్నది. కావున ఈ నెల 25 వ తేదీన నీటి సరఫరా ఉండదని, ఆ తర్వాత యధావిధిగా నీటి సరఫరా చేయడం జరుగుతుందని మిషన్ భగీరథ గ్రిడ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి. రవిచంద్ర కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

# పసికందు మృతి క్రూర హత్యనే

**రక్షణ చట్టాన్ని అమలు చేయడంలో వైఫల్యం.**

**జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య.**





**నాగర్ కర్నూల్ ఫిబ్రవరి 24( స్కై న్యూస్)** రజక కులానికి చెందిన కుటుంబంపై అగ్రవర్ణానికి చెందిన 8 మంది దాడి చేసి పసికందు మృతికి కారణమయ్యారని పసుకందు మృతి ముమ్మాటికీ క్రూర హత్యని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య అన్నారు మంగళవారం జిల్లా కేంద్రంలో పలు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కుమ్మెరలో జరిగిన దుర్ఘటన ను వ్యతిరేకిస్తూ చేపట్టిన నిరసన కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు ముందుగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బహుజనులపై దాడి చేయడం అమానుషమని బీసీలకు రక్షణ చట్టాన్ని తీసుకువచ్చి పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. కులం పేరుతో దర్శనానికి వెళ్లకుండా గ్రామంలోని కొందరు అగ్రకులాలు దాడి చేయడం మళ్ళీ వారి పైన కేసులు నమోదు చేయించడం రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమేనని అన్నారు. ముఖ్యమంత్రి సొంత జిల్లాలోని ఇలాంటి సంఘటన జరిగిన దోషులను శిక్షించడంలో విఫలం చెందడం పై ఆయన ధ్వజమెత్తారు రాష్ట్రంలో నల్లగొండ కరీంనగర్ మహబూబ్నగర్ జిల్లాలోని పలు ప్రాంతాలలో బహుజనులపై దాడులకు పాల్పడుతున్నారని కొందరు బహుజనుల ఉనికిని అస్తిత్వాన్ని దెబ్బతీసేందుకే ఇలాంటి సంఘటనలకు పాల్పడుతున్నారని వీటిని నిరసిస్తూ పెద్ద ఎత్తున ఉద్యమం చేపడుతున్నట్లు తెలిపారు. కుల వివక్ష రాష్ట్రంలో నేటికీ కొనసాగుతుందని అనేక ప్రాంతాలలో అగ్రకులాలకు చెందిన కొందరు దాడులు చేస్తున్నారని వీటిని ఎస్సీ ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలని ఐక్యంగా పోరాటం చేసి ఎదుర్కోవాలని అన్నారు నిరసన కార్యక్రమాన్ని ఉధృతం చేయడంలో విశారదన్ మహారాజు నిర్వహిస్తున్న పాత్రను ఆయన అభినందించారు మానవీయ కోణంలో నిర్వహిస్తున్న పోరాటాలకు బీసీ సమాజం అండగా నిలుస్తుందని ఉద్యమాన్ని ఉధృతం చేయాలని కోరారు. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికలలో బీసీలు పెద్ద ఎత్తున విజయం సాధించడం జీర్ణించుకోలేక ఇలాంటి సంఘటనలకు పాల్పడుతున్నారని ఇలాంటి వారిని శిక్షించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం వల్ల దాడులు పెరిగిపోతున్నాయని అన్నారు. బీసీలకు కూడా అట్రాసిటీ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు ఈ సంఘటన నివసిస్తూ రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో ఈనెల 27న ధర్నాలు దీక్షలు చేపట్టాలని పిలుపునిచ్చారు బాధిత కుటుంబానికి కోటి రూపాయల పరిహారం చెల్లించాలని కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిట్టింగ్ న్యాయమూర్తికే విచారణ జరిపించి దోషులను శిక్షించాలని రక్షణ కల్పించాలని కోరారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పెద్దయ్య యాదవ్ జిల్లా నాయకులు కాళ్ల నిరంజన్ మల్లేష్ గౌడ్ పాలెం మాజీ సర్పంచ్ గోవిందు లావణ్య నాగరాజు మహిళా విభాగం అధ్యక్షురాలు రేణుక లక్ష్మయ్య వెంకటేశ్వర్లు సుధాకర్ గౌడ్, శ్రీనివాసులు నిరంజన్ యాదవ్ రామకృష్ణ గౌడ్ రాజు బాల పిరు చైతన్య శ్రీకాంత్ మౌలానా తదితరులు పాల్గొన్నారు

# రాత్రులు సైతం ప్రజ సమస్యలపై డాక్టర్ స్వప్న శంకర్ నాయక్

**ప్రజలకే కష్టం వచ్చినా వెంటనే నేను అక్కడ ఉంటా**

**19వ డివిజన్ కార్పొరేటర్ డాక్టర్ స్వప్న శంకర్ నాయక్**




**కొత్తగూడెం ఫిబ్రవరి 24(స్కై న్యూస్):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం మొట్టమొదటి మున్సిపల్ కార్పొరేషన్ లో మొట్టమొదటి 19వ డివిజన్ కార్పొరేటర్ గా డాక్టర్ స్వప్న శంకర్ నాయక్ ప్రజలకు ఇచ్చిన మాట కొరకు ప్రజా సమస్యలే లక్ష్యం గా రాత్రి లు సైతం ప్రజా సమస్యలు తెలుసుకుంటూ డివిజన్లో పర్యటిస్తున్న కార్పొరేటర్ డాక్టర్ స్వప్న. వీధిలైట్లు లేక డివిజన్ ప్రజలు ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకొని రాత్రిలో చిట్టి రామవరం తండా కు వచ్చి డివిజన్ ప్రజల అవసరాలు తెలుసుకుంటున్న 19 వ డివిజన్ కార్పొరేటర్ డాక్టర్ స్వప్న శంకర్ నాయక్. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డాక్టర్ గా అనేక కార్యక్రమాలు చేశామని ప్రజలకు నిస్వార్థమైన సేవ చేయాలనే ఆలోచనతో మంత్రి పొంగులేటి ఆశీర్వాదంతో 19వ డివిజన్ నుండి కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ గా గెలుపొందడం జరిగిందని 19వ డివిజన్ ప్రజలు ఎంతో ప్రేమతో నన్ను ఆదరించి అత్యధిక మెజార్టీతో గెలిపించారని అటువంటి డివిజన్ నా ప్రజలకు ఏ కష్టం వచ్చినా వెంటనే రాత్రి అయినప్పటికీ రావడం జరిగిందని 19వ డివిజన్ ను ఆదర్శంగా తీర్చిదిద్దడమే నా కర్తవ్యం అని ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ డివిజన్ అభివృద్ధికి డివిజన్ ప్రజల అవసరాలు తీరుస్తారని ఈ సందర్భంగా తెలియజేసిన 19వ డివిజన్ మొట్టమొదటి కార్పొరేటర్ డాక్టర్ స్వప్న శంకర్ నాయక్.

# సంత సేవాలాల్ మహారాజ్ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం

**కరపత్రాలు విడుదల చేసిన ఆలయ కమిటీ**




**రంగారెడ్డి జిల్లా (స్కై న్యూస్) ఫిబ్రవరి 24 :-** గిరిజనుల ఆరాధ్య దైవంగా తన సేవలతో ప్రపంచాన్ని అబ్బురపరచిన మహోన్నత వ్యక్తిగా పేరుగాంచిన శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహ ప్రతిష్టాపన అదేవిధంగా పరివార దేవతల విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం ఈనెల 28వ తేదీన షాద్ నగర్ పట్టణంలోని టీచర్స్ కాలనీలో భారీ ఎత్తున నిర్వహించనున్నారు ఇందుకు సంబంధించిన కరపత్రాలను లంబాడి హక్కుల పోరాట సమితి నాయకుడు ఆలయ కమిటీ సభ్యుడు మంగూలాల్ నాయక్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు అందజేశారు ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని ఆకాంక్షించారు అదేవిధంగా మున్సిపల్ చైర్మన్ అగునూరు బస్వం, ఆర్డీవో సరిత, జర్నలిస్ట్ నాయకులు కేపి, కొందుర్గు మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మాజీ జెడ్పిటిసి శ్యాంసుందర్ రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ కేపీలకు కరపత్రాలు అందించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ సేవాలాల్ మహారాజ్ ఉత్సవాలను పురస్కరించుకుని పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన వెల్లడించారు శ్రీ భోజ్ మహారాజ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించబడతాయని ఆయన వెల్లడించారు ప్రతి ఒక్కరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు ఈనెల 26వ తేదీ గురువారం ఉదయం 8 గంటలకు గణపతి వాస్తు పూజతో కార్యక్రమాలు మొదలవుతాయి యాగశాల ప్రవేశం, పుణ్యాహవాచనం, మండపారాధనలు, అగ్ని ప్రతిష్ట, గణపతి పంచసూక్త హోమాలు, జలాధివాసము, హారతి, తీర్థ ప్రసాద ఇతర వంటి కార్యక్రమాలు కొనసాగుతాయి అలాగే రాత్రి 9 గంటలకు హరినామ సంకీర్తన కార్యక్రమం ఉంటుంది ఇక 27వ తేదీ శుక్రవారం ఉదయం 8 గంటలకు ప్రాతఃకాల పూజలు, మూల మంత్ర హోమాలు, చండీ సప్తపది హోమం, ధ్యానాధివాసం, పుష్పాదివాసం, శయ్యాదివాసం, హారతి, రాత్రి 9 గంటలకు హరినామ సంకీర్తన ఉంటాయి ఇక చివరి రోజైన 28వ తేదీన ఉదయం 8 గంటలకు ప్రాతఃకాల పూజలతో ప్రారంభమై మహాస్న వనము ఉదయం 10 గం. 05 ని. కు పునర్వసు నక్షత్రయుక్త మేష లగ్నంలో యంత్ర ప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట, ప్రాణ ప్రతిష్ట, హోమాలు, అష్టదిగ్బలి, పూర్ణకుంభ నివేదన, పూర్ణాహుతి, హారతి, వేద ఆశీర్వచనము, తీర్థ ప్రసాద వితరణ మొదలైన కార్యక్రమాలు జరుగుతాయి భక్తులు పెద్ద ఎత్తున హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

# భక్తుల పాలిట కల్పవృక్షం మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి



**జోగులాంబ గద్వాల, ఫిబ్రవరి 24(స్కై న్యూస్):**కోరిన కోరికలు తీరుస్తూ భక్తుల పాలిట కల్పవృక్షంగా మారిన మంత్రాలయం శ్రీశ్రీశ్రీ రాఘవేంద్ర స్వామి 431 వ పుట్టినరోజు వేడుకలు గద్వాలలోని షెరెల్లీ వీధిలో గల శ్రీ రాఘవేంద్ర స్వామి మఠంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతులైన శ్రీ శ్రీ శ్రీ సుబుదేంద్ర తీర్థుల ఆశీస్సులతో ఆలయ విచారణ కర్త ప్రభాకర్ రావు, మేనేజర్ శ్రీపాద జోషి, అర్చకులు సుజాయేంద్ర ఆధ్వర్యంలో అష్టాక్షరి హోమం, విశేష ఫల పంచామృతం,రథోత్సవం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన పలువురు భక్తులు పాల్గొని స్వామివారి ఉత్సవాన్ని తిలకించారు. అనంతరం తీర్థప్రసాద వితరణ జరిగింది.

# మహిళా ఉద్యోగులకు మార్చి 4న హెల్త్ క్యాంప్ ఏర్పాటు

**మహిళా దినోత్సవ పోస్టర్ ను ఆవిష్కరించిన ఫ్యూచర్ సిటీ కమిషనర్ సుధీర్ బాబు, డి.ఆర్.ఒ సంగీత**



**రంగారెడ్డి జిల్లా (స్కై న్యూస్) ఫిబ్రవరి 24 :-** అంతర్జాతీయ మహిళా దినోత్సవ పోస్టర్ ను ఆవిష్కరించిన ఫ్యూచర్ సిటీ కమిషనర్ సుధీర్ బాబు,డి.ఆర్.ఒ సంగీత అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని రంగారెడ్డి జిల్లాలోని మహిళా ఉద్యోగులకు మార్చి నెల 4 వ తేదీన హెల్త్ క్యాంప్ ని ఏర్పాటు చేయాలని, అదేవిధంగా ఆటలు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడానికి మహిళలకు ప్రత్యేక అనుమతి ఇప్పించాలని, మార్చి 7వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకోవడానికి అనుమతినివ్వాలని కలెక్టర్ ను డిఆర్ఓ ద్వారా వినతి పత్రాన్ని సమర్పించారని రంగారెడ్డి జిల్లా టిజీఓ అధ్యక్షులు డాక్టర్ కె రామారావు తెలిపారు ఈ కార్యక్రమంలో శాంతి శ్రీ, రేవతి, అలివేలు, మహేశ్వరి, సైదమ్మ, బాలేశ్వరి, డా.నరేందర్, మసూద్ అలీ తదితరులు పాల్గొన్నారు

# ఈ సూపర్‌ఫుడ్స్‌తో సహజంగా అందాన్ని పెంచుకోండి!



వయసు పెరిగే కొద్దీ మన చర్మం సహజ కాంతిని కోల్పోతుంది. దీంతో మన ఫేస్ డల్‌గా మారుతుంది. ఈ సమస్యను అదిగమించేందుకు చాలా మంది మార్కెట్‌లో దొరికే ఖరీదైన మేకప్ ఉత్పత్తులను వాడుతారు. కానీ మన రోజువారి జీవనశైలిలో, ఆహారపు ఎంపికల్లో కొన్ని మార్పులు చేసుకోవడం వల్ల మన చర్మ కాంతిని ఈజీగా పెంచుకోవచ్చని ఇక్కడ చాలా మందికి తెలియదు. అందంగా కనిపించాలని అందరూ అనుకుంటారు. ఇందకోసం ఖరీదైన ఉత్పత్తుల వాడుతారు. కానీ సరైన ఆహారం తీసుకుంటే మన చర్మం సహజంగా మెరుగుపడుతుందని చాలా మందికి తెలియదు. అవును విటమిన్ సి అధికంగా ఉండే పండ్లు తినడం వల్ల చర్మ ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఇవి కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచి, పిగ్మెంటేషన్‌ను తగ్గిస్తాయి. అలాగే సూర్మరశ్మి నుంచి చర్మాన్ని రక్షిస్తాయి. కాబట్టి నారింజ, కివి, బొప్పాయి, స్ట్రాబెర్రీలు, బేరి వంటి విటమిన్ సి అధికంగా ఉండే పండ్లను మీకు మంచి ఎంపిక. డ్రై ఫ్రూట్స్: బాదం, వాల్‌నట్‌లు, అవిసె గింజలు, చియా గింజలు చర్మాన్ని మృదువుగా ఉంచడంలో, పొడిబారడాన్ని తొలగించడంలో ప్రభావవంతంగా పనిచేస్తాయి. ఎందుకంటే వాటిలో ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు, విటమిన్ ఇ పుష్కలంగా ఉంటాయి. కాబట్టి, ఈ డ్రై ఫ్రూట్స్ అవసరమైన పరిమాణంలో తీసుకోవడం అలవాటు చేసుకోండి. ఆకుకూరలు: పాలకూర, మెంతెం కూర, బ్రోకలీ వంటి ఆకుకూరల్లో ఐరన్, ఫోలేట్, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. అవి శరీరాన్ని నిర్విషీకరణ చేసి రక్త ప్రసరణను మెరుగుపరుస్తాయి. దీని వల్ల చర్మానికి సహజమైన మెరుపు లభిస్తుంది. కాబట్టి మీ రోజు వారి ఆహరంలో ఆకు కూరలను చేర్చుకోవడం ఉత్తమం. చిలగడదుంప: ఇది కూడా చర్మం సంరక్షణకు చాలా బాగా పనిచేస్తుంది. ఇందులో ఉండే యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు చర్మాన్ని లోపలి నుండి మెరుగుపరుస్తాయి. చిలగడదుంపలను క్రమం తప్పకుండా తినడం వల్ల చర్మం కాంతి పెరుగుతుంది అలాగే ముడతలు కూడా తగ్గుతాయి. అలాగే దానిమ్మ కూడా చర్మాన్ని ఆరోగ్యాన్ని కాపాడడంతో సూపర్‌గా పనిచేస్తుంది.దానిమ్మను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల చర్మం కాంతి పెరుగుతుంది. అలాగే చర్మంపైఉన్న ఫైన్ లైన్స్ ను తగ్గిస్తుంది. బొప్పాయి: బొప్పాయి రుచికరంగా ఉండటమే కాకుండా మన శరీరానికి చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. ఇందులో ఉండే ఎంజైమ్‌లు జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి, కడుపును శుభ్రంగా ఉంచుతాయి. బొప్పాయి శరీరం నుండి విషాన్ని తొలగించడంలో సహాయపడుతుంది, ఇది మన చర్మంపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతుంది. హైడ్రేటింగ్ ఆహారాలు,: దోసకాయలు, పుచ్చకాయలలో నీరు పుష్కలంగా ఉంటుంది, ఇది మీ చర్మాన్ని రోజంతా హైడ్రేట్ గా ఉంచుతుంది. పెరుగు వంటి ప్రోబయోటిక్ ఆహారాలు పేగుతో సహా ఆరోగ్యకరమైన జీర్ణవ్యవస్థను ప్రోత్సహిస్తాయి, అవి మొటిమలకు కారణమయ్యే బ్యాక్టీరియాతో కూడా పోరాడతాయి,ఇవి చర్మ ప్రకాశాన్ని పెంచడంలో సహాయపడతాయి. కాబట్టి వీటిని మీ రోజువారి ఆహారంలో చేర్చుకోవడం ద్వారా మీరు సహజంగా అందాన్ని పెంచుకోవచ్చు.

## చికెన్ కుర్మా ఇలా చేస్తే.. పక్కింటోళ్ళు కూడా మీ ఇంట్లో వాలిపోతారు?



ఎప్పుడూ రొటీన్ చికెన్ కుర్మా ఏం తింటారు. ఈ రోజు కొత్తగా బెంగాలీ స్టైల్ చికెన్ కుర్మా ట్రై చేయండి . దీనిని ఆంధ్ర, తెలంగాణలో ఎంతో ఇష్టంగా తింటారు. అయితే, ఇప్పుడు బెంగాలీ స్టైల్లో చికెన్ కుర్మాని ఎలా తయారు చేయాలో ఇక్కడ తెలుసుకుందాం. ఇది అన్నంలోకి మరింత రుచిగా ఉంటుంది.

**కావాల్సిన పదార్థాలు :** ముప్పావు కిలో చికెన్, గ్రాములు 3 బంగాళాదుంపలు, 2 పెద్ద ఉల్లిపాయలు, 5 చిన్న టమోటాలు, 3 టేబుల్ స్పూన్స్ అల్లం వెల్లుల్లి పేస్ట్, 5 ఘాటు మిర్చి, బిర్యానీ ఆకు- 4, ఒక టేబుల్ స్పూన్ మిరియాలు, 5 లవంగాలు 5 దాల్చిన చెక్క, అర టీ స్పూన్ పసుపు,ఒక టేబుల్ స్పూన్ ధనియాల పొడి, ఒక టేబుల్ స్పూన్ మసాలా పొడి, ఒక టేబుల్ స్పూన్ పంచదార, కొత్తిమీర, 5 టేబుల్ స్పూన్స్ నూనె, రుచికి తగినంత ఉప్పు.

ముందుగా స్టవ్ వెలిగించి పాన్ పాన్ పెట్టి దానిలో ఆయిల్ వేసి వేడయ్యాక వేడి చేయాలి. ఇక ఇప్పుడు బంగాళాదుంపను తీసుకుని చిన్న చిన్న ముక్కలుగా చేసి పక్కన పెట్టుకోవాలి. ఆ తర్వాత ధనియాలు, లవంగాలు అన్ని తీసుకుని పొడి లాగా పట్టుకోవాలి. ఇక ఇప్పుడు పాన్ పెట్టి దానిలో ఆయిల్ వేసి అది వేడయ్యాక ఉల్లిపాయ ముక్కలు, జీడిపప్పులు గోల్డ్ కలర్ వచ్చే వరకు వేయించాలి. ఇక ఇప్పుడు ముందుగా చేసి పెట్టుకున్న చికెన్ ను తీసుకుని బాగా వేయించి ఆ తర్వాత దానిలో బంగాళాదుంప ముక్కలు , పచ్చిమిర్చి వేసి మీడియం మంటపై 10 నిమిషాల పాటు స్టవ్ మీదనే ఉంచి ఉడికించాలి. గ్రేవీ కావాలనుకునే వారు రెండు గ్లాస్ లు నీళ్ళు పోసి రుచికి తగినంత ఉప్పు వేసి టేస్ట్ చూసి ఏమైనా తక్కువ అనిపిస్తే వాటిని వేసి మూత పెట్టేసి చికెన్ ఉడికే వరకు బాగా ఉడికించండి. చికెన్ ఉడికిన తర్వాత మూత తీసి రెండు స్పూన్స్ పంచదార వేస్తే రుచి అదిరిపోతుంది. ఇది వేశాక తియ్యగా ఉంటుంది కదా అని సందేహిస్తున్నారా? తియ్యగా ఉన్నా కూడా మీ నోటికి కొత్త రుచి తగులుతుంది. దించే ముందు కొత్తిమీర ఆకులు వేసి దించేయండి. అంతే, వేడి వేడి బెంగాలీ స్టైల్ చికెన్ కుర్మా రెడీ.

## లేత వయసులోనే తెల్లజుట్టుతో పెద్దవారిలా కనిపిస్తున్నారా?



తెల్ల జుట్టు వృద్ధాప్యానికి సహజ సంకేతం. కానీ ఇప్పుడు చాలా మందికి ఇరవైలలో కొందరికి అంతకంటే ముందుగానే జుట్టు తెల్లబడిపోతుంది. ఇది శరీరంలో దాగి ఉన్న తీవ్రమైన అనారోగ్యానికి సంకేతమా అని చాలా మంది ఆందోళన చెందుతుంటారు. ఎప్పుడో 60 ఏళ్లకు రావల్సిన తెల్ల జుట్టు నేటి కాలంలో లేత వయసులోనే పలకరిస్తుంది. తెల్ల జుట్టు వృద్ధాప్యానికి సహజ సంకేతం. కానీ ఇప్పుడు చాలా మందికి ఇరవైలలో కొందరికి అంతకంటే ముందుగానే జుట్టు తెల్లబడిపోతుంది. ఇది శరీరంలో దాగి ఉన్న తీవ్రమైన అనారోగ్యానికి సంకేతమా అని చాలా మంది ఆందోళన చెందుతుంటారు. అన్ని సందర్భాల్లో కాదుగానీ కొన్ని సందర్భాల్లో చిన్న వయస్సులోనే జుట్టు నెరవడం శరీరంలోని ఆరోగ్య సమస్యకు హెచ్చరిక సంకేతంగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. జుట్టు రంగు మెలనిన్ అనే వర్ణద్రవ్యం మీద ఆధారపడి ఉంటుంది. వయస్సుతో పాటు ఈ వర్ణద్రవ్యం తగ్గడం సాధారణం. కానీ ఈ ప్రక్రియ చిన్న వయస్సులోనే ప్రారంభమైతే దాని వెనుక అనేక ఆరోగ్య కారణాలు ఉండవచ్చు. ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ ట్రైకాలజీలో ప్రచురితమైన 2018 అధ్యయనంలో జుట్టు అకాలంగా తెల్లబడటానికి గల ముఖ్య కారణాల్లో విటమిన్ ః12 లోపం ఒకటి. బీ12 విటమిన్ సాధారణ స్థాయిల కంటే తక్కువగా ఉంటుంటే చిన్న వయసులోనే జుట్టు తెల్లబడుతుంది. ఈ విటమిన్ లోపం వల్ల జుట్టు అకాలంగా తెల్లబడి వృద్ధాప్యం వేగంగా వచ్చినట్లు అనిపిస్తుంది. థైరాయిడ్ హార్మోన్ల సమతుల్యత చెదిరిపోతే, జుట్టు సాధారణ పెరుగుదల, రంగు ప్రభావితమవుతుందని ఓ పరిశోధనలో తేలింది. హైపోథైరాయిడిజం జుట్టు త్వరగా తెల్ల రంగులోకి మారే ధోరణితో ముడిపడి ఉంటుంది. డెర్మటాలజీ రీసెర్చ్ అండ్ ప్రాక్టీస్‌లో ప్రచురితమైన సమాచారం ప్రకారం విటిలిగో, అలోపేసియా అరేటా వంటి ఆటో ఇమ్యూన్ వ్యాధులు జుట్టు వర్ణద్రవ్యం కణాలను దెబ్బతీస్తాయి. ఫలితంగా జుట్టు అకాలంగా తెల్ల రంగులోకి మారుతుంది. 2020లో నేచర్ జర్నల్‌లో ప్రచురితమైన ఒక అధ్యయనంలో దీర్ఘకాలిక ఒత్తిడి శరీరంలో ఆక్సీకరణ ఒత్తిడిని పెంచుతుందని, ఇది జుట్టు రంగుకు కారణమైన మూల కణాలను నాశనం చేస్తుందని పేర్కొంది. అంతేకాకుండా ఒత్తిడి నేరుగా జుట్టు రాలడానికి కూడా కారణమవుతుంది.వైద్యుల అభిప్రాయం ప్రకారం ఆలస్యంగా నిద్ర లేవడం, అనారోగ్యకరమైన ఆహారం, ధూమపానం, కాలుష్యం, రసాయనాలతో కూడిన హెయిర్ ఉత్పత్తులను అధికంగా ఉపయోగించడం వల్ల జుట్టు ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. అయితే అన్ని సందర్భాల్లోనూ జుట్టు తెల్లబడటం అనేది శరీరంలో అంతర్లీనంగా దాగి ఉన్న పెద్ద వ్యాధి కాదని గుర్తుంచుకోవడం ముఖ్యం. కొన్నిసార్లు ఇది వంశపారంపర్యంగా లేదా సహజంగా కూడా సంభవిస్తుంది. అయితే జుట్టు తెల్లబడటం అనేది అసాధారణ అలసట, జుట్టు రాలడం, బరువు తగ్గడం, హార్మోన్ల సమస్యలతో కూడి ఉంటే వీలైనంత త్వరగా డాక్టర్‌ను సంప్రదించి సంబంధిత రక్త పరీక్షలు చేయించుకోవాలి. తద్వారా సమస్యను తొలినాళ్లలోనే గుర్తించి సరైన చికిత్స అందించేందుకు వీలవుతుంది.



## సిగరెట్ తాగే అలవాటు ఉందా?

ఒత్తిడి తగ్గించుకోవడానికి సిగరెట్ తాగుతున్నారా? టెన్షన్‌లో ఉన్నప్పుడు పొగ వదిలితే రిలాక్సేషన్ వస్తుందని అనుకుంటున్నారా? అయితే మీరు పెద్ద పొరపాటే చేస్తున్నారు. మీరు పీల్చే ఆ పొగ ఒత్తిడిని తగ్గించకపోగా, మిమ్మల్ని మానసిక ఆందోళనలోకి నెట్టేస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అసలు సిగరెట్ తాగినప్పుడు మెదడులో ఏం జరుగుతుంది? ఆఫీసులో పని ఒత్తిడి పెరిగినా, ఏదైనా టెన్షన్ వచ్చినా వెంటనే సిగరెట్ వెలిగించడం చాలా మందికి అలవాటు. ధూమపానం చేస్తే మనసు ప్రశాంతంగా ఉంటుందని, ఒత్తిడి తగ్గుతుందని చాలా మంది నమ్ముతుంటారు. కానీ ఇది పూర్తిగా అపోహ అని, వాస్తవానికి ధూమపానం ఒత్తిడిని తగ్గింకపోగా మరింత పెంచుతుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. సిగరెట్లలో ఉండే నికోటిన్ ఊపిరితిత్తుల ద్వారా కేవలం కొన్ని సెకన్లలోనే మెదడుకు చేరుకుంటుంది. ఇది శరీరంలో డోపమైన్ అనే ఫీల్ గుడ్ హార్మోన్‌ను విడుదల చేస్తుంది. దీనివల్ల కొద్ది నిమిషాల పాటు ఏదో తెలియని ఆనందం, హాయిగా ఉన్నట్లు అనిపిస్తుంది. ఈ తాత్కాలిక అనుభూతిని చూసి ధూమపానం ఒత్తిడిని తగ్గిస్తుందని భ్రమపడుతుంటారు. ఢిల్లీలోని లంగ్స్ వెల్నెస్ సెంటర్‌కు చెందిన డాక్టర్ నేహా వధేరా దీనిపై కీలక వివరణ ఇచ్చారు. నికోటిన్ ఇచ్చే ఆ ప్రశాంతత కేవలం కొన్ని నిమిషాలు మాత్రమే ఉంటుంది. శరీరంలో నికోటిన్ ప్రభావం తగ్గగానే, మళ్లీ సిగరెట్ తాగాలనే కోరిక మొదలవుతుంది. దీనివల్ల మునుపటి కంటే ఎక్కువ విశ్రాంతి లేకపోవడం, చిరాకు, ఆందోళన పెరుగుతాయి. దీర్ఘకాలంలో ధూమపానం చేసేవారిలో మానసిక ఒత్తిడి స్థాయిలు సాధారణం కంటే ఎక్కువగా ఉంటాయని పరిశోధనలు చెబుతున్నాయి.

# బిజినెస్

## ఆ ఐటీ కంపెనీ ఉద్యోగుల్లో ఫుల్ జోష్




దేశంలో అతిపెద్ద ఐటీ కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌లో (ఎజూ) పనిచేసే ఉద్యోగుల్లో ఫుల్ జోష్‌లో ఉన్నారు. కారణం.. మధ్య, సీనియర్ స్థాయి ఉద్యోగుల త్రైమాసిక వేరియబుల్ పేను మూడో త్రైమాసికంలో గరిష్ఠంగా 80 శాతం వరకు పెంచింది. దాదాపు రెండేళ్లుగా తక్కువ స్థాయిలో కొనసాగిన చెల్లింపుల తరువాత ఇది గణనీయమైన మార్పుగా భావిస్తున్నారు. ఇటీవలి కాలంలో మధ్య, సీనియర్ స్థాయి సిబ్బందికి వేరియబుల్ పే 20--50 శాతం మధ్యకే పరిమితమై ఉండేది. ఇప్పుడు అక్టోబర్--డిసెంబర్ త్రైమాసికానికి సంబంధించి చాలామంది మధ్యస్థాయి ఉద్యోగులు సుమారు 80 శాతం వేరియబుల్ చెల్లింపులు పొందినట్లు సమాచారం. సీనియర్ స్థాయి ఉద్యోగులకు 40--80 శాతం మధ్య చెల్లింపులు జరిగినట్లు తెలిసింది. 'మనీ కంట్రోల్' కథనం ప్రకారం.. ఉద్యోగులకు జనవరిలో ఈ మొత్తాలు జమయ్యాయి. కంపెనీ వర్గాల ప్రకారం.. మొత్తం ఉద్యోగుల్లో 70 శాతం మందికి పైగా తమ త్రైమాసిక వేరియబుల్ వేతనంలో 100 శాతం అందుతోంది. అయితే, పూర్తి చెల్లింపులు ఎక్కువగా జూనియర్ స్థాయి ఉద్యోగులకే పరిమితమై ఉన్నట్లు తెలుస్తోంది.

**ఇన్ఫోసిస్‌లోనూ బలమైన చెల్లింపులు**

ఇక మరో దేశీయ ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ కూడా డిసెంబర్ 31, 2025తో ముగిసిన త్రైమాసికానికి సగటున 85 శాతం పనితీరు బోనస్ చెల్లింపులు విడుదల చేసింది. గత మూడున్నరేళ్లలో ఇది బలమైన వేరియబుల్ పే ఫలితంగా నిలిచింది.

## వివో నుంచి ప్రీమియం ఫోన్లు.. 'జీస్' ట్రిపుల్ కెమెరాతో..

**న్యూఢిల్లీ:** వివో ఇండియా తన 'వీ' సిరీస్ నుంచి 'వివో వీ70', 'వివో వీ70 ఎలైట్' పేర్లతో రెండు ప్రీమియం స్మార్ట్ ఫోన్లను భారతీయ మార్కెట్లోకి విడుదల చేసింది. ఫోటోగ్రఫీకి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చే 'వివో' ఈసారి కెమెరాలకు ప్రసిద్ధి చెందిన 'జీస్' సంస్థతో ప్రత్యేక భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. రెండు ఫోన్లలోనూ జీస్ పార్ట్‌నర్‌షిప్‌తో కూడిన ట్రిపుల్ కెమెరా సెటప్ ఉంది. 50 మెగా పిక్సెల్(ఎంపీ) ప్రైమరీ కెమెరా, 50 ఎంపీ టెలి ఫొటోలెన్స్, 8 ఎంపీ అల్ట్రావైడ్ యాంగిల్ కెమెరా ఇచ్చారు. ఉత్తమ సెల్ఫీల కోసం ముందు భాగంలో 50 ఎంపీ జీస్ ఫ్రంట్ కెమెరా ఉంది. అల్యూమినియం ఫ్రేమ్, రౌండెడ్ కార్నర్లతో ప్రీమియం లుక్ ఇచ్చారు. వీటికి ఐపీ68, ఐపీ69 రేటింగ్ ఉండడంతో నీరు, దుమ్ము, ధూళి నుంచి రక్షణ లభిస్తుంది. 6.59 అంగుళాల అమోలెడ్ డిస్‌ప్లే ఇచ్చారు. 120హెచ్‌జెడ్ రిఫ్రెష్ రేటుకు, 5000 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్‌కు సపోర్ట్ చేస్తాయి. ఈ రెండూ ఆండ్రాయిడ్ 16తో కూడిన ఆరిజన్ ఓఎస్6తో పనిచేస్తాయి. వీటికి ఆరేళ్ల సాఫ్ట్‌వేర్ సపోర్ట్ ప్రకటించింది. రెండు ఫోన్లలో భారీ 6500 ఎంఏహెచ్ బ్యాటరీ ఉంది. ఇది 90డబ్ల్యూ ఫ్లాష్‌ఛార్జ్‌కి సపోర్ట్ చేస్తుంది. ఒక్కసారి ఛార్జ్ చేస్తే 40 గంటల వీడియో ప్లేబ్యాక్ లేదా 11 గంటల నావిగేషన్ లభిస్తుందని కంపెనీ పేర్కొంది. హీట్ తగ్గించడానికి 'బైపాస్ ఛార్జింగ్' సౌకర్యం కూడా ఉంది. ఇందులో స్నాప్‌డ్రాగన్ 7 జెన్4 ప్రాసెసర్‌ను అందించారు. రోజువారీ పనులు, గేమింగ్‌కు అనుకూలంగా ఉంటుంది. రెండు వేరియంట్లలో లభిస్తుంది. 8జీబీం 256జీబీ వేరియంట్ ధర రూ.45,999గా కంపెనీ నిర్ణయించింది. 12జీబీం 256జీబీ వేరియంట్ రూ.49,999కు లభిస్తుంది ఇందులో శక్తివంతమైన క్వాల్కమ్ స్నాప్‌డ్రాగన్ 8ఎస్‌జెన్3 చిప్‌సెట్‌తో వస్తుంది. ఇది గేమింగ్, అధిక పనితీరుకు అనువుగా ఉంటుంది. మొత్తం మూడు వేరియంట్లలో లభ్యమవుతుంది. 8జీబీం 256జీబీ వేరియంట్ ధరను రూ.51,999గా కంపెనీ పేర్కొంది. 12జీబీం 256జీబీ వేరియంట్ ధర రూ.56,999, 12జీబీం 512 జీబీ వేరియంట్ ధర రూ.61,999గా నిర్ణయించింది.ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యెస్ బ్యాంక్ కార్డులపై 10% వరకు డిస్కౌంట్ అందిస్తోంది. రూ.1,499 వివో ఇయర్ బడ్స్ ను ఉచితంగా పొందవచ్చు. ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, వివో ఆన్‌లైన్ స్టోర్లలో లభిస్తున్నాయి.

## తగ్గనున్న వంటనూనెల ధరలు!



**న్యూఢిల్లీ :** వంటనూనెల ధరలు మరింత తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. క్రూడ్ వంటనూనెలపై దిగుమతి సుంకాన్ని 10 శాతం తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఈ నిర్ణయం మే 31 నుంచి అమల్లోకి రానున్నట్లు కేంద్ర సర్కార్ విడుదల చేసిన నోటిఫికేషన్‌లో వెల్లడించింది. ప్రస్తుతం క్రూడ్ పామాయిల్, క్రూడ్ సోయా ఆయిల్, క్రూడ్ సన్‌ఫ్లవర్‌పై 20 శాతం దిగుమతి సుంకం విధిస్తున్నారు. దేశీయంగా వినియోగిస్తున్న వంటనూనెల్లో 70 శాతం దిగుమతులపై ఆధారపడుతున్నది. ప్రస్తుతం ఇండోనేషియా, మలేషియా, థాయ్‌లాండ్ దేశాల నుంచి అధికంగా పామాయిల్‌ను భారత్ దిగుమతి చేసుకుంటున్నది. అలాగే సన్‌ఫ్లవర్ ఆయిల్‌ను అర్జెంటీనా, బ్రెజిల్, రష్యా, ఉక్రెయిన్ దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నది. కేంద్రం తీసుకున్న తాజా నిర్ణయంతో వంటనూనెల ధరలు మరింత తగ్గనున్నాయని, అలాగే డిమాండ్ కూడా మరింత పెరిగే అవకాశాలున్నాయని ఇండస్ట్రీ వర్గాలు వెల్లడించాయి. ఈ మూడు చమురులపై మొత్తం దిగుమతి సుంకం 27.5 శాతం నుంచి 16.5 శాతానికి దిగిరానున్నది. సెప్టెంబర్ 2024లో క్రూడ్, రిఫైన్ వంటనూనెలపై కస్టమ్స్ సుంకాన్ని 20 శాతానికి పెంచిన విషయం తెలిసిందే.

## ఫోక్స్‌వ్యాగన్ మరో కారు



హైదరాబాద్, ఫిబ్రవరి 21: ఫోక్స్‌వ్యాగన్ మరో లగ్జరీ కారును దేశీయ మార్కెట్‌కు పరిచయం చేసింది. ఎస్‌యూవీ విభాగాన్ని మరింత బలోపేతం చేసే ఉద్దేశంలో భాగంగా సంస్థ 'టేరాన్ ఆర్ లైన్' మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ కారు ప్రారంభ ధర రూ.46.99 లక్షలుగా నిర్ణయించింది. ఏడుగురు కూర్చోవడానికి వీలుండే విధంగా డిజైన్ చేసిన ఈ మాడల్ 2.0 లీటర్ల 4-సిలిండర్ టర్బో పెట్రోల్ ఈవీఓ4 ఇంజిన్‌తో రూపొందించింది. కేవలం 7.3 సెకండ్లలో 100 కిలోమీటర్లు ప్రయాణించనున్న ఈ కారు గంటకు 200 కిలోమీటర్లకు పైగా దూసుకుపోనున్నది. పానోరమిక్ సన్‌రూఫ్, రియర్ సన్ షేడ్స్, 15 ఇంచుల ఇన్ఫోటైన్‌మెంట్ స్క్రీన్, ఫుల్-డిజిటల్ కాక్‌పిట్, 9 ఎయిర్‌బ్యాగ్‌లు, 14 అటానమస్ ఫీచర్లతో రూపొందించింది.

## ప్రీమియం ఫీచర్లతో బడ్జెట్ ధరల్లో కొత్త స్మార్ట్ ఫోన్

చైనా మొబైల్ తయారీ సంస్థ ఇన్ఫినిక్స్ బడ్జెట్ ధరల్లో కొత్త స్మార్ట్ ఫోన్ తీసుకువచ్చింది.'ఇన్ఫినిక్స్ నోట్ ఎడ్జ్ 5జీ' పేరుతో భారత మార్కెట్‌లో విడుదల చేసింది. 6 జీబీ ర్యామ్, 128 జీబీ ఇంటర్నల్ స్టోరేజ్ వేరియంట్ ధర రూ. 21,999గా, 8 జీబీ ర్యామ్, 128 జీబీ ఇంటర్నల్ స్టోరేజ్ వేరియంట్ ధర రూ. 23,999గా, 8 జీబీ ర్యామ్, 256 జీబీ ఇంటర్నల్ స్టోరేజ్ వేరియంట్ ధర రూ. 25,999గా నిర్ణయించారు.

లాంచ్ ఆఫర్‌లో భాగంగా 12 నెలల సాధారణ వారెంటీతో పాటు 12 నెలల ఎక్స్‌టెండెడ్ వారెంటీ సదుపాయాన్ని కంపెనీ కల్పిస్తోంది. వన్‌టైమ్ స్క్రీన్ రీప్లేస్‌మెంట్ ఆఫర్‌ను కూడా అందిస్తోంది. ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంకు కార్డుల ద్వారా చేసే కొనుగోళ్లపై రూ.2 వేల వరకు అదనపు డిస్కౌంట్ లభిస్తుంది. ఫ్లిప్‌కార్ట్‌తో పాటు కంపెనీ వెబ్‌సైట్, ఆఫ్ లైన్ స్టోర్స్‌లో ఈ ఫిబ్రవరి 25నుంచి సేల్ అందుబాటులో ఉండనుంది. సిల్క్ ఫైబర్ ఫినిష్, స్టెల్లర్ బ్లూ, లూనార్ టైటానియం కలర్స్‌లో మూడు వేరియంట్లలో లభిస్తుంది. ఇందులో 6.78 అంగుళాల 1.5కే త్రీడీ కర్వ్‌డ్ అమోలెడ్ డిస్‌ప్లే, కార్నింగ్ గొరిల్లా గ్లాస్ 7ఐ ప్రొటెక్షన్, మీడియాటెక్ డైమెన్సిటీ 7100 ప్రాసెసర్, ఐపీ65 వాటర్ అండ్ డస్ట్ రెసిస్టెన్స్ సర్టిఫికెట్, ఆండ్రాయిడ్ 16 ఆధారిత ఎక్స్‌ఓఎస్ 16 ఆపరేటింగ్ సిస్టం తదితర ఫీచర్లు ఉన్నాయి. వెనకవైపు 50 మెగా పిక్సెల్ మెయిన్ కెమెరాతో పాటు 8 మెగా పిక్సెల్ అల్ట్రా వైడ్ లెన్స్‌తో కూడిన డ్యుయల్ కెమెరా సెట్ అప్ ఉంది. ముందువైపు సెల్ఫీలు, వీడియో కాల్స్ కోసం 13 మెగా పిక్సెల్ సెల్ఫీ కెమెరా ఇచ్చారు. 6500 ఎంఏహెచ్ బ్యాటరీ ఉంది. 45డబ్ల్యూ ఫాస్ట్ ఛార్జింగ్ సదుపాయంతో వస్తోంది. 5జీ, డ్యూయల్ 4జీ వీఓఎల్ఈటీ కనెక్టివిటీ సపోర్టులున్నాయి. వై--ఫై, బ్లూటూత్ 5.4, జీపీఎస్, ఎన్ఎఫ్‌సీ ఉన్నాయి. యూఎస్‌బీ టైప్--సీ పోర్ట్, ఐఆర్ సెన్సార్ ఉన్నాయి. ఇన్--డిస్‌ప్లే ఫింగర్ ప్రింట్ సెన్సార్లున్నాయి.




# స్పోర్ట్స్

## భళా అమ్మాయిలు.. ఆసియా కప్ కొల్లగొట్టిన టీమిండియా!

అంతర్జాతీయ క్రికెట్‌లో భారత అమ్మాయిలు వరుసగా ట్రోఫీలు పట్టేస్తున్నారు. నిరుడు హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని టీమిడియా తొలిసారి వన్డే వరల్డ్‌కప్ ఛాంపియన్‌గా అవతరించగా.. రాధా యాదవ్ బృందం మహిళల ఆసియా కప్ రైజింగ్స్ స్టార్స్‌లో విజేతగా నిలిచింది. సెమీఫైనల్లో శ్రీలంకను చిత్తు చేసిన టీమిండియా ఆదివారం జరిగిన ఫైనల్లో బంగ్లాదేశ్‌పై పంజా విసిరింది. ఓపెనర్లు విఫలమైనా తేజల్ హసబ్నిస్(51 నాటౌట్) అర్ధ శతకంతో.. రాధా యాదవ్(38) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో మెరవగా.. ప్రేమా రావత్(3-12) ధాటికి బంగ్లా కుప్పకూలింది. 46 పరుగుల తేడాతో ప్రత్యర్థిని మట్టికరిపించిన భారత్ టైటిల్ కొల్లగొట్టింది. సెమీఫైనల్లో భారీ విజయంతో శ్రీలంకను ఇంటికి పంపిన భారత ఏ జట్టు ఫైనల్లోనూ చెలరేగింది. అజేయంగా టైటిల్ పోరుకు దూసుకొచ్చిన బంగ్లాదేశ్‌ను ఆల్‌రౌండ్ షోతో దెబ్బతీసింది. శుభారంభం దక్కకపోయినా తేజల్ హసబ్నిస్(51 నాటౌట్) హాఫ్ సెంచరీతో చెలరేగగా.. రాధా యాదవ్(38) కీలక ఇన్నింగ్స్ ఆడింది. ఐదో వికెట్‌కు వీరు 69 రన్స్ జోడించి పరువు కాపాడారు. 135 పరుగుల ఛేదనలో బంగ్లాదేశ్‌ను భారత బౌలర్లు వణికించారు.

**అటు ప్రేమ.. ఇటు తనూజ**

టీమిండియా నిర్దేశించిన ఛేదనలో బంగ్లాదేశ్ ఏ దశలోనూ లక్ష్యం దిశగా సాగలేదు. ఓపెనర్ ఇష్మా తంజిమ్(3)ను ఔట్ చేసిన సైమా థాకొర్ వికెట్ల వేటకు తెరసింది. షమీమా సుల్తానా(20)ను వెనక్కి పంపిన ప్రేమా రావత్(3-21) ప్రత్యర్థిని మరింత దెబ్బతీసింది. రాధా యాదవ్ ఓవర్లో షర్మీన్ సుల్తానా(18) డగౌట్ చేరగా.. ప్రమాదకరమైన సదియా అక్తర్(10), లతా మొండల్(1)ను ఔట్ చేసిన ప్రేమ మ్యాచ్‌ను భారత్ వైపు తిప్పింది. మరో ఎండ్‌లో తనూజ కన్వర్(2-11) సైతం చెలరేగగా బంగ్లా కోలుకోలేకపోయింది. షోఫియా ఖాతూన్(9)ను తనూజ ఔట్ చేయగా బంగ్లా 88 పరుగులకే ఆలౌటయ్యింది.



## పాకిస్తాన్ సూపర్ లీగ్‌లోకి మరో సౌతాఫ్రికా క్రికెటర్


పాకిస్తాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్) 2026లోకి మరో సౌతాఫ్రికా క్రికెటర్ చేరాడు. ఈ లీగ్‌లో ఇప్పటికే చాలామంది సౌతాఫ్రికా ఆటగాళ్లు పాల్గొంటుండగా.. తాజాగా యువ వికెట్‌కీపర్ బ్యాటర్ రూబిన్ హెర్మన్ వీరి సరసన చేరాడు. హెర్మన్‌ను లాహోర్ ఖలందర్స్ ఫ్రాంచైజీ సొంతం చేసుకుంది. ఖలందర్స్‌తో జతకట్టిన అనంతరం హెర్మన్‌కు ఓ ప్రత్యేక గుర్తింపు దక్కింది. ఫాఫ్ డుప్లెసిస్ తర్వాత ఖలందర్స్‌కు ప్రాతినిథ్యం వహించిన రెండో సౌతాఫ్రికన్‌గా హెర్మన్ గుర్తింపు పొందాడు. గతేడాది చివర్లో డుప్లెసిస్ ఐపీఎల్ వేలం నుంచి తప్పుకొని పీఎస్ఎల్‌లో చేరాడు. 14 ఏళ్ల ఐపీఎల్ కెరీర్‌లో దాదాపు 4,800 పరుగులు చేసిన డుప్లెసిస్, పీఎస్ఎల్ ఆడటం అప్పట్లో సంచలనం. ఈ ఏడాది ఐపీఎల్ విండోలో మరో సౌతాఫ్రికా ఆటగాడు పీఎస్ఎల్‌లో పాల్గొంటుండటం ఆసక్తికరం. 29 ఏళ్ల హెర్మన్ జూూ ూ20 ఛాలెంజ్ 2023-24లో 436 పరుగులు చేసి తొలిసారి వెలుగులోకి వచ్చాడు. ఆతర్వాత ూూ20లో పార్ల్ రాయల్స్ తరఫున ఆడాడు. 2025 ఎడిషన్‌లో సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్‌పై ఒత్తిడిలో 81లి పరుగులు చేసి ప్రతిభను చాటుకున్నాడు. ఆ ఎడిషన్‌లో 226 పరుగులు చేశాడు. మొత్తం టీ20 కెరీర్‌లో హెర్మన్ 1,497 పరుగులు చేశాడు. ఇందులో ఓ శతకం, 8 అర్ధ శతకాలు ఉన్నాయి.




**లాహోర్ జట్టు వ్యూహం**

లాహోర్ జట్టు ఇప్పటికే ఫఖర్ జమాన్, హారిస్ రౌఫ్, ఉసామా మిర్, హసీబుల్లా ఖాన్ వంటి స్థానిక ఆటగాళ్లను కలిగి ఉంది. హెర్మన్ చేరికతో ఆ ఫ్రాంచైజీ బ్యాటింగ్ బలం మరింత పెరుగనుంది. హెర్మన్ మిడిలార్డర్‌లో కీలకమైన బ్యాటర్. అతన్ని 5 లేదా 6వ స్థానంలో ఉపయోగించుకోవచ్చు. స్ట్రైక్ రొటేట్ చేయడం, డెత్ ఓవర్లలో బౌండరీలు కొట్టడం హెర్మన్ ప్రత్యేకత.

## స్పిన్ వ్యూహానికి శ్రీలంక చిత్తు.. సూపర్ 8లో ఇంగ్లండ్ బోణీ..!




స్వదేశంలో స్పిన్ అస్త్రంతో ప్రత్యర్థులను దెబ్బతీయాలనుకున్న శ్రీలంకకు ఇంగ్లండ్ పెద్ద షాకిచ్చింది. పల్లెకెల్ స్టేడియంలో విల్ జాక్స్(3-22) తిప్పేయగా.. పవర్ ప్లేలోనే కష్టాల్లో పడిన లంక.. ఏ దశలోనూ కోలుకోలేకపోయింది. 150 పరుగుల ఛేదనలో టాపార్డర్, మిడిలార్డర్ చేతులెత్తేయగా.. కెప్టెన్ దసున్ శనక(30) పోరాడినా సరిపోలేదు. తడబడుతూ సాగిన ఆతిథ్య జట్టు ఇన్నింగ్స్‌కు ఆదిల్ రషీద్(2-13) తెరదించగా.. 51 పరుగుల తేడాతో గెలుపొందిన ఇంగ్లండ్ అదిరే బోణీ కొట్టింది. సొంతగడ్డపై చెలరేగాలనుకున్న శ్రీలంకను ఇంగ్లండ్ స్పిన్ అస్త్రంతో పడగొట్టింది. సూపర్ 8లో లంక నుంచి స్పిన్ ముప్పును ఊహించిన హ్యారీ బ్రూక్ సేన అందుకు తగ్గట్టే సన్నద్ధమైంది. కానీ.. తీరా మైదానంలోకి దిగాక ఫిల్ సాల్ట్(62) ఒక్కడే రాణించగా ప్రత్యర్థికి 150 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. ఫేవరెట్ లంక తమకు కొట్టినపిండి అయిన పల్లెకెలె స్టేడియంలో అలవోకగా గెలుస్తుందని అభిమానులు అనుకున్నారు. కానీ, పవర్ ప్లేలోనే ఇంగ్లండ్ విజయం దిశగా నడిచింది.

**34కే ఐదు వికెట్లు**

డేంజరస్ ఓపెనర్ పథుమ్ నిశాంక(9)ను రెండో ఓవర్లోనే ఔట్ చేసి జోఫ్రా ఆర్చర్(2-20) తొలి బ్రేకివ్వగా.. అక్కడి నుంచి విల్ జాక్స్(3-22)తన స్పిన్ మ్యాజిక్ చూపించాడు. రిటర్న్ క్యాచ్‌తో కుశాల్ మెండిస్(4)ను వెనక్కి పంపిన అతడు.. పవన్ రత్ననాయకే(0), దునిత్ వెల్లలాగే(10)లను వెనక్కి పంపి ఆతిథ్య జట్టును కష్టాల్లోకి నెట్టాడు. పవర్ ప్లే చివరి ఓవర్లో రెండు ఫోర్లు బాదిన వెల్లలాగే.. మిడాఫ్‌లో షాట్‌కు యత్నించి బ్రూక్ చేతికి చిక్కడంతో... 34కే లంక ఐదు కీలక వికెట్లు కోల్పోయింది. సగం వికెట్లు పడిన వేళ కెప్టెన్ దసున్ శనక(30)తో కలిసి జట్టును ఆదుకోవాలనుకున్న కమిందు మెండిస్(13).. డాసన్ వేసిన 9వ ఓవర్లో సిక్సర్ బాదాడు. కానీ, బంతికి రిటర్న్ క్యాచ్ ఇచ్చి లంక కష్టాలను మరింత పెంచాడు. శనకకు తోడుగా నిలిచే వారు కరువయ్యారు. ఓవర్టన్ ఓవర్లో హేమంత అనూహ్యంగా బ్యాట్‌ను వికెట్లకు తాకించి వెనుదిరిగాడు. అప్పటికే అవసరమైన నెట్‌రన్ రేటు పది దాటడంతో.. పెద్ద షాట్లు ఆడే క్రమంలో ఆదిల్ రషీద్(2-11) ఓవర్లో శనక వికెట్ ఇచ్చేశాడు. అతడు ఔటయ్యాక 13 పరుగులకే శ్రీలంక ఇన్నింగ్స్‌కు రషీద్ తెరదించాడు. ఆల్‌రౌండ్ షోతో ఆతిథ్య జట్టుకు చెక్ పెట్టిని ఇంగ్లండ్ 51 పరుగులతో గెలుపొంది.. గ్రూప్ బీలో బోణీ కొట్టింది.

**సాల్ట్ ఒక్కడే**

సూపర్ 8 తొలి పోరులో ఇంగ్లండ్ ఆరంభంలో తడబడినా పోరాడగలిగే స్కోర్ చేసింది. శ్రీలంక స్పిన్నర్లు దునిత్ వెల్లలాగే(3-26), థీక్షణల(2-21)లు అద్భుతంగా కట్టడి చేయడంతో టాపార్డర్, మిడిలార్డర్ తేలిపోయింది. ఓవైపు వికెట్లు పడుతున్నా ఓపెనర్ ఫిల్ సాల్ట్(62) ఒత్తిడిలోనూ అర్ధ శతకంతో మెరిశాడు. ఆఖర్లో విల్ జాక్స్(13), జేమీ ఓవర్టన్(10 నాటౌట్)లు దూకుడుగా ఆడడంతో ఇంగ్లండ్ నిర్ణీత ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 150 పరుగులు చేసింది.

# హనుమంతుడి జన్మస్థలంలో గ్రాండ్‌గా మొదలైన 'జై హనుమాన్' రిషబ్ శెట్టితో భారీ సీక్వెల్!



విజయనగర సామ్రాజ్య పుణ్యక్షేత్రం, హనుమంతుడి జన్మస్థలంగా భావించే హంపిలోని అంజనాద్రి బెట్ట సాక్షిగా 'జై హనుమాన్' చిత్రానికి ఆదివారం అత్యంత వైభవంగా పూజా కార్యక్రమాలు జరిగాయి. ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుంచి వస్తున్న ఈ భారీ సీక్వెల్‌ను మైత్రీ మూవీ మేకర్స్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. ఈ వేడుకలో చిత్ర బృందంతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. గత ఏడాది కాలంగా రణవీర్ సింగ్ ప్రాజెక్ట్ వంటి ఇతర పరిణామాల వల్ల ఈ సినిమా ఆలస్యమైనప్పటికీ, నేటి పూజా కార్యక్రమాలతో పనులు అధికారికంగా ఊపందుకున్నాయి. ఈ చిత్రంలో హనుమంతుడి పాత్రలో 'కాంతార' ఫేమ్ రిషబ్ శెట్టి నటిస్తుండగా, రానా దగ్గుబాటి ఒక కీలక పాత్రలో మెరవనున్నారు. మొదటి భాగం హీరో తేజ సజ్జా కూడా ఈ సినిమాలో భాగం కావడం విశేషం. పాన్ ఇండియా స్థాయిలో భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ 2026 మార్చి లేదా ఏప్రిల్ నెలల్లో ప్రారంభం కానుంది. మొదటి భాగం కంటే విజువల్స్ పరంగా అద్భుతంగా ఉండేలా 'అంజనాద్రి 2.0' పేరుతో సరికొత్త ప్రపంచాన్ని దర్శకుడు ప్రశాంత్ వర్మ సిద్ధం చేస్తున్నారు. భక్తి, యాక్షన్ కలగలిపి ఈ చిత్రాన్ని అద్భుత దృశ్యకావ్యంగా మలిచేందుకు చిత్ర యూనిట్ సన్నద్ధమవుతోంది.





# సోషల్ మీడియా ట్రోలింగ్.. సామ్ రియాక్షన్ ఇదే!

దర్శకుడు రాజ్ నిడిమోరును పెళ్లి చేసుకున్నాక సమంత ముఖం వెలిగిపోతోంది. ఒకప్పుడు విచారంగా కనిపించే తన ముఖం ఇప్పుడు వెయ్యి ఓట్ల బల్బులా ప్రకాశిస్తోంది. ప్రస్తుతం సంతోషకర జీవితం గడుపుతున్న సామ్ మా ఇంటి బంగారం అనే చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. పెళ్లి తర్వాత ఆమె నుంచి వస్తున్న మొదటి సినిమా ఇదే కావడం విశేషం! ఈ చిత్రం మే 15న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

**ఏదీ నన్ను కదిలించలేదు**

ఇదిలా ఉంటే తాజాగా తను సోషల్ మీడియాలో అభిమానులతో చిట్‌చాట్ చేసింది. ఫ్యాన్స్ అడిగిన పలు ప్రశ్నలకు ఓపికగా సమాధానాలిచ్చింది. సోషల్ మీడియాలో వచ్చే ప్రశంసలు, విమర్శలపై మీరు ఎలా స్పందిస్తారు? అని ఓ వ్యక్తి అడిగారు. అందుకు సమంత స్పందిస్తూ.. ప్రశంసలు నన్ను కదిలించలేవు. అలాగే విమర్శలు కూడా నన్ను ఎఫెక్ట్ చేయవు. కానీ, నెగెటివిటీని నా ఇంటివరకు తీసుకొస్తే మాత్రం మిమ్మల్ని బ్లాక్ చేస్తాను.

**దానర్థం అదే..**

అలా నా స్పేస్‌ను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచుకుంటాను. మిమ్మల్ని బ్లాక్ చేశానంటే నేను బాధపడ్డానని కాదు. మీలాంటివారికి నాదగ్గర చోటు లేదని అర్థం అని రిప్లై ఇచ్చింది. మీలోని ఓ ఫన్నీ థింగ్ ఏంటని అడగ్గా.. కిందపడి మరీ నవ్వుతానంది. ఎక్కువ బాధ లేదా ఒత్తిడికి గురైనప్పుడు ఏం చేస్తారని అడగ్గా.. ధ్యానం చేస్తానని బదులిచ్చింది.

**సినిమా**

మా ఇంటి బంగారం సినిమా విషయానికి వస్తే.. ఇందులో సమంత పెళ్లయిన అమ్మాయిగా కనిపించనుంది. అలాగే ఆపద వచ్చినప్పుడు కత్తి పట్టేందుకు కూడా వెనుకాడని శివంగిగానూ అలరించనుంది. గుల్షన్ దేవయ్య కీలక పాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి నందిని రెడ్డి దర్శకత్వం వహించింది.

# ఈ అవార్డ్ వారికే అంకితమిస్తున్నా: అల్లు అర్జున్

పుష్ప-2 మూవీకి ఉత్తమ నటుడిగా ఫిల్మ్ ఫేర్ అవార్డ్ రావడంపై ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ స్పందించారు. ఇంత అద్భుతమైన గౌరవం ఇచ్చినందుకు ఫిల్మ్‌ఫేర్‌కు ధన్యవాదాలు తెలిపారు. నన్ను ఇంతలా ప్రేమించే దేశంలో అవార్డ్ స్వీకరించడం చాలా ఆనందంగా ఉందన్నారు. మీ అందరి ప్రేమ, ఆశీర్వాదాలకు తానెప్పుడు విధేయుడినని ట్వీట్ చేశారు. ఈ అవార్డ్‌ను హద్దుల్లేని నా అభిమానుల ప్రేమకు అంకితం చేస్తున్నట్లు బన్నీ ప్రకటించారు. కాగా..కేరళలోని కొచ్చిన్‌లో జరిగిన 70వ ఫిల్మ్ ఫేర్ అవార్డ్స్‌లో ఐకాన్‌స్టార్ ఉత్తమ నటుడిగా అవార్డ్ అందుకున్నారు. 2024లో విడుదలైన పుష్ప-2 చిత్రానికి ఈ ఘనత సొంతం చేసుకున్నారు. ఈ చిత్రానికి ఉత్తమ దర్శకుడిగా సుకుమార్, బెస్ట్ మ్యూజిల్ ఆల్బమ్‌కు దేవీశ్రీ ప్రసాద్, ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్ విభాగంలో రామకృష్ణ అండ్ మోనిక అవార్డులు అందుకున్నారు. అంతేకాకుండా 2024లో ఉత్తమ చిత్రంగా పుష్ప-2 నిలిచింది. ఈ చిత్రం తెలుగు ఇండస్ట్రీలో అత్యధికంగా ఐదు విభాగాల్లో ఫిల్మ్ ఫేర్ అవార్డులు కొల్లగొట్టింది.



# నిరాశపర్చిన రాజాసాబ్.. పీపుల్ మీడియా ఫ్యాక్టరీకి ప్రభాస్ మరో ఛాన్స్.. !

గ్లోబర్ స్టార్ యాక్టర్ ప్రభాస్ రీసెంట్‌గా రాజాసాబ్ సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చాడని తెలిసిందే. టాలీవుడ్ టాప్ లీడింగ్ బ్యానర్ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ తెరకెక్కించిన ఈ చిత్రం బాక్సాఫీస్ ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను ఇంప్రెస్ చేయలేకపోయింది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ మూవీ పీపుల్ మీడియా ఫ్యాక్టరీకి నిరాశనే మిగిల్చిందని చెప్పాలి. ఇదిలా ఉంటే ప్రభాస్ మరోసారి ఇదే బ్యానర్‌లో సినిమా చేసేందుకు రెడీ అవుతున్నాడన్న వార్త ఒకటి నెట్టింట హల్ చల్ చేస్తోంది. ఫెయిల్యూర్ తర్వాత ప్రభాస్ నిర్మాత టీజీ విశ్వప్రసాద్‌ను కలిసి మరో సినిమా చేస్తానని హామీనిచ్చాడట. బాక్సాఫీస్ ఫలితాలతో సంబంధం లేకుండా ప్రభాస్ తీసుకున్న ఈ నిర్ణయం మరోసారి తన గొప్ప మనసును చాటుతోంది. ప్రభాస్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ రీయూనియన్ ప్రాజెక్టుకు సంబంధించి త్వరలోనే అధికారిక ప్రకటన రాబోతుందట. మరి ఈ సినిమాను డైరెక్ట్ చేయబోయేది ఎవరో..? ప్రభాస్ స్టార్‌డమ్‌కు తగ్గకుండా ఎలివేట్ చేసేలా ఈ కొత్త ప్రాజెక్టు ఉండాలని ఆశిస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఎప్పుడెప్పుడు అఫీషియల్ అనౌన్స్‌మెంట్ ఉంటుందా..? అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు మూవీ లవర్స్. ప్రభాస్ ఖాతాలో ప్రస్తుతం సలార్ 2తోపాటు ఫౌజీ, స్పిరిట్ సినిమాలున్నాయి.

వార్తాతరంగాలు
బుధవారం 25 ఫిబ్రవరి 2026

## తమిళనాడులో 74 లక్షల ఓట్లు తొలగింపు

తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల నగారా మోగనున్న తరుణంలో ఓటర్ల జాబితా ప్రక్షాళన ప్రక్రియ ఒక కొలిక్కి వచ్చింది. ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ అనంతరం ఈరోజు తుది జాబితాను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి అర్చనా పట్నాయక్ విడుదల చేశారు. తాజా జాబితా ప్రకారం రాష్ట్రంలో మొత్తం ఓటర్ల సంఖ్య 5.67 కోట్లుగా నమోదైంది. గతంలో ఉన్న 6.41 కోట్ల ఓటర్లతో పోలిస్తే, ఈ ప్రక్షాళనలో ఏకంగా 74 లక్షల మంది ఓటర్లను జాబితా నుంచి తొలగించడం గమనార్హం. డూప్లికేట్ ఓట్లు, మరణించిన వారి పేర్లు, నివాసం మారుతున్న వారి వివరాలను క్షుణ్ణంగా వెరిఫై చేసిన తర్వాతే ఈ భారీ తొలగింపులు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. లింగ నిష్పత్తి పరంగా చూస్తే ఈసారి కూడా తమిళనాడులో మహిళా ఓటర్లే ఆధిపత్యం ప్రదర్శిస్తున్నారు. మొత్తం 5,67,07,380 మంది ఓటర్లలో 2.89 కోట్ల మంది మహిళలు ఉండగా, 2.77 కోట్ల మంది పురుషులు, 7,617 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. డిసెంబర్ 19 నుంచి జనవరి 30 వరకు వచ్చిన లక్షలాది అప్లికేషన్లను పరిశీలించి, అర్హులైన కొత్త ఓటర్లను కూడా జాబితాలో చేర్చారు. ఈ వేసవిలో జరగబోయే ఎన్నికల కోసం ఈ జాబితానే కీలకం కానుంది.

## తేజస్ 'క్రాష్' కాలేదు..

## చిన్న సాంకేతిక సమస్యే: హెచ్‌ఏఎల్ స్పష్టత

**తేజస్ జెట్ క్రాష్ అయిందన్న వార్తలను ఖండించిన హెచ్‌ఏఎల్**

**అది ప్రమాదం కాదని, భూమిపై జరిగిన చిన్న సాంకేతిక సమస్య అని వెల్లడి**

**ప్రపంచంలోనే తేజస్‌కు అత్యుత్తమ భద్రతా రికార్డు ఉందని ప్రకటన**

**ఈ ఘటనపై ఐఏఎఫ్‌తో కలిసి లోతైన విచారణ జరుపుతున్నట్లు స్పష్టీకరణ**

భారత వైమానిక దళానికి చెందిన తేలికపాటి యుద్ధ విమానం (ఎల్‌సీఏ) తేజస్ 'క్రాష్' అయిందంటూ వచ్చిన మీడియా నివేదికలను హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్‌ఏఎల్) ఖండించింది. అది ప్రమాదం కాదని, కేవలం ఒక చిన్న సాంకేతిక సమస్య మాత్రమేనని సోమవారం స్పష్టం చేసింది. ఈ మేరకు హెచ్‌ఏఎల్ అధికారిక ప్రకటన విడుదల చేసింది. "తేజస్ ఘటనపై వచ్చిన మీడియా కథనాలను గమనించాం. ఇందులో వాస్తవాలను స్పష్టం చేయాలనుకుంటున్నాం. తేజస్ విమానం క్రాష్ అయినట్లు ఎటువంటి నివేదిక లేదు. అది కేవలం ఒక చిన్న సాంకేతిక సమస్య మాత్రమే" అని హెచ్‌ఏఎల్ తన ప్రకటనలో పేర్కొంది. సమకాలీన యుద్ధ విమానాల్లో ప్రపంచంలోనే అత్యుత్తమ భద్రతా రికార్డులు తేజస్ సొంతమని బలంగా సమర్థించుకుంది. ఈ సమస్యపై నిబంధనల ప్రకారం లోతైన విశ్లేషణ చేస్తున్నామని, భారత వైమానిక దళంతో కలిసి త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపింది. ఫిబ్రవరి 7న ఒక ఫ్రంట్‌లైన్ ఎయిర్‌బేస్‌లో తేజస్ జెట్ బ్రేక్ ఫెయిల్యూర్ కారణంగా రన్‌వేను దాటిందని, విమానం ఎయిర్‌ఫ్రేమ్‌కు పెద్ద నష్టం వాటిల్లిందని, పైలట్ సురక్షితంగా బయటపడ్డాడని కొన్ని మీడియా నివేదికలు పేర్కొన్నాయి. ఈ నివేదికలను హెచ్‌ఏఎల్ తప్పుడు సమాచారంగా తోసిపుచ్చింది. ఈ ఘటన తర్వాత, భారత వైమానిక దళం (ఐఏఎఫ్) తమ వద్ద ఉన్న సుమారు 30-35 తేజస్ విమానాలన్నింటినీ తనిఖీల కోసం తాత్కాలికంగా నిలిపివేసినట్లు (గ్రౌండెడ్) సమాచారం. ప్రస్తుతం ఈ ఘటనపై భారత వైమానిక దళం 'కోర్ట్ ఆఫ్ ఎంక్వైరీ'కి ఆదేశించింది.

## ఎర్రకోటకు ఖలిస్థానీ ఉగ్రవాదుల బెదిరింపులు



**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో సోమవారం హఠాత్తుగా హై అలర్ట్ ప్రకటించారు. చారిత్రక కట్టడం ఎర్రకోటతో పాటు ఢిల్లీ రాష్ట్ర పరిపాలనా కేంద్రమైన సచివాలయానికి (అసెంబ్లీ) బాంబు బెదిరింపులు రావడంతో కలకలం చెలరేగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఈ-మెయిల్ ద్వారా పంపిన హెచ్చరికలతో భద్రతా దళాలు వెంటనే అప్రమత్తమయ్యాయి. ఈ బెదిరింపు ఈమెయిల్ ఒక ఖలిస్థానీ ఉగ్రవాద గ్రూపు పేరుతో వచ్చినట్లు ప్రాథమిక సమాచారం అందుతోంది. రాజధానిలోని అత్యంత కీలకమైన ఎర్రకోట, సచివాలయం ప్రాంతాలను బాంబులతో పేల్చివేస్తామన్న సందేశం అందగానే ఢిల్లీ పోలీసులు రంగంలోకి దిగి, గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ ఘటన నేపథ్యంలో ఢిల్లీ సచివాలయం వద్ద పోలీసులు భారీ భద్రతను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అసెంబ్లీ ప్రాంగణంలో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. అనుమానాస్పద వస్తువులను గమనిస్తున్నారు. ఒకవైపు గాలింపు చర్యలు కొనసాగుతుండగానే, మరోవైపు ఈ-మెయిల్ మూలాలను కనిపెట్టేందుకు దర్యాప్తు సంస్థలు సాంకేతిక ఆధారాలను విశ్లేషిస్తున్నాయి. ఖలిస్థానీ సానుభూతిపరుల పేరిట వచ్చిన ఈ బెదిరింపుల వెనుక అసలు కుట్రదారులు ఎవరనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ప్రస్తుతం ఢిల్లీవ్యాప్తంగా భద్రతను మరింత కట్టుదిట్టం చేసి, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పర్యవేక్షిస్తున్నారు.

## అమెరికా దాడుల భయం..

## ఇరాన్‌లో పరిస్థితి ఉద్రిక్తం..

**తక్షణమే ఆదేశాన్ని వీడండి .. భారత పౌరులకు ఎంబసీ అడ్వయిజరీ**

**న్యూ ఢిల్లీ :** ఏ క్షణమైనా ఇరాన్ పై అమెరికా దాడులు చేయవచ్చునన్న అంచనాలు, విద్యార్థుల ఆందోళనలతో ఆ దేశంలో పరిస్థితులు మళ్లీ ఉద్రిక్తంగా మారాయి. ఈ నేపథ్యంలో ఇరాన్‌లోని భారత పౌరులకు అక్కడి మన తాజాగా అడ్వయిజరీ జారీచేసింది. తక్షణమే ఆ దేశాన్ని వీడాలని సూచించింది.'ఇరాన్‌లో మారుతున్న పరిస్థితుల దృష్ట్యా జనవరి 5న భారత ప్రభుత్వం జారీచేసిన మార్గదర్శకాలకు కొనసాగింపుగా మళ్లీ అడ్వయిరీ జారీ చేస్తున్నాం. ప్రస్తుతం ఇరాన్‌లో ఉన్న భారతీయులు (విద్యార్థులు, యాత్రికులు, వ్యాపారవేత్తలు, పర్యాటకులు) కమర్షియల్ విమానాలతో సహా అందుబాటులో ఉన్న ప్రయాణ మార్గాల ద్వారా ఇరాన్‌ను తక్షణమే విడిచిపెట్టి వెళ్లండి. భారత పౌరులు, భారత సంతతి వ్యక్తులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించండి. ఆందోళనలు జరిగే ప్రాంతాలకు దూరంగా ఉండండి. ఇరాన్‌లోని భారత ఎంబసీతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతూ ఉండండి' అని ఇరాన్‌లోని భారత ఎంబసీ తన అడ్వయిజరీలో పేర్కొన్నది.అలాగే తాజా పరిణామాల సమాచారం కోసం స్థానిక మీడియాను గమనిస్తూ ఉండాలని సూచించింది. భారతీయులంతా పాస్‌పోర్ట్‌లు, ఐడీ కార్డులతో సహా తమ ప్రయాణ, ఇమిగ్రేషన్ పత్రాలను ఎల్లప్పుడూ తమవద్ద సిద్ధంగా ఉంచుకోవాలని చెప్పింది. ఈ విషయంలో ఎలాంటి సాయం కోసమైనా భారత రాయబార కార్యాలయాన్ని సంప్రదించాలని పేర్కొంది. ఇప్పటివరకు ఎంబసీ వద్ద మీ పేర్లు నమోదు చేసుకోకపోతే వెంటనే రిజిస్టర్ చేయించుకోవాలి' అని భారత ఎంబసీ తన అడ్వయిజరీలో తెలిపింది.ఇరాన్-అమెరికా దేశాల మధ్య అణు చర్చలు ఇప్పటికీ కొలిక్కిరాలేదు. ఈ చర్చలు విఫలమైతే ఇరాన్‌పై దాడికి వెనుకాడబోమని అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్ సంకేతాలిచ్చారు. ఇప్పటికే అమెరికా పలు విమాన వాహక నౌకలు, జలాంతర్గాములు, ఫైటర్ జెట్‌లను పశ్చిమాసియాలో మోహరించింది. ఈ నేపథ్యంలోనే టెహ్రాన్‌లో మరోసారి ఆందోళనలు చెలరేగాయి. పలు యూనివర్సిటీలకు చెందిన విద్యార్థులు నిరసనలు చేపట్టారు. ఈ పరిణామాలతో ఇరాన్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

# బంగాల్‌లో అధికార మార్పు తీసుకురావాలి

మరికొద్ది నెలల్లో బంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. బంగాల్‌లో అధికార మార్పు తీసుకురావాలని (ప్రభుత్వాన్ని మార్చాలని) ప్రజలను కోరారు. బంగాల్‌ను 'సోనార్ బంగ్లా'గా మారుస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు బంగాల్ ప్రజలకు నరేంద్ర మోదీ సోమవారం లేఖ రాశారు. ఈ లెటర్లను బీజేపీ కార్యకర్తలు రాష్ట్ర ప్రజలకు అందించనున్నారు.

"మరికొద్ది నెలల్లో బంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఆ ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయిస్తాయి. రానున్న తరం భవిష్యత్తు మీరు బాగా ఆలోచించి తీసుకునే నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. నేడు 'సోనార్ బంగ్లా' గురించి కలలు కనే ప్రతి యువకుడు, వృద్ధుడు, మహిళలు చాలా బాధలో ఉన్నారు. వారి బాధ నా హృదయాన్ని తాకింది. అందువల్ల నేను నా గుండె లోతుల్లో నుంచి ఒక తీర్మానం చేస్తున్నాను. బంగాల్‌ను వికసిత్ (అభివృద్ధి చెందిన), సంపన్నమైన రాష్ట్రంగా మార్చాలనేది నా సంకల్పం" అని మోదీ లేఖలో పేర్కొన్నారు.



**టీఎంసీపై విమర్శలు**

గత 11 ఏళ్లుగా దేశ ప్రజల ఆశీర్వాద బలంతో తమ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, సమగ్ర అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. రైతుల సంక్షేమం నుంచి యువత కలలను నెరవేర్చడం వరకు, మహిళలను సాధికారపరచడం నుంచి సమాజంలోని ప్రతి వర్గాన్ని చేరుకోవడం వరకు తమ ప్రభుత్వ విధానాలు, నిరంతర ప్రయత్నాల సానుకూల ఫలితాలు నేడు స్పష్టంగా కనిపిస్తున్నాయని అన్నారు. ఈ క్రమంలో బంగాల్‌లో అధికారంలో ఉన్న టీఎంసీ సర్కార్‌పై మోదీ మండిపడ్డారు.

"బంగాల్ ప్రభుత్వం నుంచి సరైన సహకారం లేకపోయినా రాష్ట్రంలో దాదాపు 5 కోట్ల మంది ప్రజల చేత 'జన్ ధన్ యోజన' ఖాతాలు ఓపెన్ చేయించాం. 'స్వచ్ఛ భారత్ అభియాన్' కింద రాష్ట్రంలో 85 లక్షల మరుగుదొడ్లు నిర్మించాం. బంగాల్‌ను పాలిస్తున్న టీఎంసీ సర్కార్ పేదల జీవనోపాధిని లాక్కుంటోంది. మేము మాత్రం చిరు వ్యాపారులు, వ్యవస్థాపకులకు రూ.2.82 లక్షల కోట్ల విలువైన రుణాలు అందించాం. 'అటల్ పెన్షన్ యోజన' కింద 56 లక్షల మంది సీనియర్ సిటిజన్స్‌కు ఊరట కల్పించాం. 'ఉజ్వల యోజన' ద్వారా కోటి కుటుంబాలకు ఎల్‌పీజీ కనెక్షన్‌లను అందించాం. తద్వారా మాతృమూర్తులు, సోదరీమణులను పొగ నుంచి విముక్తి కల్పించాం."

**అన్నదాతల ముఖాల్లో చిరునవ్వులు నింపాం!**

బంగాల్ రైతులు దేశం మొత్తానికి ఆహారం సరఫరా చేస్తున్నారని, కానీ తమ కుటుంబాలను పోషించడానికి వారు కష్టపడుతున్నారని మోదీ అన్నారు. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో 'కిసాన్ సమ్మాన్ నిధి' ద్వారా 52 లక్షల మంది రైతులకు ప్రత్యక్ష ఆర్థిక సహాయం చేస్తున్నామని అన్నారు. తద్వారా అన్నదాతల ముఖాల్లో చిరునవ్వులు నింపడం అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. "బంగాల్ దేశ ఆర్థిక వ్యవస్థ దిశను నిర్ణయించేది. పారిశ్రామిక అభివృద్ధిలో అగ్రగామిగా ఉండేది. కానీ నేడు ఈ అద్భుతమైన రాష్ట్రం దీనావస్థను చూసి నా మనసు బాధపడుతోంది. 6 దశాబ్దాల బుజ్జగింపు రాజకీయాల కారణంగా బంగాల్‌కు జరిగిన కోలుకోలేని నష్టాన్ని మాటల్లో వ్యక్తపరచలేం. ఓ వైపు యువత ఉపాధి లేకపోవడం వల్ల ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లాల్సి వస్తుంది. మరోవైపు రాష్ట్రంలోని మహిళలు తమకు భద్రత లేదని భావిస్తున్నారు. స్వామి వివేకానంద, రిషి అరబిందో కలలు కన్న బంగాల్ నేడు ఓటు బ్యాంకు రాజకీయాలు, హింస, అరాచకత్వంతో నిండిపోయింది" అని మోదీ పేర్కొన్నారు.

అక్రమ చొరబాట్లు, మహిళలపై హింసతో బంగాల్ మునిగిపోయిందని మోదీ ఆరోపించారు. దేశంలోని అనేక రాష్ట్రాల్లో నేడు జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని, పేదల ముఖాల్లో చిరునవ్వులు వికసించాయని అన్నారు. బంగాల్‌లో కూడా ఈ అభివృద్ధి, పురోగతిని తాను తీసుకొస్తానని తెలిపారు. భరతమాత ముద్దుబిడ్డలు కలలు గన్న బంగాల్‌ను పునర్నిర్మిద్దామని పిలుపునిచ్చారు. 2026 నాటికి రాష్ట్రాన్ని వికసిత్ బంగాల్‌గా మారుస్తామని ప్రమాణం చేద్దామని అన్నారు.

"మీకు సేవ చేసే అవకాశం నాకు లభిస్తే ప్రతి క్షణాన్ని మీ ముఖంలో చిరునవ్వు తీసుకురావడానికి ప్రయత్నిస్తాను. అవినీతి నుంచి ప్రజలను విముక్తి చేస్తాను. మహిళల భద్రత కోసం పాటుపడతాను. మన పిల్లలు (బంగాల్ యువత) ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. మత హింసకు గురైన మన శరణార్థ సోదర సోదరీమణులు సీఏఏ ద్వారా పౌరసత్వం పొందుతారు" అని మోదీ స్పష్టం చేశారు.

# దేశంలో తొలి 'కౌంటర్ టెర్రరిజం పాలసీ'

# 'ప్రహార్'తో ఇక ఉగ్రవాదులకు చుక్కలే!

ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపేందుకు కేంద్ర హోం శాఖ సిద్ధమైంది. 'ప్రహార్' పేరుతో దేశంలో తొలి ఉగ్రవాద నిరోధక విధానాన్ని (కౌంటర్ టెర్రరిజం పాలసీ) తీసుకొచ్చింది. ఉగ్రవాద సవాళ్లను ఎదుర్కొనే రీతిలో ఈ పాలసీని రూపొందించారు. సీమాంతర ఉగ్రవాదం, సైబర్ దాడులు, డ్రోన్ల దుర్వినియోగం, సాంకేతిక సవాళ్లను ఎదుర్కొనేందుకు ఈ పాలసీని తీసుకొచ్చారు. ఈ మేరకు కేంద్ర హోంశాఖ సోమవారం తన వెబ్‌సైట్‌లో ప్రహార్ డాక్యుమెంట్‌ను అప్లోడ్ చేసింది.




"సీమాంతర ఉగ్రవాదంతో పాటు నేరస్థులైన హ్యాకర్లు, ఇతర దేశాలు సైబర్ దాడుల ద్వారా భారత్‌ను టార్గెట్ చేస్తున్నాయి. భారతదేశం నీరు, భూమి, గాలి ద్వారా ఉగ్రవాద ముప్పులను ఎదుర్కొంటోంది. విద్యుత్, రైల్వేలు, విమానయానం, ఓడరేవులు, రక్షణ, అంతరిక్షం, అణుశక్తితో సహా దేశ ఆర్థిక వ్యవస్థలోని కీలకమైన రంగాలను విదేశీ శక్తులు, ముష్కరుల నుంచి రక్షించే సామర్థ్యాలను అభివృద్ధి చేశాం." అని హోం శాఖ 'ప్రహార్' డాక్యుమెంట్‌లో పేర్కొంది.

**హోంశాఖ డాక్యుమెంట్‌లో కీలక విషయాలు**

"ఉగ్రవాదాన్ని ఓ మతానికి, ప్రాంతానికి, నాగరికతకు భారత్ ఆపాదించబోదు. భారతదేశం అన్ని రకాల ఉగ్రవాదాన్ని ఖండిస్తుంది. నిరంతరం ఉగ్రవాద బాధితులకు అండగా నిలుస్తుంది. ప్రపంచంలో హింసకు ఎటువంటి చోటు లేదని నమ్ముతుంది. ఈ క్రమంలో జీరో టాలరెన్స్ విధానాన్ని అనుసరిస్తుంది. సరిహద్దు అవతల నుంచి చేసే స్పాన్సర్డ్ టెర్రరిజం భారత్‌పై చాలా కాలంగా ప్రభావం చూపుతోంది. జిహాదీ టెర్రర్ గ్రూపులు, వారికి సంబంధించిన సంస్థలు దేశంలో దాడులకు ప్రణాళికలు వేసి అమలు చేస్తూనే ఉన్నాయి." అని హోం శాఖ డాక్యుమెంట్‌లో వెల్లడించింది.

**'విదేశాల నుంచి ముష్కరులు కుట్రలు'**

ఆల్‌ఖైదా, ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్ అండ్ సిరియా (ఐఎస్ఐఎస్) వంటి టెర్రర్ గ్రూప్స్ గురించి కూడా ఈ పాలసీలో కేంద్ర హోం శాఖ ప్రస్తావించింది. ఈ టెర్రర్ గ్రూపులు స్లీపర్ సెల్స్ ద్వారా భారత్‌లో హింసను ప్రేరేపించడానికి ప్రయత్నించాయని పేర్కొంది. విదేశాల నుంచి పనిచేస్తున్న ముష్కరులు దేశంలో ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడానికి కుట్రలు పన్నారని స్పష్టం చేసింది. పంజాబ్, జమ్ముకశ్మీర్ లాంటి రాష్ట్రాల్లో ఉగ్ర సంస్థలు డ్రోన్లు వాడి తమ నెట్‌వర్క్‌ను పెంచే ప్రయత్నం చేస్తున్నాయని వెల్లడించింది.

"డిజిటల్ టెక్నాలజీని టెర్రరిస్టులు వాడుతున్నారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు, ఇన్‌స్టంట్ మెసేజింగ్ అప్లికేషన్‌లు, ఎన్‌క్రిప్షన్ టూల్స్, డార్క్ వెబ్, క్రిప్టో వాలెట్‌లను ఉగ్రవాద ప్రచారం, నిధులు, కార్యాచరణ మార్గదర్శకత్వం కోసం ఉపయోగిస్తున్నారు. ముష్కరులు వాడే జదీ=చీజుణ (కెమికల్, బయోలాజికల్, రేడియోలాజికల్, న్యూక్లియర్, ఎక్స్‌ప్లోజివ్, డిజిటల్) వంటి వాటిని యాక్సెస్ చేయడం ఉగ్రవాద నిరోధక (కౌంటర్ టెర్రరిజం) ఏజెన్సీలకు ఒక సవాల్‌గా మిగిలిపోయింది. దేశం గాలి, భూమి, నీటి ద్వారా ప్రమాదాలను ఎదుర్కొంటోంది. "అని హోం శాఖ 'ప్రహార్' డాక్యుమెంట్‌లో పొందుపర్చింది.

ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే విధానంలో భాగంగా కేంద్ర హోంశాఖ ఓ రోడ్‌మ్యాప్‌ను సైతం రూపొందించింది. నేరస్థులపై కేసులను బలంగా నమోదు చేసేందుకు ఎఫ్ఐఆర్ నమోదు నుంచి దర్యాప్తు జరిగే వరకు ప్రతి దశలోనూ లీగల్ నిపుణుల సలహా తీసుకోవాలని పేర్కొంది. దేశ యువతను ఉగ్ర గ్రూపులు రిక్రూట్ చేసుకుంటున్నాయని, అలాంటి వ్యక్తులపై న్యాయపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించింది. తీవ్ర హింసకు పాల్పడినా, యువతను ప్రలోభ పెట్టినా ఆ తర్వాత జరిగే పరిణామాల గురించి ఎన్జీఓలు, మతపరమైన నాయకులకు వివరించనున్నట్లు తెలిపింది. భద్రతా సమస్యలను ఓ సహకార పద్ధతిలో, సాంకేతికంగా, కమ్యూనిటీ స్థాయిలో పరిష్కరించే రీతిలో సూచనలు చేస్తూ ప్రహార్ డాక్యుమెంట్‌ను తీసుకొచ్చారు.

**ప్రహార్ లక్ష్యాలు ఏంటంటే?**

దేశ పౌరులను రక్షించడానికి ఉగ్రవాద దాడులను నివారించడం

కేంద్ర, రాష్ట్ర సంస్థల మధ్య సమన్వయాన్ని తేవడం

చట్టపరమైన విధానాలను పాటిస్తూ మానవ హక్కులను కాపాడడం

ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే పరిస్థితులను అరికట్టడం (తగ్గించడం)

అంతర్జాతీయంగా ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి ప్రపంచ భాగస్వాములతో కలిసి పనిచేయడం

# లంచం, అవినీతే సీఎం అసలైన స్నేహితులు'- స్టాలిన్‌పై విజయ్ ఫైర్

తమిళనాడు రాజకీయాల్లో ఎన్నికల వేడి పెరుగుతున్న వేళ, నటుడిగా స్టార్‌డమ్ సాధించి రాజకీయాల్లోకి అడుగుపెట్టిన విజయ్ అధికార పార్టీ డీఎంకేను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్?పై తీవ్ర ఆరోపణలు గుప్పిస్తూ, ఆయన అసలైన స్నేహితులు లంచం, అవినీతి, స్వార్థ రాజకీయాలేనని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మోసం చేస్తున్నారని మండిపడ్డారు. వెల్లూరులో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడిన విజయ్, ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి ప్రచారం పూర్తిగా నాటకమని అన్నారు. "రాష్ట్రాన్ని సూపర్‌స్టార్ స్టేట్ చేశామని చెబుతున్నారు. కానీ ప్రజల జీవన స్థాయిలో మార్పు ఎక్కడుంది?" అంటూ ప్రశ్నించారు. తమిళనాడు గతంలో నిజమైన అభివృద్ధిని చూసిందంటే అది కామరాజ్, అన్నాదురై, ఎంజీఆర్ వంటి మహానేతల కాలంలోనేనని గుర్తుచేశారు.

**చరిత్రాత్మక ఎన్నికలుగా నిలుస్తాయంటూ!**

ఆ రోజుల్లో ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగేదని, ఇప్పుడు మాత్రం ప్రచారం, రాజకీయ లాభాలే ముఖ్యమైపోయాయని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వాన్ని ఉల్టా మోడల్ గవర్నమెంట్, స్టాండ్అప్ కామెడీ ప్రభుత్వం అంటూ ఎద్దేవా చేశారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలు సాధారణ ఎన్నికలు కావని, చరిత్రాత్మక ఎన్నికలుగా నిలుస్తాయని విజయ్ పేర్కొన్నారు. "ఈసారి అందరూ కలిసి నన్నే లక్ష్యంగా చేసుకున్నారు. అయినా ప్రజలే నా బలం" అన్నారు. అసలు పోరు తన పార్టీ తమిళగ వెట్రి కళగం (టీవీకే) డీఎంకే మధ్యేనని స్పష్టం చేశారు. "తమిళనాడు అంటే విజయ్- విజయ్ అంటే తమిళనాడు" అంటూ భావోద్వేగ వ్యాఖ్యలు చేసిన ఆయన, ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వాన్ని తీసుకురావడమే తన లక్ష్యమని చెప్పారు. స్టాలిన్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ కాగితాలకే పరిమితమ య్యా యని, పేదల సమస్యలు అలాగే ఉన్నాయని ఆరోపించారు. టీవీకే అధికారంలోకి వస్తే రాష్ట్రంలోని ప్రతి జిల్లాకు వెళ్లి ప్రజలను స్వయంగా కలుస్తానని హామీ ఇచ్చారు. ప్రతి పౌరుడి సమస్యను వినిపించి పరిష్కారం చూపుతానన్నారు. ప్రజల ఓటు హక్కు పవిత్రమని, ఎవరూ దాన్ని లాక్కోలేరని స్పష్టం చేశారు. తమ పార్టీ ఎన్నికల గుర్తు విజల్?కు ఓటు వేయాలని కార్యకర్తలు, అభిమానులను కోరారు. "మా ఓటు, మా హక్కు" అంటూ నినాదాలు చేశారు.



**రాజకీయాల్లో ఆసక్తి**

ఇదిలా ఉండగా, రాష్ట్ర రాజకీయాల్లో ప్రధానంగా అధికార డీఎంకే కూటమి, ప్రతిపక్ష అఖిల భారత అన్నా ద్రవిడ మున్నేట్ర కళగం (ఏఐఏడీఎంకే) ఆధ్వర్యంలోని ఎన్డీఏ కూటమి మధ్య పోటీ నెలకొంది. ఎన్డీఏలో భారతీయ జనతా పార్టీ కీలక పాత్ర పోషిస్తోంది. ఇక డీఎంకే కూటమిలో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ సహా పలు పార్టీలు భాగస్వాములుగా ఉన్నాయి. ఈ రాజకీయ సమీకరణాల మధ్య విజయ్ పార్టీ టీవీకే కొత్త శక్తిగా రంగప్రవేశం చేయడం రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. సినీ కెరీర్‌కు గుడ్‌బై చెప్పి పూర్తిస్థాయిలో రాజకీయాలపై దృష్టి పెట్టిన విజయ్, యువత మరియు అభిమానుల మద్దతుతో ముందుకు సాగుతున్నారు. ఆయన సభలకు భారీగా జనసందోహం తరలివస్తుండటం రాజకీయ వర్గాల్లో ఇపప్డు చర్చనీయాంశమవుతోంది. అధికార పార్టీపై నేరుగా దాడి చేస్తూ, ప్రజలతో భావోద్వేగ అనుబంధం పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారు. మొత్తానికి, విజయ్ వ్యాఖ్యలతో తమిళనాడు రాజకీయాల్లో వేడి మరింత పెరిగింది.

VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137